

షిఫ్ ల్యాండింగ్ నుంచి బోటుపై సముద్రంలోకి ప్రయాణిస్తున్న జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో ప్రసన్నలక్ష్మి

బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన

నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో ప్రసన్నలక్ష్మి

ఒంగోలురూరల్ జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం గుండాయపాలెం గ్రామానికి తూర్పున గల బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్నలు బుధవారం స్థల పరిశీలన చేశారు. గుండాయపాలెం గ్రామ మత్స్యకారులు గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు బకింగ్‌హాం కాలువపై ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని వినతిపత్రాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వంతెన కోసం నిధులు మంజూరు చేయటానికి ప్రతిపాదనలు

మిగతా 6లో...



చందలూరులో ఆయుర్వేద వైద్యశాల స్థలాన్ని ఆక్రమించి వేసిన షెడ్లు

వైద్యశాల స్థలం అన్యాక్రాంతం

- యథేచ్ఛగా షెడ్లు వేసి ఆక్రమించిన వ్యాపారులు
- పట్టించుకోని అధికారులు

దర్శి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ భూముల ఆక్రమణలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. అక్రమార్కులు కూటమి ప్రభుత్వంలో కూడా చెలరేగి పోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా చేసేస్తున్నారు. తాజాగా మండలంలోని చందలూరులో ఆయుర్వేద వైద్యశాలకు కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసి, షెడ్లు వేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. అధికారులు ఖాళీ చేయమని చెప్పినా పట్టించుకోలేదు. చందలూరులో ఆయుర్వేద వైద్యశాలకు దాతలు 20 ఏళ్ల క్రితం

మిగతా 6లో...



పుల్లలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

వైద్యో నారాయణో హరి అంటారు. డాక్టర్ దేవుడితో సమానంగా భావిస్తారు. కానీ కొందరు వైద్యులు వంకర బుద్ధి చూపుతున్నారు. తోటి సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్నారు. తోటి వైద్య సిబ్బందిని బెదిరించి లోబర్చుకుంటున్నారు. ఇటువంటి వ్యవహారాలకు పాల్పడిన ఒకరిని బదిలీ చేస్తే మరొకరు ఇవే పనులకు పాల్పడుతున్నారు. ఎర్రగొండపాలెం నియోజక వర్గంలోని పుల్లలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న ఈ తంతుపై ఉన్నతాధికారులకు గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ఇక్కడకు ఎవరొచ్చినా ఇదే తీరు అవలంబించడంతో జిల్లా అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇదేమి ఆరోగ్యం?

పుల్లలచెరువు పీహెచ్‌సీలో దారుణాలు

- సిబ్బందిపై లైంగిక వేధింపులు
- గతంలో వైద్యుడిపై ఫిర్యాదులు
- వాటిపై కొనసాగుతున్న విచారణ
- తాజాగా మరో వైద్యుడిపైనా అవే ఆరోపణలు
- చర్యలు తప్పవన్న జిల్లా వైద్యాధికారి

త్రిపురాంతకం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని పుల్లలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. సిబ్బందిని బెదిరించి కొందరు వైద్యులు కీచకులుగా మారుతున్నారు. వైద్యశాలలో ఏం జరిగినా బయటకు పొక్కకుండా అధికారులు ఎప్పటికప్పుడు ఈ సమస్యలను సరిచేస్తూ నెట్టుకొస్తున్నారు. ఇదేమని ఆగ్రహంతో ప్రజలెవరైనా ఫిర్యాదులు చేస్తే జిల్లాలో మారుమూల ప్రాంతం కావడంతో ఇక్కడకు వచ్చే వైద్యులు లేరండీ అనే విషయాన్ని బూచిగా చూపి సర్దుకుపొమ్మంటున్నారు.

గతంలో ఇలా..

పుల్లలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15 ఏళ్ల కిందట పనిచేసిన సీహెచ్‌వో (కమ్యూనిటీ హెల్త్ ఆఫసర్) ఒకరు వైద్యశాలలోని తన గదిలో మంచం ఏర్పాటు చేసుకుని సిబ్బందిని లోబరుచుకుని రాసలీలలు చేస్తున్న వ్యవహారం అప్పట్లో మీడియా ద్వారా బయటకు వచ్చింది. విచారణకు వచ్చిన అధికారులు వైద్యుడి సకల సౌకర్యాలు చూసి విస్తుపోయారు. అతనిని బదిలీ చేసి చేతులు దులుపుకున్నారు. ఆ తరువాత రెండేళ్ల క్రితం ఇదే ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యాధికారి తమను లైంగికంగా వేధిస్తున్నారని కొందరు ఏఎన్‌ఎంలు ప్రజాప్రతినిధులను, జిల్లా అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. వారి నుంచి సరైన స్పందన లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు కూడా నమోదైంది. ఆరోపణలున్న వైద్యుడిపై శాఖా పరమైన విచారణ జరుపుతూ కాలయాపన చేస్తూ జిల్లా

మిగతా 6లో...



విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం



గతంలో వైద్యాధికారిపై వచ్చిన ఫిర్యాదుపై విచారణ జరిపి నివేదిక తయారు చేశాం. ప్రస్తుతం మళ్లీ ఇప్పుడు మరో వైద్యాధికారిపై వచ్చిన ఫిర్యాదుపై కూడా ఒక కమిటీని వేసి విచారించిన తరువాత చర్యలు తీసుకుంటాం. విధులకు హాజరు కాకుండా ఉన్న ఉద్యోగిపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం. అసాంఘిక చర్యలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదు. కఠిన చర్యలు తీసుకుంటాం.

- డి.వెంకటేశ్వరరావు, జిల్లా వైద్యశాఖాధికారి



తగ్గని నోబిడ్‌లు

- లోగ్రేడ్‌లు కొనేందుకు ముందుకు రాని బయ్యర్లు
- పొగాకు మార్కెట్లో కొనసాగుతున్న ఒడిదొడికులు

ఒంగోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పొగాకు మార్కెట్లో తిరస్కరణ(నోబిడ్)ల పర్వం కొనసాగుతూనే ఉంది. రోజువారీ అమ్మకాలకు వచ్చే బేళ్లలో నోబిడ్‌ల సంఖ్య తగ్గించేందుకు పొగాకు బోర్డు అధికారులు తీసుకుంటున్న చర్యలకు వ్యాపారుల నుంచి సహకారం అందడం లేదు. చివరకు కనిష్ఠ ధరలను గతం కన్నా కిలోకు రూ.20 తగ్గించి బోర్డు అధికారులు బిడ్ పెట్టినా లోగ్రేడ్‌లను కొనేందుకు బయ్యర్లు ఆసక్తిచూపక బుధవారం కూడా నోబిడ్‌లో దక్షిణాది మార్కెట్‌లో 20శాతంపైగా ఉన్నాయి. గత వారం పదిరోజుల వరకు సగటున 25 నుంచి 30శాతం వరకు నోబిడ్‌లు దక్షిణాదిలో ఉండగా గరిష్ఠ ధర కిలో రూ.280, కనిష్ఠ ధర కిలో రూ.200గా ఉంది. కొన్ని వేలం కేంద్రాల్లో నోబిడ్‌లు 35 నుంచి 40శాతం వరకు కూడా ఉండేవి. రైతుల ఆందోళన, రాజకీయపక్షాల వత్తిడి నేపథ్యంలో బోర్డు అధికారులు నోబిడ్ల తగ్గింపుపై దృష్టిసారించారు. కనిష్ఠ ధరలను తగ్గించడం ద్వారా నోబిడ్లను తగ్గించాలనే భావనకు

మిగతా 6లో...



ఏఎన్‌ఎంలకు వెబ్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు

సజావుగా ఏఎన్‌ఎంల వెబ్ కౌన్సెలింగ్

ముమ్మరంగా సాగుతున్న బదిలీల ప్రక్రియ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల వెబ్ కౌన్సెలింగ్ బుధవారం కూడా కొనసాగింది. కలెక్టరేట్‌లోని వైద్యశాఖ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంల బదిలీల ప్రక్రియను నిర్వహించారు. జిల్లాలో పనిచేస్తున్న 133మంది ఏఎన్‌ఎంలను వెబ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏఎన్‌ఎంల వారీగా స్క్రీన్‌పై ఖాళీల వివరాలను అందుబాటులో ఉంచారు. వారు కోరుకున్న స్థానాలకు బదిలీలు చేశారు. వైద్యశాఖ పరిధిలో ఉద్యోగుల బదిలీలు ప్రశాంతంగా జరగడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ కార్యక్రమంలో వైద్యశాఖ పరిపాలనాధికారి గీతాంజలి, సూపరింటెండెంట్ రాజేష్, డేటా మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్‌అదాలత్



ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో వచ్చేనెల 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి బుధవారం తెలిపారు. ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులందరూ సహకరించాలన్నారు. రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారం చెల్లింపు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువురి ఆమోదంతో పరిష్కరిస్తారన్నారు. న్యాయ స్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్నవారు ఉపయోగించుకొని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలని కోరారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులలో తీర్పు అంతిమ తీర్పు అని అన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి కోరారు.

యువకుడి దారుణ హత్య

- మృతుడు మర్రిపూడి ఎంఈవో ఆఫీసులో డేటా ఆపరేటర్‌గా గుర్తింపు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కనిగిరి డీఎస్పీ సాయియశ్వంత్



రాజశేఖర్ (ఫైల్)

మర్రిపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన మర్రిపూడి పృథులగిరి మెట్ల మార్గం సమీపంలో యువకుడు బుధవారం ఉదయం దారుణ హత్యకు గురయ్యాడు. స్థానిక మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో డేటాఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న కొల్లా రాజశేఖర్(35) ఈ దుర్ఘటనలో మరణించారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రాజశేఖర్ ఉదయం అల్పాహారం పార్శిల్ కట్టించుకుని తన ద్విచక్రవాహనంపై కొండవైపు వెళ్లాడు. గుర్తుతెలియని దుండగులు ద్విచక్రవాహనాన్ని కారుతో ఢీకొట్టి, అతని ప్రైవేటు పార్టులో కోసి దారుణంగా హింసించి చంపివేసినట్లు మృతదేహాన్ని పరిశీలిస్తే అర్థమవుతోంది. సమాచారం అందుకున్న కనిగిరి డీఎస్పీ సాయియశ్వంత్, పొన్నలూరు ఎస్‌ఐ కె.అనూక్ హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. రోడ్డుకు ఒకవైపున మృతదేహం, మరోవైపున ద్విచక్రవాహనం పడి ఉన్నాయి. సంఘటనా స్థలంలో అల్పాహారం పొట్లాలతోపాటు తాగిపడేసిన మద్యం బాటిల్ కూడా లభ్యమైంది. ఉదయం స్థానికంగా ఒక హోటల్‌లో ఆహార పొట్లాలు కట్టించుకుని వెళ్లినట్లు తెలిసింది. అంతకుముందు ఎంఈవో కార్యాలయానికి వెళ్లి ముఖహాజరు వేయించుకునేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. కార్యాలయం సమయం కాకపోవడంతో ముఖహాజరు నమోదుకానట్లు తెలిసింది. 11 గంటల ప్రాంతంలో మెట్ల సమీపంలో మృతదేహం పడిఉన్నట్లు కొందరు గుర్తించడంతో

మిగతా 6లో...

- ఇళ్ల వద్దకు వెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు
- చట్టాలను అతిక్రమిస్తే పీడీ యాక్టు అమలు
- లాడ్జీలపై నిఘా
- ఒంగోలు సబ్ డివిజన్‌లో 397 రౌడీషీట్లు, 467 మంది అనుమానితులు



రౌడీలకు ముకుతాడు

రౌడీల విచ్చలవిడితనంపై పోలీసు శాఖ గురి పెట్టింది. రౌడీషీటర్లు, పాతనేరస్థులపై దృష్టి సారించింది. రెండు నెలల్లో జిల్లాలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తూ నేరాల నియంత్రణకు గట్టి చర్యలు తీసుకుంటోంది. పోలీసులు.. రౌడీ షీటర్ల ఇళ్ల వద్దకెళ్లి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. లాడ్జీలను జల్లెడ పడుతున్నారు. పాత నేరస్థులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అల్లర్లకు ప్రేరేపించినా, అసాంఘిక కార్యకలాపాలలో పాలుపంచుకున్నా పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఒంగోలు క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో లాడ్జిలలో పాతనేరస్థులు మకాం వేసి నేరాలకు పాల్పడ్డట్టు పోలీసులు గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన తెలుగుదేశం నాయకుడు వీరయ్య చౌదరి హత్య కేసు నిందితులు లాడ్జీలలో రోజులు తరబడి మకాం వేయడం గమనార్హం. ఓ హోటల్ యజమానిని రౌడీ షీటర్ హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. మరో రౌడీషీటర్ సమూహిక దాడులకు పాల్పడ్డాడు. ఇలా ఒంగోలులో జరిగిన వరుస నేరాలపై పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. రౌడీలపై ఉక్కుపాదం మోపేందుకు సిద్ధమైంది.

మూడు రోజులు కౌన్సెలింగ్

ఒంగోలు నగరంలో ఉన్న రౌడీషీటర్లు, పాతనేరస్థుల ఇళ్లకు పోలీసుల అధికార్లు వెళ్లి కౌన్సెలింగ్ చేస్తున్నారు. ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు నేతృత్వంలో పోలీసు అధికారులు, సిబ్బంది రౌడీల కదలికలు తెలుసుకునేందుకు నేరుగా వారి ఇళ్లకు వెళుతున్నారు. వారి కుటుంబ సభ్యులకు

మిగతా 6లో...

తగ్గని నోబిడ్లు

(5వపేజీ తరువాయి)
వచ్చారు. తదనుగుణంగా అప్పటివరకు కిలో రూ.200లుగా ఉన్న కనిష్ఠ ధరలను రూ.180కి తగ్గించారు. తద్వారా లోగ్రేడ్ బేళ్లకు బోర్డు అధికారులు తాము సూచించే ధరలకు వ్యాపారులు కొనుగోలు చేస్తారని భావించారు. అయితే ఆశించిన స్థాయిలో వ్యాపారులు కొనుగోళ్లకు ముందుకు రాలేదు. స్వల్పంగా మాత్రమే నోబిడ్‌లు తగ్గాయి. దీంతో మరింతగా కనిష్ఠ ధరలు తగ్గించడం ద్వారా తిరస్కరణల సంఖ్య తగ్గేలా చూడాలని బోర్డు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం వరకు కిలో రూ.180గా ఉన్న కనిష్ఠ ధరలను మంగళవారం రూ.160కి పలు కేంద్రాల్లో తగ్గించారు.

కనిష్ఠ ధరలు తగ్గింపు

దక్షిణాదిలోని 11వేలం కేంద్రాల్లో రెండు చోట్ల మంగళవారం కిలో రూ.180 నుంచి కనిష్ఠ ధర తగ్గించగా బుధవారం ఏడు కేంద్రాల్లో తగ్గించి వేశారు. అయినా నోబిడ్లలో అంతగా తగ్గుదల కనిపించలేదు. సగటున దక్షిణాదిలో బుధవారం 20.35శాతం నోబిడ్ బేళ్లు ఉన్నాయి. కనిష్ఠ ధర కిలో రూ.180గా ఉన్న కలిగిరి కేంద్రంలో 30.54శాతం బేళ్లు తిరస్కరణ కాగా కనిష్ఠ ధర కిలో రూ.160గా తగ్గించిన పొదిలి కేంద్రంలో నోబిడ్లు 28శాతం వరకు ఉన్నాయి. ఇతర కేంద్రాల్లో పరిశీలిస్తే డీసీపల్లిలో 26.60శాతం, వెల్లంపల్లిలో 29.53శాతం, ఒంగోలు-1లో 22.60 శాతం, ఒంగోలు-2 కేంద్రంలో 20.32 శాతం, టంగుటూరులో 21.70శాతం నోబిడ్లు ఉన్నాయి. అదే సమయంలో బుధవారం మొత్తం 11 కేంద్రాల్లో అత్యధికంగా 1,126 బేళ్లు అమ్మకానికి వచ్చిన కందుకూరు-1 కేంద్రంలో కేవలం నాలుగు శాతం బేళ్లు మాత్రమే తిరస్కరణ కనిష్ఠ ధర కిలో రూ.160కి తగ్గించిన కనిగిరిలో నోబిడ్‌లు 10.68 శాతంగా ఉన్నాయి. అలా ఒకటి రెండు చోట్ల తగ్గినా మొత్తంగా దక్షిణాది మార్కెట్లో కనిష్ఠ ధరలను తగ్గించినా తిరస్కరణ బేళ్ల సంఖ్య మాత్రం పెద్దగా తగ్గకపోవడంతో వాటిని తిరిగి ఇళ్లకు తీసుకెళ్లేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

యువకుడి దారుణ హత్య

(5వపేజీ తరువాయి)
గ్రామంలో కలకలం రేగింది. మృతదేహాన్ని చూసేందుకు గ్రామస్థులు, మహిళలు పెద్దఎత్తున కొండసమీపానికి చేరుకున్నారు. వివాహేతర సంబంధం ఏదైనా ఉంటుందా అనే కోణంలో కూడా పోలీసులు విచారిస్తున్నారు. రాజశేఖర్ స్వగ్రామం అయిన కంభం మండలం తురిమెళ్లలో ఇంకేమైనా విభేదాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసుల దర్యాప్తు సాగుతోంది. స్థానిక హోటల్‌లో ఆరుగురికి ఆహారపొట్లాలు కట్టించుకున్నట్టు తెలియడంతో ముందుగానే హంతకులు రాజశేఖర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చి ఉంటారని భావిస్తున్నారు. పట్టపగలు హత్య జరగడంతో గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. ఎస్‌ఐ శరత్ ఆధ్వర్యంలో జాగిలం మృతదేహం సమీపంలో కలియతిరిగింది. హతుడికి భార్య కల్యాణి, ఐదేళ్ల కుమార్తె ఉన్నారు. హత్యాప్రదేశంలో అతడికి సంబంధించిన సెల్‌ఫోన్ కూడా లభ్యమైంది. కాల్‌డేటా ఆధారంగా నిందితులను గుర్తించే అవకాశం ఉంది. ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్‌ఐ అనూక్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వైద్యశాల స్థలం అన్యాక్రాంతం

(5వపేజీ తరువాయి)
14.5 సెంట్లు స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఇప్పటివరకు భవన నిర్మాణానికి నోచుకోలేదు. తొలుత వైద్యాధికారిని నియమించగా చందలూరులో వైద్యసేవలు అందించారు. ఆయన వెళ్లిన తరువాత వైద్యుల నియామకం జరుగలేదు. దీంతో ఆయుర్వేద వైద్యానికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైద్యాధికారిని నియమించారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

వైద్యశాల స్థలాన్ని కాపాడాలని గ్రామస్థులతో కలిసి బుధవారం దర్శి తహసీల్దార్ ఎం.శ్రావణ్ కుమార్‌కు వైద్యాధికారి ఫిర్యాదు చేశారు. దాతలు ఇచ్చిన స్థలంలోని ఆక్రమణలు తొలగించి తిరిగి వైద్యశాలకు అప్పగించాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బర్లీ పొగాకు కొనుగోలు చరిత్రాత్మకం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రజాకూటమి ప్రభుత్వం లక్ష్యమని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. వేల ఎకరాల్లో సాగుచేసుకున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ముందుకు రావడం చరిత్మాక అంశమన్నారు. బుధవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసి నేడు ప్రారంభించనున్న నల్లబర్లీ పొగాకు కేంద్ర ప్రాంగణాన్ని, గోడౌన్లను ఎమ్మెల్యే ఏలూరి మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, వ్యవసాయ అధికారులు, రైతుల నేతృత్వంలో పరిశీలించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లబర్లీ రైతులను ఆదుకొని న్యాయం చేసేందుకు కొనుగోలుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రస్తుతం రూ.300 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. అవసరమైతే మరో రూ.వెయ్యి కోట్లు కూడా కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండు గ్రేడ్‌ల ద్వారా నాణ్యమైన పొగాకు క్వింటా రూ.12000,


మార్క్‌ఫెడ్ డీఎంను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

లోగ్రేడ్ పొగాకు రూ.6000 చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. ఇప్పటికే రైతుల వివరాలను వ్యవసాయశాఖ ద్వారా సేకరించినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడీఏ ఎస్.మోహనరావు, ఏవోలు రామమోహనెడ్డి, భాస్కర్‌రావు, నాయకులు వెంకట్రావు, నాయుడు హనుమంతురావు, షంషుద్దీన్, ఏజీపీ నరేంద్రకుమార్, కారుమంచి కృష్ణ, కొల్లా శ్రీనివాసరావు, పోత్రు శోభన్, రాముడు, వెంకటేశ్వర్లు, శివరాంప్రసాద్, పోపూరి శ్రీనివాసరావు, పఠాన్ సమీర్ పాల్గొన్నారు.

పర్చూరు ఏఎంసీని పరిశీలించిన కలెక్టర్

పర్చూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ వెంకటమురళీ, మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) జిలానీ సామూన్, వ్యవసాయ, రెవెన్యూశాఖ అధ్వర్యంలో పరిశీలించారు. నేడు బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. నాణ్యమైన పొగాకు క్వింటా రూ.12వేలు, లోగ్రేడ్ పొగాకు క్వింటా రూ.6వేల చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీవో గ్లోరియా, మార్కెఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడీఏ ఎస్.మోహనరావు, ఆయా శాఖల అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, మార్క్‌ఫెడ్ ఎండీ జిలానీ సామూన్, ఆర్డీవో గ్లోరియా

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధిత చట్టంపై వైద్యాధికారులు, స్వచ్ఛంద సంస్థలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ పరిధిలో ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు 44, ప్రభుత్వ వైద్యశాలల్లో ఐదు ఉన్నాయన్నారు. డివిజన్ పరిధిలో ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. వెయ్యి మంది మగ పిల్లలకుగాను 981 మంది ఆడపిల్లలు ఉన్నారన్నారు.

ఈ నిష్పత్తి అంతరాన్ని తగ్గించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.పద్మావతి, టౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ శ్రావణ్‌తేజ, డాక్టర్ శివారెడ్డి, మదర్సస్ ఇండియా సంస్థ సెక్రటరీ జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పెద్ద దోర్నాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ చెప్పారు. మండలంలోని నల్లగుంట్ల, లకచెర్ల గిరిజన గ్రామాల్లో దర్తి ఆబ జన్ భగీదరి అభియాన్ కార్యక్రమంపై బుధవారం చెంచు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంటు డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ మాట్లాడుతూ 17 మంత్రిత్వ శాఖల ద్వారా ప్రవేశపెట్టిన పథకాల్లో భాగంగా ప్రతి ఒక్కరికీ పక్కాగృహం, ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, రేషన్‌కార్డుల మంజూరు, ఉజ్వల గ్యాస్ సిలిండర్, ఆధార్ కార్డు అందజేత వంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత అధికారులకు సహకరించి అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏవో జవహర్ లాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు శివకోటేశ్వరరావు , రంగయ్య, ఏఈవో చైతన్యకుమార్, టీపీ షేక్ లాల్ అహ్మద్, హౌసింగ్ ఏఈ సోమశంకర్, గిరిజన నాయకులు మంతయ్య, వీఆర్‌వో చెన్నయ్య పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ : ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను చెంచు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రగొండపాలెం తహసీల్దారు డి. మంజునాథరెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని గుర్రపుశాల, చెర్లోతాండా, వేగినాటి కోటయ్యనగర్ కాలనీలలో దర్తి ఆబ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ఆయా గూడాలలో చెంచు కుటుంబాలను గుర్తించి వారికి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, సిబ్బంది, చెంచులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టడవిని తలపిస్తున్న పోలీసు క్వార్టర్స్

అద్దంకిలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం

రెండు దశాబ్దాల క్రితం శిథిలావస్థకు

అద్దంకి, జూన్18(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో సుమారు 4 దశాబ్దాల క్రితం పోలీస్ క్వార్టర్స్ నిర్మించారు. అయితే రెండు దశాబ్దాల క్రితం నుండి భవనాలు శిథిలావస్థకు చేరడం ప్రారంభమయ్యాయి. సుమారు 15 సంవత్సరాల క్రితం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో పూర్తిగా మూసివేసి సుమారు 7 సంవత్సరాల క్రితం శిథిలమైన భవనాలను భవనాలను తొలగించారు. అద్దంకి పట్టణంలో ఎన్టీఆర్ నగర్ వద్ద నామ్‌రోడ్డు వెంబడి సుమారు 2.50 ఎకరాల విస్తీర్ణంలో పోలీస్ క్వార్టర్స్ స్థలం ఉంది. అయితే కొద్ది భాగంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. మిగిలిన స్థలంలో చెట్లు పెరిగి చిట్టడవిని తలపించేలా మారింది. దీంతో విషసర్పాలు చేరే ప్రమాదం ఉందని సమీప గృహాల ప్రజలు కూడా భయపడుతున్నారు. పోలీసు క్వార్టర్స్ లేకపోవడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది నివాసానికి ఇబ్బంది పడుతున్నారు. అద్దంకి పట్టణంలో ఇళ్లఅద్దెలు ఎక్కువగా ఉండడం సిబ్బందికి మరింత భారంగా మారింది. అధికారులు, సిబ్బంది బదిలీలు జరిగినప్పడల్లా అద్దె ఇళ్ల కోసం వేట సాగించాల్సిన పరిస్థితి. అద్దంకి పట్టణంలో త్వరలో డిఎస్పీ కార్యాలయం కూడా ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉండడంతో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణంపై ప్రజా ప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.


క్వార్టర్స్ స్థలంలో పెరిగిన వేపచెట్లు

శవాలకూ జాగారమే..!

- అద్దంకి ప్రభుత్వాసుపత్రి మార్చురీలో కొరవడిన వసతులు • మృతదేహాలను నిల్వ ఉంచేందుకు ఫ్రీజర్ బాక్సులు కరువు
- ప్రైవేట్ వ్యక్తులు ఇచ్చిన ఫ్రీజర్‌లే వైద్యశాలకు దిక్కు • గుర్తు తెలియని మృతదేహాలను భద్రపరిచేందుకు అవస్థలు



అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీ గది

అద్దంకిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో మార్చురీ గదిలో వసతులు కొరవడ్డాయి. వివిధ సంస్థలు, దాతలు గతంలో ఆస్పత్రికి ఇచ్చిన ఫ్రీజర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఇక వైద్యశాలకు పోస్టుమార్టం కోసం వచ్చిన మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేంత వరకు భద్రపరచడం ప్రహసనంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు అద్దె ప్రాతిపదికన ఉన్న ఫ్రీజర్ల కోసం వేచి ఉంచాల్సి వస్తోంది. ఇక మార్చూరీకి గుర్తు తెలియని మృతదేహాలను ఎవరివో కనుగొనేందుకు కనీసం మూడు రోజుల పాటు భద్రపరచాల్సి ఉంటుంది. ఇక్కడ ఫ్రీజర్లు లేకపోవడంతో ఇలాంటి మృతదేహాలను భద్రపరచడం వ్యయప్రయాసలతో ఇబ్బందులు తప్పడం లేదు. పోలీసులే నయానో భయానో ప్రైవేటు ఫ్రీజర్లల్లో ఉంచుతున్నారు. ఇక వైద్యశాలకు వచ్చే మృతదేహాలను ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న మార్చరీ బాక్సులలో పెట్టి వాటికి డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి వైద్యశాల వద్ద నెలకొంది.


బాక్సులు

వైద్యశాలకు ఒక వైపు జాతీయ రహదారి, మరొక వైపు రాష్ట్రీయ రహదారి ఉండడంతో ఏదో ఒకచోట తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. వీటితో పాటుగా అద్దంకి నియోజకవర్గంలోని వివిధ మండలాలలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరిగి ప్రతి రోజు పోస్టుమార్టం కోసం మృతదేహాలను అద్దంకి వైద్యశాలకు తీసుకొస్తుంటారు. ఈ క్రమంలో వైద్యశాలలో మృతదేహాలను భద్ర పరిచేందు కు ఫ్రీజర్‌బాక్సులు లేకపోవడంతో అద్దెబాక్సులే దిక్కయ్యాయి. దీంతో మృతుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. గతంలో వైద్యశాలకు వివిధ సంస్థలు, దాతలు సమకూర్చిన ఫ్రీజర్లు మరమ్మతులకు గురికావడంతో వాటిని పక్కన పడేశారు. అయితే పలుమార్లు మరమ్మతులు చేయించిన అవి పని చేయడం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. దీంతో పోస్టుమార్టం కోసం వచ్చిన మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రైవేట్ వ్యక్తులకు చెందిన మార్చరీ బాక్సులను నగదు చెల్లించి నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 30 పడకల వైద్యశాల కావడంతో మార్చరీలో కనీస వసతులు లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తేనే వైద్యశాలకు మరిన్ని వసతులు సమకూర తాయని పలువురు వైద్యాధికారులు అంటున్నారు. ఏదిఏమైనా మార్చురీ వద్ద ఫ్రీజర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొత్తవాటి కోసం ప్రతిపాదన పెట్టాం

ఇప్పటికే నాలుగైదు పర్యాయాలు మరమ్మతులకు గురైతే బాగుచేయించాం. ప్రస్తుతం అవకాశం లేకపోవడతో పక్కన పెట్టాం. ప్రభుత్వానికి ఒక ఫ్రీజర్ కావాలని నవేదికను పంపించాం.

వాహిలా చౌదరి, వైద్యశాల పర్యవేక్షణాధికారి

అవీఇవీ

వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై తీర్మానాలు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సైదా


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సైదా

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఈ నెల 24న జరిగే జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో తీర్మానాలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా అన్నారు. మార్కాపురంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న ఒంగోలులో జరిగే జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఆమె పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలు సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు.అన్ని ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రెహనాబాబు, జిల్లా మైనార్టీ విభాగం ఛైర్మన్ షేక్ షంషీర్ అలీ, కార్యదర్శి మహబూబ్ అలి, మార్కాపురం టౌన్, మండల, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, వి.రమేష్, షేక్ హుసేన్, ఎన్.ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

మూడు రోజులుగా వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం

ఎండిపోతున్న పంటలు.. రైతుల ఆందోళన

లైన్‌మన్ పనితీరుపై తీవ్ర విమర్శలు


తాళ్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడురోజులుగా తాళ్లూరు దక్షిణపొలాలకు వ్యవసాయ విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండు ముఖం పడుతున్నాయని పలువురు రైతులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. తాళ్లూరు లైన్‌మన్ బాబూరావు మూడురోజులుగా విద్యుత్ మరమ్మతులంటూ ఎల్‌సీలు తీసుకుని కోత విధిస్తున్నారన్నారు. గంటల కొద్దీ ఎల్‌సీ తీసుకోవడంతో వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం కలుగు తుందని వాపోయారు.సబ్ స్టేషన్ వద్దకు వచ్చి ప్రశ్నిస్తే లైన్‌మన్ ఎల్‌సీ తీసుకున్నాడని చెప్పారని, లైన్‌మన్‌కు ఫోన్ చేస్తే తీయకపోగా తమ పట్ల అవమర్యాదకరంగా మాట్లాడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రౌడీలకు ముకుతాడు

(5వపేజీ తరువాయి)
కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అవసరమైయితే పీడీ చట్టం నమోదు చేయడానికి వెనుకాడ బోమని హెచ్చరిస్తున్నారు. ఘర్షణల్లో పాల్గొన్నా, అసాంఘిక కార్యకలాపాల్లో పాలుపంచుకున్నా నగర బహిష్కరణ తప్పదని హెచ్చరిస్తున్నారు.

ఒంగోలు సబ్‌డివిజన్ పరిధిలో 397 మంది రౌడీలు

ఒంగోలు సబ్‌డివిజన్ పరిధిలో 397 మంది రౌడీ షీటర్లు, 467 మంది అనుమానితులు, 20 మంది డెకాయిట్స్, 8 మంది కేడీలు ఉన్నారు. మొత్తం 910 మంది ఉన్నట్లు పోలీసు రికార్డులు ఉన్నాయి. వీరిలో కొంతమంది మృతి చెందారు. మరి కొంతమంది వృద్ధులు ఉన్నారు. అయితే ప్రస్తుతం అనేక వివాదాలకు కారణం అవుతున్న కొంత మందిని పోలీసులు గుర్తించి వారిపై పూర్తి నిఘా ఉంచారు.

లాడ్జిలపై నిఘా

లాడ్జిలలో బస చేసే వారి రోజువారీ రికార్డులు పోలీసులు పరిశీలిస్తున్నారు. వారిలో పాతనేరస్థులు, రౌడీలు ఏవరైయినా ఉన్నారా అనే అనుమానంతో వేలిముద్రలను తీసుకుంటున్నారు. వారి వివరాలు సేకరించి పరిశీలన చేస్తున్నారు. సీసీ పుటేజీలను పరిశీలన చేసి నేరస్థులను గుర్తిస్తున్నారు.

ఇదేమి ఆరోగ్యం!

(5వపేజీ తరువాయి)
కార్యాలయంలో విధుల్లో ఉంచారు. ఈనెల 3వ తేదీన ఈ విషయంపై జిల్లా వైద్యశాఖాధికారి డి.వెంకటేశ్వరరావు పుల్లలచెరువులో విచారణ జరిపారు. ప్రతి ఉద్యోగినీ ఒక్కొక్కరిగా విచారించి నివేదికను తయారు చేస్తున్నామని, దీని అధారంగా తదుపరి చర్యలు ఉంటాయని విలేకరులు అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం చెప్పారు.

మరో వైద్యుడిదీ అదే తంతు

విచారణ ముగించుకుని వెళ్తున్న డీఎంహెచ్‌వోకు పుల్లలచెరువు మండలంలోని ఒక గ్రామానికి చెందిన ప్రజలు మరో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న మరో వైద్యాధికారి అండతో తమ గ్రామంలో పనిచేసే ఒక ఉద్యోగి 5 నెలలుగా అసలు గ్రామంలో లేరని, ఇతనికి ఆ ఉద్యోగికి ఉన్న సంబంధం ఏమిటో గాని విధులకు హాజరుకాకుండా ఉన్నప్పటికీ హాజరు, జీతం ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. ఈ వైద్యాధికారి కూడా కొందరు చిన్న ఉద్యోగుల బలహీనతలను ఆసరా చేసుకుని వారిని లోబరుచుకుంటున్నట్లు ఫిర్యాదు చేశారు. వైద్యశాలకు వచ్చే రోజులు తక్కువని ఇతర సమయాల్లో అతను పట్టణాల్లో షికార్లు చేస్తున్నట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయని వారు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఆ ఉద్యోగి తమ గ్రామంలో పనిచేయడం లేదని తక్షణమే తొలగించాలని గ్రామ పంచాయతీ సర్పంచ్ కూడా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు.

విస్తుపోయిన డీఎంహెచ్‌వో

గ్రామస్థుల ఫిర్యాదులనూ, వారు ఇచ్చిన ఆధారాలనూ చూసి డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు ఇదేంపని అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ తాజా వ్యవహారంలో మళ్లీ వైద్యాధికారిపై విచారణ, చర్యలు జరపాల్సి రావడంతో పాటు విధులకు హాజరుకాని ఉద్యోగిపై చర్యలు తీసుకునేందుకు డీఎంహెచ్‌వో వారికి హామీ ఇచ్చారు. మొత్తానికి ఈ వైద్యశాలలో వరుసగా జరుగుతున్న పరిణామాలను చూస్తున్న ప్రజలు జిల్లా అధికారులు ఇటువంటి విషయాల్లో కఠిన చర్యలు తీసుకోవాలని లేకుంటే మళ్లీ మళ్లీ పునరావృతమవుతూనే ఉంటాయని కోరుతున్నారు.

బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన

(5వపేజీ తరువాయి)
తయారుచేయటానికి జేసీ, ఆర్డీవో, ఇంజనీరింగ్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించారు. గుండాయపాలెం సమీపంలోని షిప్ ల్యాండింగ్ కేంద్రం నుంచి అధికారులు గుండ్లకమ్మ సముద్రంలో కలిసే ప్రదేశానికి బోటుపై ప్రయాణించారు. గుండ్లకమ్మ నుంచి పోయే బకింగ్‌హాం కాలువను కూడా పరిశీలించారు. అక్కడ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ నాయబ్ రసూల్, డీటీ అశోక్, ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

హెల్మెట్..జీవితానికి హైలైట్..!



దానిని ధరించకుండా రహదారులపై ద్విచక్రవాహనదారుల ప్రయాణం
రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాత
ఒక్క మార్టూరులోనే గత నాలుగునెలల్లో ఐదుగురు మృతి
ప్రాణాలు కోల్పోతున్నా రక్షణ చర్యలు తీసుకునేందుకు అనాసక్తి
పోలీసులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్న బైకిస్టులు

మార్టూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బైకులపై సరదాగా రివ్వున దూసుకుపోయే బైకర్లు పొంచి ఉన్న రోడ్డు ప్రమాదాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. లక్షల రూపాయలు వెచ్చించి బైక్‌లు కొంటున్న యువకులు వెయ్యి రూపాయలు వెచ్చించి హెల్మెట్ మాత్రం కొనుగోలు చేయడం లేదు. ఒక వేళ కొన్నా దానిని ధరించేందుకు చాలామంది అసలు ఇష్టపడడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే హెల్మెట్‌ను చీడపురుగు మాదిరి చూస్తున్నారు. రహదారులపై వాయువేగంతో దూసుకెళుతున్న వారు ప్రమాదాల బారినపడి ప్రాణాలు విడుస్తున్నారు. ఈ తరహా ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారే అధికమని పోలీసులు చెబుతున్నారు. వీరేగాక కుటుంబ సభ్యులు మహిళలతో కలిసి వందల కిలోమీటర్లు దూరం ప్రయాణించే వారు కూడా కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు.

ఇటీవల కాలంలో మార్టూరు మండల పరిధిలో ఐదుగురు యువకులు రోడ్డు ప్రమాదాలకు గురై, ప్రాణాలను పోగొట్టుకున్నారు. వారు హెల్మెట్‌ను ధరించినట్లయితే ప్రాణాలతో బయటపడేవారే. పోలీసుల తనిఖీలు చేస్తారనే, వారికి పట్టుబడితే అపరాధ రుసుం చెల్లించాలనే భయంతో మాత్రమే ఎక్కువ మంది ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను ధరిస్తున్నారు. పోలీసులు కూడా అడపాదడపా రోడ్లపై వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో హెల్మెట్ లేని వారిపై జరిమానా విధిస్తున్నారు. అంతేగాని వారు పకడ్బందీగా హెల్మెట్ లేని వారి కోసం తనిఖీలు చేయడంలేదు. ఏదో కూలి నాలి చేసుకొని పాత ద్విచక్రవాహనంపై వెళుతున్న కూలీలకు హెల్మెట్ లేకపోవడంతో, వారికి రూ.500 అపరాధ రుసుం విధించి చేతులు దులిపేసుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు.



హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం

షేక్ సైదా ఎస్ఐ మార్టూరు

నడిరోడ్డుపై వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో హెల్మెట్ లేని వారికి అవగాహన కల్పిస్తున్నాం.తద్వారా ట్రాఫిక్ సమయంలో మాకు విధుల నిర్వహణలో ఆటంకం ఏర్పడుతుంది. సమయం వృథా అవుతున్నా హెల్మెట్ వినియోగించాలని, రోడ్డు ప్రమాదాలు నుండి ప్రాణాలను కాపాడుకోవాలని అవగాహన కల్పిస్తూనే ఉన్నాం. వాహనదారులంతా క్షేమంగా ఇంటికి చేరాలనే పోలీసులు తనిఖీలు చేస్తుంటారు.

- ఈ ఏడాది జనవరి 1న విజయవాడ నుంచి ద్విచక్రవాహనంపై అద్దంకి సమీపంలోని ఒక చర్చిలో ప్రార్థనలకు వెళుతూ జాతీయరహదారిపై మార్టూరులోని దుర్గామల్లీశ్వరి దేవస్థానం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లు రాంబాబు, ఆయన భార్య ఉమాతో పాటు, అతని తోడల్లుడు పల్లపు గోపి కూడా ప్రాణాలు కోల్పోయారు.
- ఏప్రిల్ నెలలో 29వ తేదీన మండలంలోని కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద ఒంగోలు వైపు నుంచి ద్విచక్రవాహనంపై స్నేహితునితో కలిసి వస్తున్న పల్నాడు జిల్లా, డోకిపర్రు గ్రామానికి చెందిన బీటెక్ చదువుతున్న యువకుడు గుంటుపల్లి భరత్ రోడ్డు ప్రమాదంలో హెల్మెట్ లేని కారణంగా మృతి చెందారు.
- మే నెల 3న మార్టూరు నుంచి గన్నవరం రోడ్డులో యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ బ ట్టు రవికృష్ణ స్కూటీపై వస్తూ రోడ్డుప్రమాదానికి గురై కేవలం హెల్మెట్ లేని కారణంగా మృతి చెందారు.
- మే నెల 5వ తేదీన జాతీయ రహదారిపై మార్టూరు మండల పరిధిలో రెండు వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాలలో కేవలం హెల్మెట్ లేని కారణంగా ద్విచక్రవాహనాలలో ప్ర యాణిస్తున్న ఇద్దరు యువకులు వడ్లమూడి కాలేషా, కామేపల్లి జయకృష్ణల తలకు గాయాలయ్యాయి. సకాలం లో ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రాణాలతో బయటపడ్డారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తోడల్లుళ్లు గోపి, రాంబాబుతో భార్య ఉమా(ఫైల్)

ముంగిట్లో మురుగు



పాచిపట్టిన మురుగునీటితో బీసీ కాలనీలోని సీసీ రహదారి

చిన్నదోర్నాల బీసీ కాలనీలో దుస్థితి

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పెద్దదోర్నాల మండలంలో కీలకమైన పంచాయతీ చిన్నదోర్నాలలో రూ.లక్షల నిధులు ఖర్చు చేశారు. కానీ బీసీ కాలనీలోని కుమ్మరి వీధిని మాత్రం విస్మరించారు. సుమారు ఏడేళ్ల క్రితం టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆ ప్రాంతంలో సీసీ రహదారి నిర్మించారు. అప్పట్లో సైడు కాలువల నిర్మాణం చేపట్టలేదు. గత వైసీపీ ఐదేళ్ల కాలంలో సుమారు రూ.50 లక్షల మేర గ్రామంలో పంచాయతీ నిధులు ఖర్చు చేశారు. బీసీ కాలనీలోని కుమ్మరవీధిలో మురుగుపారే దారిలేక సీసీ రహదారిపైనే నిలిచిపోతున్నాయి. కాలంతో సంబంధం లేకుండా ఆ వీధిలోని సుమారు 20 గృహాల ప్రజలు పాచిపట్టి దుర్గంధం వెదజల్లే మురికి నీటి మధ్యనే సహజీవనం చేస్తున్నారు. గతంలో ఈ వీధిలోని పలువురు విషజ్వరాలబారిన పడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ సమస్య తీర్చండని ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆ వీధి ప్రజలు వాపోతున్నారు. ప్రభుత్వంలోనైనా తమ సమస్యకు ప్రజాప్రతినిధులు, అధికారులు పరిష్కార మార్గం చూపాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

పంగులూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని 16వ నంబరు జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి సమయంలో చోటుచేసుకుంది. హైవే అంబులెన్స్ సిబ్బంది అందించిన సమాచారం మేరకు.. కందుకూరు మండలం కోవూరుకు చెందిన ఇండ్ల బ్రహ్మయ్య ద్విచక్ర వాహనంపై కందుకూరు నుంచి విజయవాడకు వెళుతున్నాడు. జాతీయ రహదారిపై రేణంగివరం సమీపంలోని వేద కోల్డ్ స్టోరేజ్ వద్దకు చేరుకున్న సమయంలో కోల్డ్‌స్టోరేజ్‌లో పొగాకు చెక్కులు లోడ్ చేసుకున్న ట్రాక్టర్ రోడ్డుపైకి వస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న బ్రహ్మయ్యకు రెండు కాళ్లు విరిగాయి. తీవ్రంగా గాయపడిన బ్రహ్మయ్యను హైవే అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

కలెక్టరేట్ ఏవోగా రవి బాధ్యతలు స్వీకరణ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో)గా టి. రవి బాధ్యతలు స్వీకరించారు. సింగరాయకొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవిని ఇటీవల కలెక్టరేట్ ఏవోగా నియమిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన రవిని కలెక్టరేట్‌లోని వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఏవోగా బాధ్యతలు స్వీకరించిన రవి అంతకు ముందు కలెక్టర్, జేసీ,డీఆర్వోలను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు.

డీఈఎల్ఈడీ పరీక్షల్లో ఒకరు డీబార్

ఒంగోలు విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : మైనంపాడులోని జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో జరుగుతున్న డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) నాల్గవ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం ఒక విద్యార్థి డీబార్ అయ్యారు. డీఈవో కిరణ్‌కుమార్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ప్రశ్నాపత్రంపై ఏవో రాతలు ఉండటంతో ఆ విద్యార్థినిని పట్టుకొని డీబార్ చేశారు. మైనంపాడు డైట్‌లో 463 మంది డీఈఎల్ఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్నారు.

తహసీల్దార్ శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం



మంత్రుల చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

కొండపి, జూన్18 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర రాష్ట్రస్థాయి పాటల పోటీల్లో కొండపి తహసీల్దార్ శీలం శ్రీనివాసరావు మూడవస్థానంలో నిలిచి ప్రశంసాపత్రం బుధవారం అందుకున్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం పోటీలు జరగ్గా మూడవస్థానంలో నిలిచారు. యోగా నిత్య జీవితంలో ఎంతగా అవసరమో తన పాట ద్వారా వివరించి పలువురి మన్ననలు పొందారు. రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర పర్యాటకశాఖామంత్రి కందుల దుర్గేష్.. తహసీల్దార్ శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు.

మార్కాపురం ఉప విద్యాధికారిగా శ్రీనివాసులు

ఒంగోలు విద్య, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం డివిజన్ ఉప విద్యాధికారిగా పొదిలి మండల విద్యాధికారి-1 ఎం.శ్రీనివాసరావును నియమిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యా కమిషనర్ వి.విజయరామరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యా గుంటూరు ఆర్జేడీని కలిసి పూర్తి అదనపు బాధ్యతలతో ఉప విద్యాధికారి బాధ్యతలు స్వీకరించాలని ఆ ఉత్తర్వుల్లో కమిషనర్ ఆదేశించారు. మార్కాపురం ఉప విద్యాధికారిగా నియమితులైన శ్రీనివాసులును పొదిలి మండల టీచర్లు అభినందించారు.

డీఎస్సీకి 96 శాతం మంది హాజరు

ఒంగోలు విద్య, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్షకు 96 శాతం మంది హాజరైనట్లు ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కే శివకుమార్ తెలిపారు. జిల్లాలోని 8 పరీక్షా కేంద్రాల్లో రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతున్నాయని, పరీక్షకు 1,786మందికి 1,716 మంది హాజరు కాగా 70 మంది గైర్హాజరయ్యారు. ఉదయంసెషన్‌లో 986 మందికి 864 మంది,మధ్యాహ్నసెషన్‌కు 980 మందికి 852మంది హాజరయ్యారు.

విద్యార్థి మిత్ర కిట్లను వెంటనే పంపిణీ చేయాలి

ఒంగోలు విద్య, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు వెంటనే పంపిణీ చేయాలని సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మొదటి విడతగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, నిఘంటవులను విద్యార్థులకు అందజేయాలన్నారు. మిగిలిన వస్తువులు మండల పాయింట్లకు వంద శాతం చేరిన వెంటనే పాఠశాలలకు తరలించి పంపిణీ చేయాలని చెప్పారు. వచ్చే నెలలో జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నాటికి విద్యార్థులకు కొత్త యూనిఫాంలో పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

బార్లను తలపిస్తున్న దాబా హోటళ్లు

మందుబాబులకు సిట్టింగ్‌లు
అర్ధరాత్రి వరకు వీరంగం
చోద్యం చూస్తున్న పోలీసులు

ఒంగోలు క్రైం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రహదారుల పక్కన ఏర్పాటు చేసుకున్న దాబాహోటళ్లు మందుబాబులకు నిలయంగా మారాయి. అర్ధరాత్రి వరకు సిట్టింగ్‌లు ఏర్పాటు చేసి బార్లను తలపించే విధంగా మద్యం కూడా సరఫరా చేస్తున్నారు. అక్కడ మద్యం సేవించిన వారు నిత్యం గొడవలు చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారు. అర్ధరాత్రి వరకు అనుమతి లేకున్నా మద్యం సిట్టింగులతో మస్తు.. మస్తుగా ఎంజాయ్ చేస్తున్నారు. లైసెన్స్ ఫీజ్ చెల్లించిన బార్లు, మద్యం దుకాణాలు సమయపాలన పాటిస్తుండగా దాబా హోటళ్ల యాజమాన్యాలు ఇష్టానుసారంగా మందుబాబులకు సకల మర్యాదలు చేస్తున్నారు. దాబా హోటళ్లు మద్యం సరఫరా చేసి సిట్టింగ్‌లు ఏర్పాటు చేయడం వలన అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా మారుతున్నాయి. నిత్యం ఏదో ఒక దాబా హోటళ్లలో గొడవలు జరుగుతూనే ఉన్నాయి. ఒంగోలు నగరం చుట్టు ఉన్న దాబా హోటళ్లలో నేరుగా మద్యం సరఫరా చేసి సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అక్కడ ఏదో ఒక గొడవ వచ్చిన తరువాత పోలీసులు వెళ్లి వారిని పంపించి వేస్తున్నారు. నగరంలో రాత్రులు దుకాణాలు మూయిస్తున్న పోలీసులు దాబా హోటళ్ల వైపు కన్నెత్తి చూడకపోవడానికి కారణం వారు ఇచ్చే మామూళ్లే కారణమని చెప్పవచ్చు.

ఆర్ఎస్ దాబాలో తీవ్ర ఉద్రిక్తత

పెళ్లూరుకు చెందిన కొంత మంది యువకులు మంగళవారంరాత్రి నగర శివారు ప్రాంతంలోని వెంగముక్కలపాలెం వెళ్లే దారిలో ఉన్న ఆర్ఎస్ దాబాకు వెళ్లారు. అక్కడ అంతా భోజనం చేసిన తరువాత బిల్లు ఇవ్వకుండా వెళుతుండగా కౌంటర్‌లో ఉన్న దివ్యాంగుడు డబ్బులు అడిగాడు. భోజనం సరిగా లేదని గొడవపడి సిబ్బందిపై తిరగబడ్డారు. అనంతరం వారు పెళ్లూరుకు చెందిన మరికొంతమంది యువకులను ఫోన్ చేసి పిలిపించి దాబా హోటల్‌లో ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అంతేకాదు క్షతగాత్రులైన దాబా సిబ్బంది రిమ్స్‌లో చికిత్స నిమిత్తం చేరితే అక్కడకు వెళ్లి వారిపై దౌర్జన్యం చేసేందుకు యత్నించారు.

నిత్యం ఏదో ఒక చోట ఘర్షణలు

దాబా హోటళ్లలో నిత్యం ఏదో ఒకచోట ఘర్షణలు జరగడం పరిపాటిగా మారింది. వాటి యజమాన్యాలు మద్యం కూడా సరఫరా చేస్తుండడంతో రాత్రులు ఎక్కువ సంఖ్యలో మందుబాబులు దాబా హోటళ్లకు వెళుతున్నారు. అక్కడ మద్యం సేవించే వారికి ప్రత్యేక గదులు ఏర్పాటు చేసి వారికి కావాల్సిన ఆహార పదార్థాలు సరఫరా చేస్తారు. దీంతో మద్యం సేవించే వారికి కాస్త తక్కువ ధరలతో అందుబాటులో ఉండటంతో మందుబాబులకు సిట్టింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

కన్నెత్తి చూడని పోలీసులు

దాబా హోటళ్ల వద్ద నిత్యం మందుబాబులు వీరంగం వేస్తున్నా పోలీసులు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. పోలీసులు పహారా లేకపోవడంతో రాత్రులు పొద్దుపోయేవరకు దాబాలలో మందుబాబులు యథేచ్ఛగా తాగుతూ అనేక ఘర్షణలకు పాల్పడుతున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

రూ.2.75 కోట్లతో రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాల పంపిణీ
కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్ర పరికరాలను వినియోగించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. ఒంగోలులోని ప్రకాశం భవన్‌లో బుధవారం రైతులకు రాయితీపై వ్యవసాయ పరికరాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-47 విజన్ డాక్యుమెంట్ ప్రణాళికలో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయం దాని అనుబంధ రంగాలు జిల్లా అభివృద్ధికి ప్రధాన చోదకశక్తిగా గుర్తించినట్లు చెప్పారు. 15శాతం వృద్ధి రేటు లక్ష్యంగా చర్యలు తీసుకున్నామన్నారు. వ్యవసాయంలో వస్తున్న నూతన మార్పులను రైతులు గమనిస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని, యంత్ర పరికరాలను వినియోగించడం ద్వారా మెరుగైన దిగుబడి సాధించవచ్చని చెప్పారు. ప్రభుత్వం వ్యక్తిగతంగా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలను అందిస్తోందన్నారు. అందులో భాగంగా రూ. 2.75 కోట్లను రాయితీగా ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. రైతుల అవసరాలను తెలుసుకొని వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తోందన్నారు. ఈ సందర్భంగా అర్హులైన రైతులకు డ్రోన్లు, స్ప్రేయర్లు, సాదా, వెదగొర్రులు, కలుపుతీత పరికరాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



రైతులకు యంత్రాల పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ అన్సారియా

200 బత్తాయి చెట్లు పీకివేత

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

పామూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండంలోని గుమ్మలంపాడులో వివాదాస్పదమైన భూమిలో సాగులో ఉన్న సుమారు 2 వందల బత్తాయి చెట్లను వేళ్లతో సహా గుర్తు తెలియని వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో పెకలించారని బాధితుడు అబ్బూరి శేషయ్య బుధవారం పామూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుమ్మలంపాడు గ్రామంలోని అసైన్డ్ భూమిని తాను 40 సంవత్సరాలుగా సాగుచేస్తున్నానని, అందులో బత్తాయితో పాటు పలు రకాల చెట్లను వేశానని శేషయ్య తెలిపారు. బుధవారం ఉదయాన్నే చెట్లకు నీరు పోసేందుకు తోట వద్దకు వెళ్లగా 2 వందల చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించడమే కాకుండా సోలార్ ప్యానళ్లు, మోటార్లు, ఫెన్సింగ్ రాళ్లను ధ్వంసం చేసి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2002లో చీమకుర్తికి చెందిన ముప్పరాజు శేఖర్ తనపై పలు కేసులు నమోదు చేశారని, అప్పటి నుంచి ఈ భూమి కోర్టు వివాదంలో ఉందని అన్నారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిలోకి అక్రమంగా ప్రవేశించి చెట్లను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో బాధితుడు శేషయ్య కోరారు.



రైతు తోటలో అక్రమంగా నరికి ఉన్న బత్తాయి చెట్లు

ఉపరాష్ట్రపతిని కలిసిన మాగుంట



ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్‌ను కలిసిన మంత్రి లోకేష్, ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి ఢిల్లీలో బుధవారం ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. కేంద్రమంత్రి, రాష్ట్రానికి చెందిన ఇతర పార్లమెంట్ సభ్యులతో కలిసి వారు కలిసి ఉప రాష్ట్రపతికి బొకే అందజేశారు. అనంతరం కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌తో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ భేటీ అయ్యారు. రాయలసీమను హార్టికల్చర్‌హబ్‌గా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. అనంతరం లోకేష్ యువగళం పాదయాత్ర విశేషాల పుస్తకాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. ఆయన ఎంపీ మాగుంట ఉన్నారు.

ఎండోమెంట్ భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ నారాయణరెడ్డి

సంతనూతలపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పేర్నమిట్ట పరిధిలోని ఎండోమెంట్ భూములను తహసీల్దార్ ఎస్ఎల్.నారాయణరెడ్డి బుధవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆయా సర్వేనెంబర్లను ఆన్‌లైన్ చేసేందుకు ఎండోమెంట్‌శాఖ ఈవో రెవెన్యూ కార్యాలయంలో గతంలో దరకాస్తు చేసుకున్నారు. ఈక్రమంలో తహసీల్దార్ బృందం స్థానిక చెన్నకేశవ, రామలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించిన భూములను పరిశీలించారు. కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలను అందజేసిన క్లబ్ సభ్యులు

సంతనూతలపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని వడ్డెరపాలెం మండలపరిషత్ పాఠశాల విద్యార్థులకు బుధవారం వాసవీక్లబ్, మహిళ క్లబ్ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలను అందజేశారు. ఈనెల 22వ తేదీన సంతనూతలపాడులో జరగబోయే డాన్ టు డస్క్ సేవా కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వాసవీక్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వీఎస్.ప్రసాదరావు, హెచ్ఎం శైలజ, క్లబ్ అధ్యక్షుడు వీవీ.శేషారావు, సెక్రటరీ వి.ఆంజనేయులు, మహిళాక్లబ్ అధ్యక్షురాలు చంద్రావతి, సెక్రటరీ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భూసార ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలి

సంతనూతలపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): భూసార ఫలితాల ఆధారంగా ఎరువులను వినియోగించాలని ఏవో పావని తెలిపారు. బుధవారం మండలంలోని పేర్నమిట్ట-1, పేర్నమిట్ట-2 పరిధిలోని రైతుసేవాకేంద్రాల వద్ద పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో పావని మాట్లాడుతూ 2024-25- సంవత్సరానికి సంబంధించి భూసారఫలితాలను రైతులకు అందించినట్లు తెలిపారు. వాటి ఆధారంగా పంటలలో అవసరమైన ఎరువులను తగిన మోతాదులో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సింగరాయకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి మాధుసూదన్‌రావు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని మలేరియా ల్యాబ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం మలేరియా మసోత్సవాల్లో భాగంగా మండలంలోని పాకలలోని ఆది ఆంధ్రా కాలనీలో స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 'దోమలు పుట్టకూడదు, కుట్టకూడదు' అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు చైతన్యకృష్ణ, ధీరేంద్ర, మలేరియా సబ్‌యూనిట్ అధికారి సాగర్‌భాస్కర్, ఆరోగ్యపర్యవేక్షకుడు సయ్యద్ వసూద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పొన్నలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని బీజేపీ నేతలు అన్నారు. వికసిత్ భారత్ సంకల్పసభ కార్యక్రమంలో భాగంగా పొన్నలూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం ఆ పార్టీ నేతలు మొక్కలు నాటారు. ప్రధాని నరేంద్రమోడీ 11 సంవత్సరాల పాలన పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్, ఇంచార్జ్ పరుసు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

200 ఎకరాల పండ్లతోటల సాగే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్‌ప్రసాద్

మద్దిపాడు, జూన్ 18(ఆంధ్ర జ్యోతి): ఉపాధి హామీ పథకం కింద మండలలో 200 ఎకరాల్లో పండ్లతోటల పెంపకం లక్ష్యంగా పెట్టుకు న్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ఉపయోగించుకుని రైతులు పండ్లతోటలు సాగుచేయాలన్నారు. ఉద్యానశాఖ ద్వారా రాయితీలు పొందవచ్చుని, పండ్ల తోటల సాగు ద్వారా రైతుల జీవనప్రమాణాలు పెరుగుతాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో ధనుంజయవర్మ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి విజయారావు



యోగా సాధన చేస్తున్న నాయకులు, ఇతర సభ్యులు

ఒంగోలు కల్చరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నిత్యం యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.విజయారావు, జిల్లా ఇన్‌చార్జి తీగల సత్యవతి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక రంగారాయుడు చెరువు గాంధీ పార్కులో బీజేపీ మహిళా నాయకులు, పతంజలి యోగా మిత్ర మండలి ఆధ్వర్యంలో గురువు గోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో యోగాసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విజయారావు మాట్లాడుతూ యోగ సాధనతో మానసిక ప్రశాంతత, దీర్ఘవ్యాధుల నివారణ సాధ్యమన్నారు. ఒకే ప్రపంచం -ఒకే ఆరోగ్యం నినాదంతో ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమాల పోర్టల్‌లో ప్రతి ఒక్కరూ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యురాలు ధనిశెట్టి పావని, ఒంగోలు మండల అధ్యక్షురాలు దేవరపల్లి శ్రీలక్ష్మి, ధనిశెట్టి రామునాయుడు, పతంజలి యోగ మిత్రమండలి సభ్యులు మురళి, మారుతి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగార్జున, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

నేడు యోగాంధ్ర కార్యక్రమం

రాష్ట్ర ప్రభుత్వం, దేవదాయశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉదయం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్థానిక శ్రీప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థాన ఈవో శివశంకర్ తెలిపారు. స్థానిక ఆలయ ప్రాంగణంలో ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమం జరుగుతుందని, భక్తులు, ప్రజలు పాల్గొనవలసిందిగా ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఏకేయూలో యోగా సాధన

ఒంగోలు విద్య: యోగా మన భారతీయ సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగమని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక యూనివర్శిటీలో అధ్యాపకులు, విద్యార్థులు యోగ సాధన చేశారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ యోగా దినోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమోహన్ రావు, డీన్ సోమశేఖర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ పాల్గొన్నారు.

నిస్వార్థ నాటకరంగ యోధుడు 'నాగినేని'

● కళాకారుల నివాళులు



నరసింహారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు కల్చరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నాటకరంగంలో సంగీతం, సాహిత్యం, నాట్యం, నటన, రచన, దర్శకత్వం వంటి అన్ని విభాగాలలో తాను రాణించటమే కాకుండా నిస్వార్థంగా అనేకమందిని నటులుగా తీర్చిదిద్దిన ఘనత నాగినేని నరసింహారావుది అని పలువురు కళాకారులు కొనియాడారు. నాగినేని నరసింహారావు 17వ వర్ధంతి సభ శ్రీనాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో జరిగింది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మిడసల మల్లిఖార్జునరావు, కనమాల రాఘవులు అధ్యక్షతన జరిగిన సభలో శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై నాగినేని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నాటకరంగ బలోపేతానికి శాయశక్తులా కృషిచేసిన గొప్ప వ్యక్తి నాగినేని అని చెప్పారు. విశ్రాంత అధికారి గుంటూరు సత్యనారాయణ మాట్లాడుతూ అర్ధ శతాబ్దం పాటు పౌరాణిక నాటక రంగానికి సేవలు అందించారన్నారు. ఆదాయపు పన్ను విశ్రాంత అధికారి మెడబలిమి సాంబశివరావు మాట్లాడతూ నాగినేని నరసింహా రావు పేరుతో సంస్థను ఏర్పాటు చేసి రెండు తెలుగు రాష్ట్రాలలో నాటక ప్రదర్శనలు ఇవ్వటం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, ఓరుగంటి ప్రసాద్, మిట్నసల శాంతారావు, దేవరశెట్టి సింగయ్య, ఐనంపూడి నరసింహారావు, కొప్పోలు వెంకటేశ్వర్లు, తానికొండ చెన్నయ్య, దామవరపు మునలయ్య, నల్లమల్లి పాండురంగనాథం, చోడా రమణయ్య, కొత్తిమీర ప్రేమ్‌కుమార్, పాలేటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లో ఫర్నీచర్ ధ్వంసం

● ఐదుగురు యువకుల హల్‌చల్

● మహిళలను భయభ్రాంతులకు గురిచేసిన వైనం

ఒంగోలు క్రైం, జూన్18(ఆంధ్రజ్యోతి): ఏఆర్ కానిస్టేబుల్ ఇంట్లోకి నలుగురు యువకులు అక్రమంగా చొరబడి తలుపులు పగులకొట్టి ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. అంతేగాకుండా ఆ ఇంట్లోని మహిళలపై దాడికి దిగారు. ఈ సంఘటన ఒంగోలు నగరం ఎన్‌జీవోకాలనీలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గోవింద చౌదరి ఇంట్లో ఆయన భార్య, పిల్లలతో పాటు బంధువులు ఉన్నారు. ఇంట్లో అందరూ మహిళలే ఉండగా గోవిందచౌదరి విధులకు వెళ్ళారు. ఈక్రమంలో బుధవారం వేకువజామున 2.30 గంటల సమయంలో ఒంగోలుకు చెందిన గోపి, మరో నలుగురు యువకులు వచ్చి గోవిందచౌదరి ఇంటి సీసీకెమెరాలను ధ్వంసం చేశారు. ఇంటి తలుపును పగులగొట్టి లోపలికి వెళ్లి మహిళలను భయభ్రాంతులకు గురి చేశారు. ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో మహిళలు ఒక్కసారిగా పెద్దగా కేకలు వేయగా చుట్టుపక్కల వారు రావడంతో దుండగులు అక్కడ నుంచి పరారీ అయ్యారు. ఈమేరకు తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటు స్కూళ్ల పుస్తకాలు, ఫీజు దోపిడీని అరికట్టాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్



డీఈవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్న పాఠ్యపుస్తకాల ఫీజులను అరికట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో కిరణ్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. అనేక రకాల ఫీజుల భారంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. పుస్తకాలు, యూనిఫాం, షూల పేరుతో విద్యార్థుల నుంచి రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అదనంగా ఫీజులు వస్తున్నారని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో గుర్తింపు లేకుండా అనేక పాఠశాలలు నడుస్తున్నాయని, వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డీఈవోను కోరారు. కార్యక్రమంలో నాయకులు వి.కోటి, వెంకట్రావు, సచిన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు

● 5 కిలోల సరుకు స్వాధీనం

ఒంగోలు క్రైం, జూన్18(ఆంధ్రజ్యోతి): గంజాయిని విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఒంగోలు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఒంగోలు పరిసరప్రాంతాలలో విక్రయిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 5 కిలోలు గంజాయి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈక్రమలో బుధవారం సాయంత్రం స్థానిక సీతారామపురం కొండమీద గల రామాలయం వద్ద చినగజాంకు చెందిన కుక్కల గోవర్ధన్‌రెడ్డి, ఒడిశాకు చెందిన రాజేష్‌నాయక్, మహేశ్వర ముడి, ఒంగోలు బడ్డమిట్టకు చెందిన షేక్ ముజీర్‌ని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

విద్యుత్‌షాక్‌తో వివాహిత మృతి

నాగులుప్పలపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో వివాహిత మహిళ మృతి చెందిన సంఘటన మాచవరంలో చోటు చేసుకొంది. అందిన వివరాల మేరకు.. మాచవరం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన మొలతోటి స్వప్న (40) బుధవారం ఇంటి వద్ద దుస్తులు ఉతికి దండెం తీగపై ఆరవేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మానస సరోవర్ యాత్రకు సబ్సిడీ ఇవ్వాలి

గిద్దలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వలే ఆంధ్రప్రదేశ్‌లో కూడా మానస సరోవర్ యాత్రకు వెళ్లేవారికి రూ.లక్ష సబ్సిడీని ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ.రామాంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముస్లింలకు హజ్, క్రిస్టియన్లకు జెరూసలేం యాత్రలకు సబ్సిడీని ఇస్తున్న మాదిరిగా మానససరోవర్ యాత్రకు కల్పించాలని సీఎం, ఉపముఖ్యమంత్రి, చర్యలు తీసుకోవాలని కోరారు.

యువతి ఆత్మహత్య

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఓ యువతి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మార్కాపురంలో పట్టణంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో దూదేకుల సలీమ (20) మృతి చెందింది. టౌన్ ఎస్సై సైదుబాబు కథనం మేరకు.. స్థానిక కరెంట్ ఆఫీస్ వెనుకవైపు పూలవీధిలో దూదేకుల సిద్దయ్య, హుసేనమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యాయి. చిన్న కుమార్తె సలీమ గత కొన్నాళ్లుగా కిడ్నీలో రాళ్లు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. వైద్యం చేయించినా నొప్పి తగ్గలేదని బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని మృతి చెందింది. టౌన్ ఎస్సై సైదుబాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ప్ర భుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దిపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు పట్టుకున్నారు. 'ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలు' పేరుతో బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు ఎస్ఐ శివరామయ్య స్పందించారు. తన సిబ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని జరిమానా విధించారు.

పొగాకు రైతులు ఉద్యమించాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వీరారెడ్డి

కొండపి, జూన్18 (ఆంధ్రజ్యోతి): రోజురోజుకీ పతనమవుతున్న పొగాకు ధరలపై రైతులు ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. వీరారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం ఆయన కొండపిలోని పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. పొగాకు రైతులు ఎదుర్కొంటు న్న ధరల సమస్యపై శుక్రవారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్ (సీపీఐ కార్యాలయం)లో రైతు సదస్సు నిర్వహిస్తున్నామని రైతులకు వివరించారు. రైతుల సమస్యలుపై ప్రభుత్వాలు స్పందించడం లేదని, రైతులే చైతన్యవంతమై ఉద్యమి స్తేనే గిట్టుబాటు ధరలు వస్తాయని వీరారెడ్డి రైతులతో అన్నారు.

రేపు సింగరాయకొండలో జాబ్‌మేళా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన సింగరాయకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి రవితేజయాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు రకాల బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయన్నారు. కొండపి నియోజకవర్గంతో పాటు జిల్లాలోని 18నుంచి 30 ఏళ్ళ లోపు ఉన్న పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకుని ఖాళీగా ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు జీతం రూ12వేల నుంచి రూ.25వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9652282636 సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

'తల్లికి వందనం' పేద విద్యార్థులకు వరం

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చదువుకుంటున్న పిల్లలు ఉన్న ప్రతి ఇంటికి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకం చరిత్రలో నిలిచిపోతుందని జిల్లా యాదవ జేఏసీ నాయకుడు చిరుమామిళ్ల గోపీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉన్నా తల్లుల పేరుతో నగదు జయడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పేద విద్యార్థుల తల్లులు నగదు డ్రా చేసుకున్న అనంతరం తమ పిల్లలకు అవసరమైన వస్తువులను ఆనందోత్సవాలతో కొనుగోలు చేస్తున్నారన్నారు. తల్లికివందనం పథకం అమలు చేయడం అభినందనీయమని తెలిపారు.

యోగా పోటీల్లో జిల్లాకు బహుమతులు

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగా పోటీల్లో జిల్లాకు అవార్డులు లభించాయి. బుధవారం విజయవాడలో జరిగిన అవార్డు ఫంక్షన్‌లో రాష్ట్రమంత్రులు కందుల దుర్గేష్, సత్యకుమార్ చేతుల మీదుగా యోగా సాంగ్ కాంపిటేషన్‌లో శీలం శ్రీనివాసరావు, యోగ స్కిట్ పోటీల్లో పూర్ణచంద్రరావుల బృందాలు అవార్డులు అందుకున్నాయి.

ఉపాధి కూలీల బకాయిలు విడుదల చేయాలి

మర్రిపూడి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీలకు వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదరి మస్తాన్ డిమాండ్ చేశారు. బుధవారం మర్రిపూడి మండలం ధర్మవరం గ్రామంలో ఉపాధిహామీ కూలీలు పనిచేస్తున్న ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ఆరు వారాల నుంచి తమకు వేతనాలు రాలేదని, తాము ఎలా బతకాలని వారు ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిపారు. ఉపాధి చట్టం ప్రకారం పనిచేసిన 15 రోజులకొకసారి వేతనాలు ఇవ్వాలన్నారు. ఎండలు తీవ్రంగా మండుతున్నాయని, వేసవి తీవ్రతకు వడదెబ్బ తగిలి కూలీలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. ఉపాధి కూలీలు పనిచేసే ప్రాంతాల్లో నీడకు పట్టలు, మంచినీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన విధంగా పార, పలుగు, తట్ట ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా పోలేరమ్మ గుడి వార్షికోత్సవం



పూజలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు కల్చరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం శివప్రసాద్ కాలనీలోని శ్రీపోలేరమ్మ తల్లి దేవస్థాన 22వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా మేళతాళాలతో నగరోత్సవం నిర్వహించగా, భక్తులు అమ్మవారికి పొంగళ్ళు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో అర్చకులు దార శివరామశాస్త్రి, నల్లూరి రవి, గంగవరపు కృష్ణమోహన్, కామని వెంకటరావు, గణేశుని సుబ్బారెడ్డి, మండే శ్రీమన్నారాయణ, జగన్నాథం మురళి, వెంకటేశ్వర్లు, మాధవరపు సురేష్, గోరా వెంకటేశ్వర్లు, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మద్దిపాడు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆటో, మోటార్‌సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. బుధవారం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మేదరమెట్ల వైపు మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఆర్.ప్రవీణ్‌కుమార్, పి.దేవదానంలను అతివేగంగా వచ్చిన ఆటో ఢీకొన్నది. ఈ సంఘటనలో వారికి గాయాలు కాగా అదే ఆటోలో చికిత్స నిమిత్తం మేదరమెట్ల వైద్యశాలకు తరలించారు.

యోగాలో పాల్గొనే వారికి సర్టిఫికెట్‌లను ప్రదానం చేయాలి

ఒంగోలు(రూరల్), జూన్18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలలో పాల్గొనే వారికి ప్రశంసాపత్రాలను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి విజయానంద్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా కార్యాక్రమాల్లో ఔత్సాహికులు సకాలంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, డీఈవో కిరణ్‌కుమార్, పలు శాఖ అధికారులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి అరెస్టు అక్రమం : వైసీపీ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయించడం దుర్మార్గంగా ఉందని ఆ పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. చెవిరెడ్డికి ఎలాంటి సంబంధం లేని లిక్కర్ స్కాంలో అక్రమంగా అరెస్టు చేశారని, ప్రభుత్వం ఇటువంటి విధానాలను మానుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు.

విద్యతోనే బంగారు భవిష్యత్తు



బ్యాగును అందజేస్తును ఉపాధాయులు

మద్దిపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని హెచ్ఎం రామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మద్దిపాడులోని తూర్పు పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన బ్యాగులు, బెల్టు, పుస్తకాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరిట విద్యా కిట్లను అందజేసిందన్నారు. కార్యక్రమంలో ఎం.రాగిణి, గంగిశెట్టి నరసింహారావు, ఎంసీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నెరవేరని ఇంకుడు గుంతల లక్ష్యం

» ప్రభుత్వం చొరవ చూపినా .. అధికారుల నిర్లక్ష్యం

» మంజూరైనవి 7,543, తవ్వినవి 1,716


అర్ధవీడులో ఇంకుడు గుంతలు తీస్తున్న కూలీలు (ఫైల్)

కంభం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాల వృద్ధికి ప్రభుత్వం చొరవ చూపింది. పశ్చిమ ప్రాంత పల్లెల్లో ఇంకుడు గుంతల ఏర్పాటుకు కార్యాచరణ ఏర్పాటు చేశారు. వాన నీటిని, వాడుక నీటిని నేరుగా భూమిలోకి ఇంకింప చేసేందుకు ఇంకుడు గుంతలు తోడ్పడతాయి. ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలు తీసే పనులు ప్రారంభించి 3 నెలలు గడిచినా లక్ష్యం నెరవేరలేదు. అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. గుంతల తవ్వకానికి మాత్రం గ్రామాల్లో అడుగులు పడడం లేదు. పథకం ప్రారంభంలో హడావుడి చేశారు. 7,543 ఇంకుడు గుంతలు మంజూరు కాగా కేవలం 1,716 గుంతలను మాత్రమే తవ్వారు. మిగతా గుంతలు మొదలు పెట్టలేదు. ఉపాధి హామీ కూలీలు వ్యక్తిగతంగా ఇంటి ఆవరణలో గుంతలను ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వం రూ.6వేల నగదు ఇస్తుంది. అయితే కూలీలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. ఉదయం ఉపాధి పనులకు వెళ్లి వచ్చిన తరువాత ఈ గుంతలను తవ్వేందుకు వీలుంది. కానీ క్షేత్ర సహాయకులు వీటిపై దృష్టి సారించడం లేదు. రానున్న వర్షాకాలానికి ఇంకుడు గుంతల తవ్వకాలు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ ఆచరణలో పెట్టడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు ఇంకుడు గుంతల ఏర్పాటుకు చొరవ చూపి, లక్ష్యం మేరకు పూర్తి చేస్తే ఎంతో మేలు చేకూరుతుంది.

కాశినాయన ఆశ్రమంలో పూజలు

గిద్దలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశిరెడ్డినాయన విగ్రహానికి అభిషేకం చేశారు. భక్తులు సామూహికంగా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మానస సరోవర్ యాత్రకు సబ్సిడీ ఇవ్వాలి

గిద్దలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో వలే ఆంధ్రప్రదేశ్‌లో కూడా మానస సరోవర్ యాత్రకు వెళ్లేవారికి రూ.లక్ష సబ్సిడీని ఇవ్వాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు టీవీ రామాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ముస్లింలకు హజ్, క్రిస్టియన్లకు జెరూసలేం యాత్రలకు సబ్సిడీని ఇస్తున్న మాదిరిగా మానస సరోవర్ యాత్రకు కల్పించాలని ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, ప్రభుత్వ అధినేతలకు కోరారు.


మోటార్ వద్ద నీటి కోసం వేచి ఉన్న మహిళలు

ఎస్సీ కాలనీలో నీటి కష్టాలు

రాచర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జేపీచెరువు గ్రామ ఎస్సీ కాలనీలో తాగునీటికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. మోటారు వద్ద గంటల తరబడి వేచి ఉన్నా బిందెడు నీరు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేతిపంపులు, సింగిల్‌ఫేజ్ మోటార్లు ఉన్నా భూగర్భ జలాలు అడుగంటడంతో సింగిల్ ఫేజ్ మోటార్లలో ఆశించిన స్థాయిలో నీరు రావడం లేదని వారు తెలిపారు. నీటి సమస్య గురించి అధికారులకు తెలియ చేస్తున్నా ఇదిగో అదులో అంటున్నారే తప్ప స్పందించడం లేదన్నారు. అధికారులు స్పందించి తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపించాలని వారు విజ్ఞప్తి చేశారు.

యోగా సాధన చేయాలి


విజేతలకు బహుమతులను అందజేస్తున్న బ్రహ్మకుమారీలు

గిద్దలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : శారీరకంగా, మానసికంగా, సంపూర్ణంగా, ఆరోగ్యంగా ఉండాలంటే నిత్యం యోగా సాధన చేయాలని పలువురు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాంధ్రపై ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం స్థానిక శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రేమ్‌స్వరూప్, సునయన, మధుపల్లవి తొలి మూడు స్థానాలు సాధించగా వారికి బహుమతులను అందచేశారు. జీవన విధానంలో యోగాను భాగస్వామ్యం చేయడం ద్వారా మెరుగైన జీవనం పొందవచ్చని, యోగాసాధనకు వయస్సుతో సంబంధం లేదని ఈసందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు సావిత్రి, శ్రవంతి, యోగా శిక్షకులు డాక్టర్ క్రిష్ణయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు రామిరెడ్డి, ఫరూఖ్, నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మార్కాపురం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ విద్యాసాగర్ అన్నారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బజార్ బ్రాంచి 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బ్యాంకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్‌బీఐ హ్యూమన్ రిసోర్స్ మేనేజర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, రక్తదానంపై ఉన్న అపోహలు తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో కందుకూరు మేనేజర్ శ్రీనివాస నాయక్, చీఫ్ మేనేజర్ విద్యాసాగర్, మార్కాపురం మెయిన్ బ్రాంచ్ మేనేజర్ హరి, బజార్ బ్రాంచి మేనేజర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

» తీగలేరును చిన్న కండ్లేరు వరకు పొడిగించాలి

» సీఎంకు పోస్టు కార్డులు పంపిన రైతులు

పుల్లలచెరువు,జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రకాశంలో శాశ్వతంగా కరువును నివారించడానికి పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి వెంటనే పూర్తి చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బుధవారం చాపలమడుగులో వెలిగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని రైతులతో కలిసి సంతకాల సేకరణ, పోస్టు కార్డులపై వెలిగొండ పూర్తి చేయాలని రాసి సీఎం చంద్రబాబుకు పంపించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోనే వెనుక బడిన పుల్లలచెరువు మండలంలో తాగు నీటి కోసం 1000 అడుగులు బోర్లు తవ్వించినా నీరు లభ్యం కావడం లేదని, కరువు పోవాలంటే వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు 5 కాలువను పుల్లలచెరువులోని చిన్న కండ్లేరు రిజర్వాయరు వరకు పొడగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ సినీయరు నాయకుడు టీసీహెచ్ చెన్నయ్య, కృష్ణగౌడ్, మండల కార్యదర్శి జీవీ గురునాథం, జానకీ రఘు, కోటిరెడ్డి, వెంకటేశ్వర్లు రైతులు పాల్గొన్నారు.


పోస్టు కార్డులను చూపుతున్న రైతులు

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి


సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎల్‌డీవో, డీపీవో

తర్లుపాడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎల్‌డీవో బాలునాయక్ అన్నారు. మండలంలోని సీతానాగులవరం సచివాలయాన్ని డీఎల్‌డీవో, డీపీవో భాస్కర్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. రోజుకు ఎన్ని అర్జీలు వస్తున్నాయి, ఎన్ని అర్జీలను పరిష్కరిస్తున్నారంటూ సిబ్బందికి పలు ప్రశ్నలు వేశారు. అర్జీదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమం రిజిస్ట్రేషన్‌లో తర్లుపాడు మండలం వెనుకబడి ఉందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందేలా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, ఈవోఆర్డీ సుకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకును ప్రభుత్వం కొనుగోలు చేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఎర్రగొండపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో రైతుల వద్ద ఉన్న పొగాకు నిల్వలను ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. సీపీఐ కార్యాలయం నుంచి బుధవారం రైతులతో కలసి ప్రదర్శనగా బయలు దేరి తహసీల్దార్ మంజునాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కేవీవీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, దోర్నాల, ఎర్రగొండపాలెం మండలాల్లోని రైతులు ఈ సంవత్సరం వైట్ బర్లీ, బ్లాక్ బర్లీ పొగాకును సాగు చేశారని, పొగాకు కంపెనీల యాజమాన్యాలు రైతులను ముందుగా ప్రోత్సాహించి, పంట చేతికి వచ్చాక కొనుగోలు చేయడం లేదన్నారు. చాలా గ్రామాల్లో పొగాకు బేళ్లు ఇళ్లవద్ద ఉన్నాయన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా పొగాకు డిమాండ్ ఉండడం, మార్కెట్‌లో మంచి రేట్లు ఉండడంతో గత సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్‌లలో నల్లబర్లీ, తెల్లబర్లీ పొగాకు సాగు చేశారు.. రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా రైతులనుంచి పొగాకు కొనుగోలు చేయడానికి సిద్ధం అయిందని అన్నారు. విధివిధానాలను రూపొందించి రైతులు నష్టపోకుండా మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని తెలిపారు. ఏపీ రైతు సంఘం నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు డీ శ్రీనివాస్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బీ రామయ్య, సహాయ కార్యదర్శి జి గుర్నాథం, మండల కార్యదర్శి ఎం.సాంబశివరావు, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

అధిక దిగుబడికి భూసారాన్ని పెంచుకోవాలి


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారి జ్యోత్స్నదేవి

రాచర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వరి, మిర్చి తదితర పంటలు సాగు చేసే రైతులు అధిక దిగుబడికి పొలాల్లో భూసారాన్ని పెంచుకోవాలని ఏవో మహబూబ్‌బాషా అన్నారు. మండలంలోని గుడిమెట్ట, సోమిదేవిపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారపేట : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం మండలంలోని పూసలపాడు, ఒందుట్ల గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్ మాట్లాడుతూ భూసార పరీక్షల ద్వారా వచ్చిన ఫలితాలను బట్టి ఎరువులు, పురుగు మందులు వాడవచ్చునని తద్వారా రైతులకు ఖర్చు తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పెద్దారవీడు : రైతులు విత్తనాలు నాటే ముందు శుద్ధి చేయడం ద్వారా తెగుళ్లను నివారించవచ్చని ఏవో ఎన్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని బి.చెర్లోపల్లి, బద్వీడులో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన భూసార పరీక్షల సరిఫికెట్లను రైతులకు అందచేశారు. రాబోయే ఖరీఫ్‌లో చేపట్టవల్సిన వ్యవసాయపనులను గురించి వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు లాలా రవి, రైతులు పాల్గొన్నారు.

తర్లుపాడు : రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులు వాడడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో జ్యోత్స్న దేవిక అన్నారు. మండలంలోని కొండారెడ్డిపల్లి, లక్ష్మక్కపల్లెలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో దేవేంద్రగౌడ్, వ్యవసాయ సహాయకులు బొర్రయ్య, మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్ : అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రభుత్వం రైతుల ఖాతాలలో ఈ నెల 20 వ తేదీన నగదు జమచేయనుందని ఏవో బుజ్జిబాయి తెలిపారు. మండంలంలోని పెద్ద నాగులవరం, నికరంపల్లి గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది నవ్య, గణేష్, రైతులు పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : పత్తిలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని ఎగువ చెర్లోపల్లి, చిలకచెర్ల గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పత్తిని పరిశీలించారు. పచ్చదోమ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీపీ నాగరాజు నాయక్, వీఆర్‌వో చెన్నయ్య, వీఎస్‌ఏ షడ్రక్ బాబు, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్: సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ నమోదు చేయించాలని వ్యవసాయ విస్తారణాధికారి పొట్టయ్య అన్నారు. బుధవారం మండలంలోని గంగాపాలెం, నర్సయపాలెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. సాగులో ఉన్న పంటలను ఆయన పరిశీలించారు. కార్యక్రమాలలో వ్యవసాయశాఖ సిబ్బంది దినేశ్వర్ నాయక్, కె మంత్రునాయక్, బి నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రచారం


అభివృద్ధి కరపత్రాలను అందజేస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రధాని ఆధ్వర్యంలో గత 11 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం ద్వారా జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాల కరపత్రాలను బీజేపీ నాయకులు ప్రజలకు అందచేశారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందచేశారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు 370 ఆర్టికల్ రద్దు, ట్రిపుల్ తలాక్ పథకం రద్దు, ఉచిత వైద్యం, తక్కువ రేటుకే మందులు అందజేత, పేదలకు ఉచిత రేషన్, ప్రతి ఇంటికి మంచి నీరు తదితర పథకాలను అమలు చేసిందని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, జిల్లా అదికార ప్రతినిధి డాక్టర్ నారాయణ, నాయకులు పుల్లయ్య, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ పాల్గొన్నారు.


హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న ఎంపీడీవో వీరభద్రాచారి

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

కంభం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ఎన్‌రోల్‌మెంట్ ఉపాధ్యాయుల స్థాయిని నిర్దేశిస్తుందని ఎంపీడీవో వీరభద్రాచారి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంఈవో మాల్యాద్రి అధ్యక్షతన ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో, ఎంఈవోలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనంలో సన్నబియ్యం వాడకం పాఠశాలల ప్రతిష్టను పెంచిందన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

అనుమలవీడు వైద్యాధికారి బదిలీ

రాచర్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుమలవీడు ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ కమలాదేవి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీలలో భాగంగా గిద్దలూరు మండలంలోని సంజీవరాయునిపేట ప్రాథమిక వైద్యశాలకు ఆమె బదిలీ అయ్యారు. ఒకే చోట పని చేస్తూ 5 సంవత్సరాలు పూర్తి కావడంతో ప్రభుత్వం ఆమెను బదిలీ చేసింది. ఇదే వైద్యశాలలో ఐదేళ్లు దాటిన మరో నలుగురు కూడా బదిలీ అయినట్లు సిబ్బంది తెలిపారు. బదిలీ అయిన వారిలో ఆప్తాలమిక్ అసిస్టెంట్ సుదర్శన్‌రెడ్డి, హెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, పీహెచ్ఎన్ రామలక్ష్మమ్మ, స్టాఫ్‌నర్సు పద్మలత ఉన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

గిద్దలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమకు వర్తింప చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం కార్మికుల సంఘం ప్రతినిధి మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆదాయంతో సంబంధం లేకుండా చిరు ఉద్యోగులకు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన వైనం వివరించారు. కానీ అధికారంలోకి రాగానే ఆదాయ పరిమితి పెట్టి సంక్షేమ పథకాలు అందకుండా చిరు ఉద్యోగులను మోసం చేశారని విమర్శించారు. దాంతో తల్లికి వందనం పథకం తమకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుని సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆవులయ్య, మున్సిపల్ కార్మిక సంఘం ప్రతినిధులు పుల్లయ్య, రంగస్వామి, అక్బర్ పాల్గొని ప్రసంగించారు.

డాక్టర్ కప్పగంతులకు సన్మానం

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం శ్రీ సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదనశాస్త్రిని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ సైదా బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ.. కవిత రచయితగా, పరిశోధనల పర్యవేక్షకునిగా పనిచేస్తూ ప్రశంసనీయ వ్యక్తుల జాబితాలో స్థానం సంపాదించుకున్న మధుసూదనశాస్త్రి వెనుకబడిన పశ్చిమ ప్రకాశానికి ఎంతో గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ బోల్తా

పెద్దారవీడు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో వాహనం బోల్తా పడి వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని బద్వీటి చెర్లోపల్లి సమీపంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగొండపాలెం మండలం గంజివారిపల్లెకు చెందిన రాతం ఆదెయ్య(60) దోర్నాల నుంచి మార్కాపురానికి బైక్‌పై వస్తున్నారు. బద్వీటి చెర్లోపల్లి సమీపంలో అదుపుతప్పి కిందపడ్డారు. 108 సిబ్బంది మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆదెయ్య కోమాలోకి వెళ్లారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు తరలించారు. ఎస్సై అనిల్‌కుమార్ కేసు నమోదు చేశారు.

పసిరిక పాము పట్టివేత

మార్కాపురం వన్‌టౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడు రోడ్డులోని ఫర్నిచర్ షాపులో ఉన్న పసిరిక పామును స్నేక్ క్యాచర్ నిరంజన్ బుధవారం పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పాలు కనిపించిన వెంటనే చంప వద్దని తమకు సమాచారం అందిస్తే వాటిని పట్టుకుని అరణ్య ప్రాంతాల్లో వదిలివేస్తామని తెలిపారు.

కడుపునొప్పి తాళలేక యువతి ఆత్మహత్య


సలీమ మృతదేహం

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం పట్టణంలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో దూదేకుల సలీమ (20) మృతిచెందింది. టౌన్ ఎస్సై సైదుబాబు కథనం మేరకు.. స్థానిక కరెంట్ ఆఫీస్ వెనుకవైపు పూలవీధిలో దూదేకుల సిద్దయ్య, హుసేనమ్మ నివాసముంటున్నారు. వీరికి ముగ్గు రు కుమార్తెలు. ఇద్దరికి పెళ్లిళ్లు అయ్యా యి. చిన్న కుమార్తె సలీమ గత కొన్నాళ్లుగా కిడ్నీలో రాళ్లు ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతోంది. వైద్యం చేయించినా నొప్పి తగ్గలేదని బాధపడుతోంది. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో ఎవరూలేని సమయంలో చీరతో ఫ్యానుకు ఉరివేసుకుని మృతిచెందింది. టౌన్ ఎస్సై సైదుబాబు వివరాలను సేకరించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైకును ఢీకొన్న బస్సు .. వ్యక్తికి తీవ్ర గాయాలు

మార్కాపురం రూరల్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : బైకును ఎదురుగా వస్తున్న బస్సు ఢీకొట్టడంతో బైకు నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని బోడపాడు సమీపంలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురిచేడు రైల్వే స్టేషన్‌లో పనిచేస్తున్న నల్లబోతుల లక్ష్మయ్య తన పనులను ముగించుకుని మార్కాపురానికి వస్తున్నారు. మార్కాపురం నుంచి బోడపాడుకు వస్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య కాలికి గాయంకాగా గుంటూరుకు తరలించారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ

ఇద్దరికి తీవ్ర, ఒకరికి స్వల్ప గాయాలు

పెద్ద దోర్నాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి. మండలంలోని చిన్నగుడిపాడు గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘర్షణలో టీడీపీకి చెందిన ఐనేని పెద్ద ఆంజనేయులు, ఐనేని చిన్న ఆంజనేయులుకు తలపై తీవ్ర గాయాలయ్యాయి. వైసీపీకి చెందిన వల్లపునేని ప్రసాద్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తెలిసిన కథనం ప్రకారం.. గ్రామంలో తాగునీటి బోరు మరమ్మతులకు గురి కాగా నీటి ఇబ్బందులను చూసి సొంతంగా మరమ్మతులు నిర్వహించేందుకు టీడీపీ నాయకులు ఐనేని ఆంజనేయులు వర్గీయులు మంగళవారం బోరుబావి నుంచి మోటారును తీస్తుండగా గ్రామ సర్పంచి వైసీపీ నాయకులు వల్లపునేని పవన్ కుమార్ సోదరులు ప్రసాద్ మరి కొంత మంది అడ్డుకున్నారు. దీంతో గొడవ జరిగింది. పెద్ద మనుషులువారికి సర్ది చెప్పారు. బుధవారం సాయంత్రం మళ్లీ మాటామాటా పెరిగి దాడులు చేసుకున్నారు. దీంతో టీడీపీ వర్గీయులు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని దోర్నాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైసీపీ వర్గీయులు వల్లపునేని ప్రసాద్‌కు స్వల్ప గాయాలు కాగా మార్కాపురం ఏరియా వైద్యశాలకు వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ సువర్ణకుమారి

చిన్నారులకు బంగారు బాల్యం అందించటం అందరి బాధ్యత

కనిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు బంగారు బాల్యం అందించటంలో ప్రతి ప్రభుత్వ అధికారి బాధ్యత తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సరియా అన్నారు. స్థానిక ప్రయివేటు ఫంక్షన్ హాలులో బుధవారం ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌స్థాయి వల్నరబుల్ చిల్డ్రన్స్ శిక్షణ కార్యక్రమంపై జరిగిన వర్చువల్ వీడియో ద్వారా మాట్లాడారు. పీ4 కార్యక్రమం ద్వారా గుర్తించిన పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. డీఎల్‌డీవో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ సువర్ణకుమారిలు మాట్లాడుతూ ప్రభుత్వశాఖల్లోని వివిధ హోదాల్లో ఉన్న ప్రతి అధికారి తమ కింద స్థాయి సిబ్బంది అవగాహన కల్పించి చిన్నారులు మంచి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా బంగారుబాల్యం నోడల్ అధికారి వీ గిరధర్ శర్మ, జిల్లానోడల్ ఎన్‌జీవో సార్డ్స్ సంస్థ పీడీ సునీల్‌కుమార్, యాప్ డెవలప్‌మెంట్ ఐటీ వింగ్ అధికారి నాగార్జున లు బంగారుబాల్యం విధివిధానాలు, అంశాలపై యాప్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ గఫార్, తహసీల్దార్ రవిశంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న తాళ్లూరు పాముల కాలనీవాసులు

ఆక్రమణలు తొలగించి న్యాయం చేయండి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట పాములకాలనీ వాసుల నిరసన

తాళ్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : తాళ్లూరు గ్రామ శివారు దశాబ్దాలకాలంగా నివాసముంటున్న పాములకాలనీ స్థలంలో కొంత భాగం ఆక్రమణకు గురైందని, ఆక్రమణను తొలగించి న్యాయం చేయాలని కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోక పోవటంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం పాముల కాలనీ వాసులు నిరసన తెలిపారు. తాళ్లూరు పాముల కాలనీకి చెందిన పాముల కాలనీ వాసులు అధికారులు, పాలకుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఎవరూ వారి మాట ఆలకించలేదు. దీంతో మండుటెండలో కార్యాలయం వద్ద దాదాపు గంటసేపు నేలపై బైఠాయించి తమ నిరసన తెలిపారు. మార్చి4వ తేదీ తాళ్లూరు వచ్చిన టీడీపీ దర్శి ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీవద్ద తమ గోడువిన్నవించుకున్నా న్యాయం చేయమని కోరగా రెవెన్యూ అధికారులను తక్షణమే ఆక్రమణలు తొలగించి పాములకాలనీ వాసులకు న్యాయం జరిగేలా చూడాలని చెప్పినా న్యాయం జరగలేదని వాపోయారు. దాదాపు గంటపాటు తహసీల్దార్ కోసం నిరీక్షించినా ఆయన కార్యాలయానికి రాక పోవటంతో వెనుదిరిగి వెళ్లారు.



ప్రత్యేక అలంకరణలో అచ్చమాంబ

భక్తిశ్రద్ధలతో అచ్చమాంబకు పూజలు

పామూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాథపురం, కమ్మవారిపాలెం గ్రామాల సరిహద్దులో వెలసిన అచ్చమాంబ పేరంటాలు దేవస్థాన బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవస్థానంలో ఉదయం అమ్మవారికి పసుపు, కుంకుమతో పూజలు ప్రారంభించారు. రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో సారె కావిళ్ల సమర్పించారు. ఈ సందర్భంగా దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. 19న గురువారం ఉదయం గణపతి పూజ, హోమాలు, సాయంత్రం గ్రామ ఉత్సవం, 20 న శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, విశేషపూజలతో పాటు గ్రామ ఉత్సవం, 21 న శనివారం అమ్మవారి శాంతి కల్యాణం, అన్నదానం, సాయంత్రం కుంకుమార్చన పూజలు, ప్రదానోత్సవం, 22న ఆదివారం బండ్లు పొంగళ్లు, అన్నదానం, సాయంత్రం నిర్వహించే రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. వివరాలకు అడుసుమల్లి నరసింహులు 9916622599, రావెళ్ల వెంకటరత్నం 9701115809, దుద్దుకూరు మల్లి కార్జున 9440878147 లను సంప్రదించాలని తెలిపారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణశాఖ పీడీ శ్రీనివాసప్రసాద్

గృహ నిర్మాణాల పరిశీలన

తాళ్లూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : తాళ్లూరులోని ఎన్టీఆర్ గృహ సముదాయాల్లోని గృహనిర్మాణాలను జిల్లా గృహనిర్మాణశాఖ పీడీ శ్రీనివాసప్రసాద్ బుధవారం పరిశీలించారు. హౌసింగ్ పథకంలో ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న ఆర్థిక సాయం వివరాలను తెలుసుకున్నారు.లబ్ధిదారులు వేగవంతంగా గృహాలు నిర్మించుకుంటే తక్షణమే బిల్లులు అందుతాయన్నారు. ప్రభుత్వం గృహలబ్ధిదారులకు అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని ఇంకానిర్మాణాలు చేపట్టని లబ్ధిదారులు గృహాలు నిర్మించుకోవాలన్నారు. హౌసింగ్ సిబ్బంది కూడా ప్రతివారం ప్రభుత్వ ఇస్తున్న లక్ష్యాలమేరకు పురోగతి ఉండేలాచూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఐసీ హనుమంతరావు, వర్క్ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ నిర్మాణానికి స్థల పరిశీలన

దొనకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన దొనకొండలో ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు కోసం పొదిలి ఆర్టీసీ డిపో మేనేజర్ శంకరరావు బుధవారం స్థల పరిశీలన చేపట్టారు. ఈనెల 2వ తేదీన మార్కాపురంలో జరిగిన బీజేపీ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు రీజనల్ ఛైర్మన్ సురేష్‌రెడ్డిని దొనకొండ మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు రొడ్డా వెంకటరామయ్య, యువమోర్చా నాయకుడు బత్తుల శ్రీనివాసులు కలిసి దొనకొండలో బస్టాండ్ లేక ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన ఆర్టీసీ చెర్మన్ సురేష్‌రెడ్డి సమస్యను పొదిలి డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. ఛైర్మన్ ఆదేశాల మేరకు పొదిలి డిపో మేనేజర్ శంకరరావు దొనకొండకు విచ్చేసి బస్టాండ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దొనకొండ నుంచి హైదరాబాద్, దొనకొండ నుంచి వినుకొండ, దొనకొండ నుంచి త్రిపురాంతకం, దొనకొండ నుంచి శ్రీశైలంకు బస్సులు ఏర్పాటు చేయాలని, రద్దు చేసిన సిద్దాయిపాలెం బస్సును పునరుద్ధరించాలని దొనకొండ సర్పంచ్ గ్రేస్‌రత్నకుమారి, దేవానంద్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పులిమి రమణాయాదవ్, మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల బ్రహ్మయ్య, వార్డు సభ్యులు కోటపాటి రామారావు, బొందల రాజు వినతి పత్రం అందజేసి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రొడ్డా వెంకటరామయ్య, బత్తుల శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు, వ్యాపారవేత్త పరుచూరి రామలింగయ్య మరికొందరు గ్రామస్థులు పాల్గొన్నారు.



పొదిలి డిపో మేనేజర్ శంకర్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న దొనకొండ సర్పంచ్, గ్రామస్థులు (ఫైల్)

పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలి

ఏపీడీ లలిత కుమారి

ముండ్లమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండ్ల తోటలు సాగు చేసే విధంగా అవగాహన కల్పించాలని, ప్రతి గ్రామంలో పది ఎకరాలకు తగ్గకుండా వివిధ రకాల పండ్ల తోటలను సాగు చేసేలా చూడాలని డ్వామా ఏపీడీ ఆర్. లలిత కుమారి అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటల సాగును ప్రోత్సహిస్తుందన్నారు. బత్తాయి, దానిమ్మ, తైవాన్ జామ, నిమ్మ, సపోటతో పాటు పలు రకాల పండ్ల తోటలు పూర్తి స్థాయి సబ్సిడీతో అందజేస్తామని, రైతులందరూ పండ్ల తోటల వైపు దృష్టి సారించే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు అవగాహన కల్పించటంలో నిర్లక్ష్యం వహించే ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏపీవో నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌ల వరకు 21 పంచాయతీలకు వెళ్లి దండోరా వేయించి పండ్ల తోటలు సాగు వైపు దృష్టి మళ్లించే విధంగా చూడాలన్నారు. మూడు సంవత్సరాల పాటు రైతులకు పూర్తి సబ్సిడీ వర్తిస్తుందన్నారు. మండలానికి రెండు వందల ఎకరాలు టార్గెట్‌గా నిర్ణయించామన్నారు. ఈ నెలాఖరు కల్లా పారం పాండ్స్ పూర్తి చేసే విధంగా చూడాలన్నారు. ఉపాధి హామి పథకం కూలీలకు రోజుకు కనీస వేతనం రూ. 290 వచ్చే విధంగా మార్కింగ్ ఇవ్వాలని టీఏలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో పీ వెంకటరావు, ప్లాంటేషన్ సూపర్ వైజర్ ఈ. రజిని, ఈసీ శివరామ కృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

మండలంలోని పంటలు సాగు చేసే రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించే విధంగా చూడాలని మండల వ్యవసాయ అధికారి ఏ తిరుమలరావు అన్నారు. బుధవారం మండలంలోని పసుపుగల్లు, కెల్లంపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వనరుల శాఖ అధికారిణి శేషమ్మ, వీఏఏలు గిరిబాబు, నరేంద్రబాబు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న కనిగిరి ఏడీఏ వెంకటరమణ

పంపిణీకి సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

పీసీపల్లి :రైతులకు అవసరమైన పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచామని కనిగిరి ఏడీఏ వెంకటరమణ అన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుదేవారిపాలెం, పెద అలవలపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి బుధవారం ఆయన పర్యటించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాలలో రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 50శాతం రాయితీపై జనుములు, జీలుగలను రైతులకు పంపిణీ చేసేందుకు రైతుసేవాకేంద్రాలకు సరఫరా చేసిందని ఆయన చెప్పారు. అవసరమైన రైతులు రైతుసేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అన్నారు. పొలంలో వేసిన పచ్చిరొట్ట అయిన జనుము,జీలుగలను పైరు వేసిన 45రోజుల తరువాత పంటను భూమిలో కలియదున్నాలని ఆయన తెలిపారు.తద్వారా భూమిలో సారవంతం పెరిగి నీటిని నిల్వ చేసుకునే శక్తి వస్తుందని అన్నారు. అలాగే రసాయన ఎరువుల వాడకాన్ని పంటకు తగిన మోతాదులో మాత్రమే వేయాలని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎన్.రంగకృష్ణ, పశువైద్యాధికారి ఆవులరెడ్డి, వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మల్లమాంబ, మల్లికార్జున స్వామి ఆలయ మూడో వార్షికోత్సవం

ముండ్లమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ముండ్లమూరులోని మల్లమాంబ, మల్లికార్జున స్వామి ఆలయ మూడవ వార్షికోత్సవం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. భక్తులు పొంగళ్లు పెట్టుకొని నైవేద్యాన్ని స్వామికి సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఓం నమఃశివాయ...ఓం నమఃశివాయా అంటూ శివనామ స్మరణతో ఆలయం మారుమోగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం అంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ముండ్లమూరుతో పాటు వేంపాడు, పెదరావిపాడుతో పాటు వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన భక్తులు వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవ విగ్రహాలకు ఊరేగింపు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో మల్లమాంబ, మల్లికార్జున స్వామి

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలి

ముండ్లమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఉందని ఏపీవో టీ వెంకటరావు అన్నారు. బుధవారం ముండ్లమూరులో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్‌గా రాధాకృష్ణ

స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా వై. రాధాకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలులోని డీఆర్వో సీసీగా పని చేస్తూ బదిలీ పై ముండ్లమూరులో నియమితులయ్యారు.

నాణ్యమైన ఎరువులను అమ్మాలి

తాళ్లూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులను మాత్రమే అమ్మాలని మండల వ్యసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. తూర్పుగంగవరంలోని ఎరువులు,పురుగుల మందుల దుకాణాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణాలు తరుచూ తనిఖీ చేస్తామని, నాణ్యత లోపం ఉంటే సీజ్ చేస్తామని హెచ్చరించారు. తూర్పుగంగవరం లోని వెంకటసాయి డిపోలో బీపీటీ 5204 కేఎన్ఎం1638, ఐపీఎం2-14, వరి,పెసర రకాల శాంపిల్స్ సేకరించి తాడేపల్లి గూడెంలోని రీజనల్ కోడింగ్ సెంటర్‌కు పంపినట్లు తెలిపారు.

వెంగళాయపల్లి పాఠశాలలో 20 కొత్త అడ్మిషన్లు

పీసీపల్లి,జూన్18(ఆంధ్రజ్యోతి):మండలంలోని వెంగళాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఒక్కరోజే 20 కొత్త అడ్మిషన్లు నమోదు చేశారు. వెంగళాయపల్లితో పాటు పెదయిర్లపాడు తదితర గ్రామాల నుంచి 20మంది విద్యార్థులను ఎంఈవోలు ఆర్.శ్రీనివాసులు, సంజీవిలు పాఠశాలలో జాయిన్ చేసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, బూట్లు, బెల్టులను అందజేశారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల అందజేత

పామూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చట్టుమడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 వ తరగతి విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం అందచేస్తున్న ఉచిత పాఠ్య పుస్తకాలను టీడీపీ మండల ఎస్సీ నాయకలు బద్దిపూడి మార్క్ బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బద్దిపూడి శారమ్మ, మార్క్ దంపతుల ఆర్థిక సహకారంతో పలకలు, పెన్నులు, నోటు పుస్తకాలు పెన్సిళ్లను పంపిణీ చేశారు.

సీఎస్‌పురం తహసీల్దార్‌గా హుస్సేన్

సీఎస్‌పురం(పామూరు) జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం నూతన తహసీల్దార్‌గా ఎండి హుస్సేన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లూరు జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తూ సాధారణ బదిలీలలో భాగంగా సీఎస్‌పురంకు వచ్చారు.

మలేరియా వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

మలేరియా పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారిణి డాక్టర్ రవళి ప్రియాంక అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్టీవో కాలనీ ప్రాంతంలో బుధవారం మలేరియా వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మహారుద్ర పీఠానికి స్టీల్‌గ్రిల్స్ బహూకరణ

పీసీపల్లి,జూన్18(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెదయిర్లపాడులో మహారుద్ర పీఠం ప్రధాన మందిరానికి చుట్టూ ఏర్పాటు చేయనున్న స్టీల్‌గ్రిల్స్‌కు అవసరమైన నగదును పోలు జగన్మోహన్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతులు అర్చకులు పలుకూరి సుబ్బారావుకు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా గిల్స్ ఏర్పాటుకు రూ. 25,000 ఆర్థిక సహాయం చేసిన జగన్మోహన్‌రెడ్డి, విజయలక్ష్మి దంపతులను ఆశీర్వదించి స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

పంచాయతీ కార్యదర్శుల నియామకం

ముండ్లమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమవరం పంచాయతీ కార్యదర్శిగా జే ఆనంద్ కుమార్, భీమవరం పంచాయతీ కార్యదర్శిగా సీవీఎస్ సాయి తులసి నియమితులయ్యారు.

హెల్త్ క్లినిక్ వద్ద పిచ్చి మొక్కల తొలగింపు

పామూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుకట్టకిందపల్లి గ్రామ బీసీ కాలనీలోని విలేజ్ హెల్త్ క్లీనిక్ కేంద్రం వద్ద మొలిచిఉన్న పిచ్చి చెట్లను, కేంద్రం పరిసరప్రాంతాలను ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగింపు చర్యలను ఎంపీడీవో బుధవారం చేపట్టారు. ఇటీవల హెల్త్ క్లినిక్‌లో పరిశుభ్రత పనులు చేపట్టేందుకు తలుపులు తీసిన ఆరోగ్య కార్యకర్త పాముకాటుకు గురైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఆదేశాల మేరకు పరిసరాలను శుభ్రపరిచే కార్యక్రమాలు చేపట్టారు.

23న మెగా జాబ్ మేళా

దొనకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గౌతమి విద్యా సంస్థల అధినేత కే గుండారెడ్డి నేతృత్వంలో ఈనెల 23వ తేదీన దర్శి పీజీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు స్థానిక గౌతమి డిగ్రీ కాలేజీ అడ్మిన్ ఎప్రాయిమ్(నాని) తెలిపారు. 25 సంవత్సరాలు వయస్సు కల్గి ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.25వేలు జీతం ఉంటుందని శ్రీ గౌతమీ డిగ్రీ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 7032285130, 8333905119 నెంబర్లను సంప్రదించాలని ఆయన వివరించారు.

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర మహాసభల విజయవంతానికి కృషి చేయాలి

కనిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఏపీయూడబ్ల్యూజే 36వ రాష్ట్ర మహాసభలు విజయవంతం చేసేందుకు ప్రతి సభ్యుడు కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షులు ఐవీ సుబ్బారావు పిలుపునిచ్చారు. బుధవారం కనిగిరిలో యూనియన్ గౌరవాధ్యక్షుడు యాసిన్ అధ్యక్షతన ఏపీయూడబ్ల్యూజే యూనియన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు ఐవీసుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీరమణ, సురేష్‌లను కమిటీ ఘనంగా సన్మానించింది.



ప్రసాదుకు ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

స్నేహితుడికి చేయూత

● బాసటగా నిలిచిన నాటి పూర్వ విద్యార్థులు

పీసీపల్లి,జూన్18(ఆంధ్రజ్యోతి):వారంతా 25 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న స్నేహితులు. అందరూ వివిధ రంగాల్లో పనిచేస్తూ స్థిరపడ్డారు. ఇంతలో తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు అనారోగ్యానికి గురై ప్రస్తుతం ఇబ్బందుల్లో ఉన్నాడన్న విషయం వారికి తెలిసింది. దీంతో వారంతా చేయిచేయి కలిపి ముందుకు వచ్చారు. తలా కొంత మొత్తం వేసుకుని సాయాన్ని అందించారు. మండలంలోని వేపగుంపల్లి గ్రామానికి చెందిన కోటపాటి ప్రసాదు గ్రాడ్యుయేషన్ చదివి ఓ ప్రైవేటుసంస్థలో పని చేస్తున్నాడు. అనారోగ్యానికి గురైన అతనికి పక్షవాతం కనిపించింది. దీంతో ఉద్యోగం చేయలేక ఇంటికే పరిమితమయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కోటపాటి ప్రసాదు ఉదంతం 2001-2005 వరకు అతనితో చదివిన నాటి పూర్వ విద్యార్థులకు తెలిసింది. వెంటనే వారంతా తలా కొంత నగదును పోగుచేశారు. బుధవారం ప్రసాదు గ్రామమైన వేపగుంపల్లికి వెళ్లి అతనిని కలిసి రూ. 55,000 అందజేశారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ప్రసాదును కలిసి నగదును అందజేసిన వారిలో మధు, నరేష్, ప్రసాదు, శ్రీనివాసులు, నారాయణమ్మ, మాధవి, రాధ, హైమావతి తదితరులు ఉన్నారు.అనంతరం పెదయిర్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లిన వీరు అక్కడ ఉపాధ్యాయులను కలిసి పాఠశాలకు రూ.10వేల విలువ కలిగిన బీరువాను బహూకరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న లింకన్

6,774 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి

పామూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి 29 గ్రామాల్లో 6,774 మంది రైతులకు ఈకేవైసీ పూర్తి అయినట్లు ఏవో టీ అబ్రహం లింకన్ సూచించారు. మండంలోని లక్ష్మీనరసాపురం, మోపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ నెలలోనే రైతులకు చెందిన బ్యాంకు ఖాతాలో మొదటి విడత కింద రూ.7 వేలు జమ అవుతాయని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం రాయితీతో రైతులకు అందజేస్తున్నామని, కావాలసిన రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొని ప్రభుత్వం అందించే పథకాల గురించి అవగాహన కల్పిస్తారన్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికరాదాయం సాధించే దిశగా ప్రోత్సహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామవ్యవసాయ సహాయకులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.



వేలం నిర్వహణాధికారితో మాట్లాడుతున్న హనుమారెడ్డి

పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలి

- ఏపీ రైతుసంఘం అధ్యక్షుడు హనుమారెడ్డి

కనిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఏపీరైతు సంఘం అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి డిమాండ్ చేశారు. పొదిలి రోడ్డులోని కనిగిరి పొగాకు వేలం కేంద్రాన్ని బుధవారం కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దేవర సుబ్బారెడ్డిలతో కలసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఒక్కో బ్యారన్‌కు పొగాకు రైతుకు రూ. 6లక్షల వరకు పెట్టుబడులు పెట్టారన్నారు. ఇలాంటి పరిస్థితిల్లో లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయకపోవటం అన్యాయమన్నారు. పొగాకు రైతుల సమస్యలను వేలం కేంద్ర నిర్వహణాధికారి దృష్టికి తీసుకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతుసంఘం కార్యదర్శి గుజ్జుల బాలిరెడ్డి, పీ కొండయ్య, వాసు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్‌కళ్యాణ్, ఏఐటీయూసీ నాయకులు ఖాసీంపీరా తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

● విద్యార్థులకు అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ

పామూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినులను ఆకతాయిలు ఈవ్‌టీజింగ్ పేరుతో వేధిస్తుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ టీ కిశోర్‌బాబు హెచ్చరించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కోటిరెడ్డి అధ్యక్షతన బుధవారం ఈవ్‌టిజింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. విద్యపరంగా ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి లేదా హెచ్ఎం దృష్టికి తీసుకురావాలన్నారు. అదే విధంగా చిన్న వయస్సులో వివాహాలు చేసుకొంటే అనేక అనర్థాలు సంబవిస్తాయని, బాల్య వివాహాలు చేసుకోరాదని, ఎవరైనా ప్రోత్సహించినా తమ దృష్టికి తీసుకొనిరావాలని సూచించారు. బాలికల విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు ఉచితంగా సమకూరుస్తుందని, ఎలాంటి భయం లేకుండా చదువుపై దృష్టి పెట్టి విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ గుత్తి కొండలరావు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉష్ణోగ్రత (అంచనా) 19-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	37	28
తెనాలి	38	28
నరసరావుపేట	37	27
బాపట్ల	37	28
రెంటచింతల	37	28
చీరాల	37	28

అమరావతిలో..



నాగార్జున వర్సిటీలో..



ఆకట్టుకున్న యోగాంధ్ర

అంతర్జాతీయ యోగా దినోత్సవం సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు, ఉద్యోగులు, అధికారులు రోజుకో థీమ్‌తో యోగా ఆసనాలతో ఆకట్టుకుంటున్నారు. బుధవారం పల్నాడు జిల్లాలో పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా పేరుగాంచిన అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద, కృష్ణానదీ తీరాన, వేలాది మందితో యోగాంధ్ర నిర్వహించారు. గుంటూరు సమీపంలోని ఆచార్య నాగా ర్జున యూనివర్సిటీ క్రీడా ప్రాంగణంలో వర్సిటీ, అనుబంధ కళాశాలలకు చెందిన విద్యార్థులు ఎనిమిది వేల మంది యోగాసనాలు వేశారు. అటు అమరా వతిలో ఇటు నాగార్జునవర్సిటీలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో గుంటూ రు, పల్నాడు జిల్లా కలెక్టర్లు, నాగలక్ష్మి అరుణ్‌బాబులతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

- అమరావతి, పెదకాకాని (ఆంధ్రజ్యోతి)



అసెంబ్లీ పునాదుల కోసం గుంతలు తీసేందుకు వచ్చిన డ్రిల్లర్

ఐకానిక్ అసెంబ్లీ పనులు.. ప్రారంభం

- ఏర్పాట్లలో కాంట్రాక్టు సంస్థ
- రెండు నెలలుగా భూమి పరీక్షలు
- ఇప్పటికే మొదలైన ఐకానిక్ సెక్రటేరియట్ 1, 2 టవర్ల పనులు

గుంటూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి గుండెకాయ అయిన ఐకానిక్ అసెంబ్లీ నిర్మాణ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమయింది. రాజధాని మొత్తానికి తలమానికమైన ఈ నిర్మాణ కాంట్రాక్టును పొందిన ఇంజనీరింగ్ సంస్థ సోమవారం నుంచి పనులను ప్రారంభించింది. నిర్మాణ ప్రాంతంలోకి భారీ డ్రిల్లర్లు, సరంజామాను తరలించి ఏర్పాట్లు చేసుకుంటోంది.

● రెండు నెలలుగా కొనసాగుతున్న పనులు

రాజధాని అమరావతిలో 103 ఎకరాల్లో దాదాపు 11.22 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 250 మీటర్ల ఎత్తులో వ్యూ పాయింట్ ఉండేలా నిర్మిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక నిర్మాణం కావడంతో నిర్మాణ సంస్థ అనేక జాగ్రత్తలు తీసుకుంటోంది. రెండు నెలలుగా అక్కడి భూమి స్వభావం, నాణ్యతపై అధ్యయనం చేస్తోంది. నిర్మాణానికి కావాల్సిన కొలతలు తీసుకుంటోంది. ఆ పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. కాగా సోమవారం నుంచి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. భారీ డ్రిల్లర్లను నిర్మాణ స్థలంలోకి తరలించి సిద్ధం చేసుకుంటున్నారు. నిర్మాణ పునాదుల కోసం కావాల్సిన గుంతలు తీసే పనులు ప్రారంభించారు.

● గత వారమే మొదలైన జీఏడీ టవర్ల నిర్మాణ పనులు

కిందటివారమే జీఏడీ, సెక్రటేరియట్ టవర్ల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. పరిపాలనా భవనాన్ని 17.03 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 47 అంతస్తులతో నిర్మిస్తున్నారు. దీంతోపాటు



ఐకానిక్ అసెంబ్లీ నిర్మాణం కోసం వేసిన పిల్లర్ బాక్స్

68.88 లక్షల చదరపు అడుగులు విస్తీర్ణంలో 40 అంతస్తులు ఉండేలా సెక్రటేరియట్ భవనాలను నిర్మించాలని ప్రభుత్వం భావించింది. దీనికి సంబంధించిన ఎల్‌ఓసీలు ఈనెల 2న పూర్తయ్యాయి. మొత్తం రూ. 3,673.44 కోట్లకు టెండర్లు ఖరారయ్యాయి. దీంతో సెక్రటేరియట్ టవర్ 1, టవర్ 2ల పనులు ప్రారంభమయ్యాయి. కిందటి వారమే పనులు ప్రారంభం కావడంతో పునాదుల్లోకి చేరిన నీరు, బురదను ఇప్పటికే తొలగించివేశారు. ఇప్పటికే కొంతమేర నిర్మాణం జరిగి ఉన్న రాఫ్ట్ ఫౌండేషన్ల వద్ద సేఫ్‌హోల్డులు నిర్మించుకుని తదుపరి పనులకు సన్నద్ధమవుతున్నారు. భారీ వాహనాలు నేరుగా రాఫ్ట్ ఫౌండేషన్ వద్దకు చేరుకునేలా రోడ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేసుకున్నారు. పాడైపోయిన ఐరన్‌రాడ్లను వెల్డింగ్ ద్వారా కట్ చేసి తొలగిస్తున్నారు.

బర్లీ పొగాకు.. రైతుకు ఊరట

ముగిసిన కసరత్తు.. నేటి నుంచి కొనుగోళ్లు

- తొలిసారిగా మార్క్‌ఫెడ్ ద్వారా సేకరణకు సిద్ధం
- పర్చూరులో నేడు ప్రారంభించనున్న వ్యవసాయ శాఖ మంత్రి
- బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల రైతుల హర్షం
- చివరి ఆకు వరకు కొనుగోలు చేయాలని వీసీలో కలెక్టర్లకు సీఎం ఆదేశాలు

(నరసరావుపేట రూరల్, గుంటూరు, బాపట్ల, పర్చూరు - ఆంధ్రజ్యోతి)

రెండు నెలల నుంచి కొనుగోళ్లు లేక అల్లాడుతూ ఆందోళనలో ఉన్న బర్లీపొగాకు రైతుకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంది. కొనుగోళ్లు చేస్తే కంపెనీలకు మినహాయింపులు కూడా ఇచ్చింది. సంక్షోభం నుంచి రైతులను ఒడ్డున పడేయడానికి రెండు నెలల్లో ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. అయినా క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు ఆశాజనకంగా లేకపోవడంతో

(మిగతా 8వ పేజీలో)

కొనుగోళ్లకు ఏడు కేంద్రాలు

కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం లేకున్నా నల్ల బర్లీ పొగాకు కొనుగోళ్లకు ఏడు కేంద్రాలను ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. ఏఎంసీ పర్చూరు, ఎస్‌డబ్ల్యూసీ చీరాల, బీకే పాలెం(ప్రైవేటు గోడౌన్), సీడబ్ల్యూసీ గుంటూరు, సీడబ్ల్యూసీ పెదకాకాని, ఎస్‌డబ్ల్యూసీ యడ్లపాడు, గుండ్లపల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. పర్చూరు ఏఎంసీలో గురువారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కొను గోళ్లను లాంఛనంగా ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఇతర కేంద్రాల్లోనూ కొనుగోళ్లను ఒకటి, రెండు రోజుల్లో మొదలు పెట్టనున్నట్లు మార్క్‌ఫెడ్, మార్కెటింగ్ అధికారులు తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

ప్రణాళికా బద్ధంగా.. కొనుగోళ్లు

కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యేలు ఏలూరి, వేగేశన

బర్లీ పొగాకు కొనుగోళ్లు ప్రణాళిక బద్ధంగా సాగేందుకు వ్యవసాయశాఖ, మార్కెటింగ్, మార్క్‌ఫెడ్ విభాగాలతో బాపట్ల కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటమురళి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఇందులో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుతో పాటు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా 67,132 ఎకరాల్లో బ్లాక్ బర్లీ పొగాకు సాగుచేయగా ఈ-క్రాప్‌లో 50,513 ఎకరాలే నమోదు చేయడం ఏమిటని వ్యవసాయాధికారులను నిలదీశారు. 28,019 రైతుల వివరాలను మాత్రమే ఈక్రాప్‌లో నమోదు చేయటంపై అసహనం వ్యక్తం చేశారు. వారంలోగా పొగాకు రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలన్నారు. 8331057095 నెంబరుతో టోల్‌ఫ్రీ ఏర్పాటు చేశామన్నారు. చరిత్రలో ఎప్పుడు లేని విధంగా నేరుగా మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగి పొగాకు కొనడం చిన్న విషయం కాదని, దీనిని రైతులంతా సంబరంలా జరుపుకోవాలని ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, మార్క్‌ఫెడ్ అధికారి కరుణశ్రీ, మార్కెటింగ్‌శాఖాధికారి రమేష్‌బాబు, వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.



వేమూరు-చావలి ఆర్అండ్‌బీ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు (పాత చిత్రం)

రోడ్డు తవ్వి వదిలేశారు

- ఐదు నెలలుగా స్పందించని అధికారులు

వేమూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రాకపోకలకు రోడ్డు అనువుగా లేదని మరమ్మతులకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తి తవ్వి వదిలేశాడు. ఐదు నెలలైనా కాంట్రాక్టరు ఆచూకీ లేకపోగా.. అధికారులు కూడా పట్టించుకోవడంలేదు. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వారు గతంలో కన్నా అధ్వానంగా రోడ్డును మార్చారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేమూరు నుంచి చావలి మార్గంలో ఐదు కి.మీ దూరం కలిగిన ఆర్అండ్‌బీ రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గత జగన్ ప్రభుత్వంలో రోడ్డు గురించి పట్టించుకోలేదు. ప్రభుత్వం మారడంతో ఎమ్మెల్యే ఆనందబాబు రోడ్డు పునః నిర్మాణం కోసం రూ.కోటి నిధులను మంజూరు చేయించారు. జనవరిలో టెండర్ పిలవగా గుంటూరుకు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారు. అదే నెలలో పనిని ప్రారంభించి రోడ్డును తవ్వేశారు. ఆ తర్వాత అటు వైపు కాంట్రాక్టర్ కానీ, అధికారులు కానీ కన్నెత్తి చూడలేదు. దీంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. వర్షాలతో రోడ్డు అంతా జలమయం కావడంతో పాటు పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఈ మార్గం గుండా వెళ్లే వాహన చోదకులు రైతులు అవస్థలు పడుతున్నారు. చావలి, పెరవలి, పెరవలిపాలెం, గూడవల్లి, కోడిపర్రు, పెనుమర్రు, భట్టిప్రోలు మండలంలోని కొన్ని గ్రామాలకు అలాగే చెరుకుపల్లి మండలంలోని కొన్ని గ్రామాలకు ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుంటారు.

వచ్చే నెలలో ప్రారంభం..

వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ విద్యాసాగర్ తెలిపారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టరు మొదటి దశలోనే వదిలి వెళ్లిపోయారన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే, ఉన్నతాధికారులతో చర్చించి తక్షణ చర్యలకు ఆదేశించారని తెలిపారు. కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేశామని, కాంట్రాక్టును కూడా రద్దు చేసి త్వరలో నోటిఫికేషన్ ద్వారా కాంట్రాక్టు పిలవడం జరుగుతుందన్నారు.

కృష్ణానదిలో జిల్లాల సరిహద్దులు గుర్తింపు

అక్రమంగా ఇసుక తవ్వకాలు చేయరాదని ఆర్డీవోల హెచ్చరిక

కొల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రెండు గ్రామాల మధ్య నెలకొన్న వివాదాలు సద్దుమణిగేలా కృష్ణా, బాపట్ల జిల్లాల రెవెన్యూ అధికారులు కృష్ణానదిలో సరిహద్దులు నిర్ణయించారు. బుధవారం జువ్వలపాలెం, ఆముదాలలంక పరిధిలో రెండు జిల్లాల సరిహద్దులను మచిలీపట్నం ఆర్డీవో స్వాతి, రేపల్లె ఆర్డీవో రామలక్ష్మి, సర్వేయర్లు, సబ్ డివిజన్ అధికారుల సహకారంతో హద్దులు గుర్తించారు. బాపట్ల, కృష్ణా జిల్లాలను విడదీసి జెండాలు పాతించారు. ఈ సందర్భంగా ఆర్డీవోలు మాట్లాడుతూ రెండు ప్రాంతాల్లో ఇసుక అక్రంగా తవ్వుతూ ఇరుగ్రామాల వారు ఘర్షణలు పడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తున్నారన్నారు. జువ్వలపాలెం, ఆముదాల లంక గ్రామాల పరిధిలో ఉన్న కృష్ణానదిలో ఇసుక తవ్వకాలకు అనుమతులు లేవన్నారు. ఎవరూ అనధికారికంగా తవ్వకాలు చేయరాదని హెచ్చరికలు జారీ చేశారు. తవ్వకాలు జరగకుండా ఆయా ప్రాంతాల్లో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గస్తీ ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, సీఐ అంజనేయులు, ఎస్ఐ అమరవర్ధన్, ఏఎస్ఐ అర్జున్ పాల్గొన్నారు.



సరిహద్దుల వద్ద జెండాలు పాతుతున్న రెవెన్యూ సిబ్బంది

ఉపాధ్యాయులు ఎక్కడ?

- బదిలీలతో పల్లెల్లోని బడులు ఖాళీ
- పట్టణ ప్రాంతాలకు తరలిన ఉపాధ్యాయులు
- వెనుకబడిన మండలాలకు వెళ్లేందుకు వెనుకంజ
- మారుమూల మండలాల్లో అనేకం ఏకోపాధ్యాయ పాఠశాలలే..
- పాఠశాలల్లో టీచర్ల కొరతపై విద్యాశాఖకు ఎంఈవోల నివేదిక
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5000 మందికి స్థానచలం

గుంటూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బదిలీలతో ఇక ఉపాధ్యాయులకు కొరత ఉండదు. పాఠశాలల్లో విద్యార్థులకు ఇక ఇబ్బందులు ఉండవు. అన్ని పాఠశాలల్లోనూ ఉపాధ్యాయులు సంపూర్ణంగా ఉంటారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం.. అని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. అవాంతరాలు.. ఆందోళనలతో ఎట్టకేలకు గతవారంలో ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి చేశారు. సోమవారం నుంచి పాఠశాలల్లో ఆయా ఉపాధ్యాయులు చేరుతారు.. బోధనకు ఇబ్బందులు ఉండవని విద్యాశాఖ అధికారులు తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. బదిలీలతో పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మారుమూల మండలాల్లోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా పోయారు. అసలే ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు పడుతున్న ఆయా పాఠశాలలు బదిలీల కారణంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోనున్నాయి. బాపట్ల, పల్నాడు జిల్లాలో అనేక మండలాల్లో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఏర్పడే ప్రమాదం పొంచి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీల్లో దాదాపు 5000 మందికిపైగా ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది వీరిలో అత్యధికమంది పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని వివిధ మండలాల నుంచి ఉమ్మడి జిల్లా కేంద్రమైన గుంటూరు, ఆ సమీప పట్టణ ప్రాంతాలకు బదిలీ చేసుకున్నారు. ప్రధానంగా పల్నాడులో వెనకబడిన ప్రాంతాలైన బొల్లాపల్లి, వెల్దుర్తి, ఈపూరు, దాచేపల్లి, మాచవరం, వినుకొండ రూరల్ తదితర మండలాల నుంచి ఎక్కువ మంది ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాలకు బదిలీ

(మిగతా 8వ పేజీలో)



పల్నాడులోని ఓ పాఠశాలలో ఒకే టీచర్ బోధన

ఒత్తిడి నియంత్రణకు యోగా దోహదం

- ఎస్పీ తుషార్ డూడి
- పోలీసు కార్యాలయంలో యోగా సాధన

బాపట్ల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణకు యోగాసాధన ఎంతగానో దోహదపడుతుందని ఎస్పీ తుషార్‌డూడి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని పోలీసు పేరెడ్ గ్రౌండ్‌లో యోగాసాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా గురువులు ధూళిపాళ్ళ శైలజ పాల్గొని 32 రకాల యోగాసనాలతోపాటు సూర్య నమస్కారాలను పోలీసులతో సాధన చేయించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజన్‌ల పరిధిలోని పోలీసు అధికారులు, ఏఆర్ పోలీసులు పాల్గొన్నారు. యోగా ద్వారా శారీరక మానసిక ఆరోగ్యాన్ని పొందవచ్చు అని ఎస్పీ తెలిపారు. పోలీసు విధులలో పని ఒత్తిడి అధికంగా ఉండే నేపథ్యంలో యోగా ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మౌలుద్దీన్, ఆర్ఎస్ఐ కళ్యాణ్, యోగా మాస్టర్ ట్రైనర్ గురజాల శ్రీనివాసరావు, కర్పూరపు మంజులత, కృష్ణారావు, ఎం.సూరిబాబు, బాజీ, ప్రసాద్ పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతుకు ఊరట

(5వ పేజీ తరువాయి)

నేరుగా ప్రభుత్వమే రంగంలోకి దిగింది. కొనుగోళ్ల కోసం నేరుగా మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇంతటితో సరిపెట్టకుండా కొనుగోళ్ల కోసం రూ.300 కోట్ల ప్రత్యేక కేటాయించేలా కేంద్ర పెద్దలను ఒప్పించింది. రాష్ట్రంలోనే కాదు, దేశచరిత్రలోనే పొగాకు కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్ రంగంలోకి దిగడం ఇదే తొలిసారి అని పలువురు చెప్తున్నారు. దీంతో నాలుగు జిల్లాల పరిధిలో ఏడు కేంద్రాల్లో మార్క్‌ఫెడ్ కొనుగోళ్లను ప్రారంభించనున్నది. పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై బర్లీ పొగాకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

రెండే గ్రేడ్లు..

గ్రేడ్ల పేరిట రైతులను ఇబ్బంది పెట్టకుండా రెండు గ్రేడ్లుగానే కొనుగోలు చేయాలనే మార్గదర్శకాలను ప్రభుత్వం జారీ చేసింది. హెచ్‌డీఎం రకానికి క్వింటా ధర రూ.12,000, హెచ్‌డీఎక్స్ రకానికి క్వింటా రూ.6,000గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల పరిధిలో దాదాపు 4 లక్షల క్వింటాళ్ల వరకు బర్లీ నిల్వలు ఉన్నట్లు ప్రభుత్వం ప్రాథమికంగా జరిపిన పరిశీలనతో తేలింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లా వాటానే దాదాపు 2.80 లక్షల క్వింటాళ్లుగా ఉండడం గమనార్హం. నాలుగు జిల్లాల పరిధిలో 15 కొనుగోలు కేంద్రాలు తెరవాలనే సూత్రప్రాయ నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఇందులో ఒక్క బాపట్ల జిల్లాలనే ఏడు కాగా మిగిలినవి ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలో తెరవాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో గురువారం బాపట్ల జిల్లాలో మూడు, ప్రకాశం జిల్లాలో ఒకటి, పల్నాడు జిల్లాలో రెండు, గుంటూరు జిల్లాలో ఒకటి చొప్పున కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేలా ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది.

తొలి దశలో 15 మిలియన్ల టన్నులు

మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించారు. బర్లీ పొగాకు చివరి ఆకు వరకు రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేయాలని ఆదేశించారు. తొలి దశలో 15 మిలియన్ల టన్నులను సేకరించాలని, ఆ తర్వాత దశల వారీగా పెంచుకుంటూ పోవాలని సూచించారు. పొగాకు కొనుగోలు చేయడానికి సీఎం యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

ఉపాధ్యాయులు ఎక్కడ?

(5వ పేజీ తరువాయి)

అయ్యారు. అదే స్థాయిలో వెనుకబడిన మండలాలకు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడానికి సుముఖత చూపలేదు. దీంతో ఆయా పాఠశాలల్లో భారీ సంఖ్యలో ఉపాధ్యాయుల కొరత ఉన్నట్లు మండల విద్యాశాఖ అధికారులు ఇప్పటికే విద్యాశాఖకు నివేదిక అందజేశారు.

రిలీవ్ కాకుండా ఏర్పాట్లు చేసినా..

పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మారుమూల ప్రాంతాల్లోని మండలాల్లో బదిలీ అయినా కొన్ని రోజులు అక్కడే విధులు నిర్వహించాలని విద్యాశాఖ మౌఖికంగా ఉపాధ్యాయులను ఆదేశించింది. ఆయా ఉపాధ్యాయులు తమకున్న సెలవుల్ని వాడుకుంటూ బదిలీ అయిన ప్రాంతాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఏం చేయాలో పాలు పోక విద్యాశాఖ అధికారులు మదన పడుతున్నారు. కొన్ని పాఠశాలల్లో ఒకే ఉపాధ్యాయుడు ఐదు తరగతులు బోధించాల్సి వస్తోంది. మరికొన్ని పాఠశాలల్లో సీఆర్పీలతో నెట్టుకు రావాలని అధికారులు ప్రయత్నిస్తున్నా వీలు కావడం లేదని సమాచారం.

కొత్త డీఎస్సీ వస్తేనే భర్తీ..

ప్రభుత్వం ఇప్పటికే మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీ చేసి పరీక్షలు నిర్వహిస్తోంది. త్వరలో ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ తదితర విభాగాల్లో దాదాపు వెయ్యికి పైగా పోస్టులు రానున్నట్లు విద్యాశాఖ వర్గాలు అంచనా. ఈ పోస్టులను ప్రధానంగా బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని మారుమూల పాఠశాలలకు కేటాయించాలని ఆలోచిస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బర్లీ పొగాకు కొనుగోలు చరిత్రాత్మకం

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



మార్క్‌ఫెడ్ డీఎంను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

పర్చూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రజాకూటమి ప్రభుత్వం లక్ష్యమని పర్చూరు శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు చెప్పారు. వేల ఎకరాల్లో సాగుచేసుకున్న నల్లబర్లీ పొగాకు కొనుగోలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుకు ముందుకు రావడం చరిత్మాక అంశమన్నారు. బుధవారం పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసి నేడు ప్రారంభించనున్న నల్లబర్లీ పొగాకు కేంద్ర ప్రాంగణాన్ని, గోడౌన్లను ఎమ్మెల్యే ఏలూరి మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, వ్యవసాయ అధికారులు, రైతుల నేతృత్వంలో పరిశీలించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లబర్లీ రైతులను ఆదుకొని న్యాయం చేసేందుకు కొనుగోలుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ప్రభుత్వం ప్రస్తుతం రూ.300 కోట్ల బడ్జెట్ కేటాయించిందన్నారు. అవసరమైతే మరో రూ.వెయ్యి కోట్లు కూడా కేటాయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండు గ్రేడ్‌ల ద్వారా నాణ్యమైన పొగాకు క్వింటా రూ.12000, లోగ్రేడ్ పొగాకు రూ.6000 చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. ఇప్పటికే రైతుల వివరాలను వ్యవసాయశాఖ ద్వారా సేకరించినట్లు తెలిపారు. మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడీఏ ఎస్.మోహనరావు, ఏవోలు రామమోహనెడ్డి, భాస్కర్‌రావు, నాయకులు వెంకట్రావు, నాయుడు హనుమంతురావు, షంషుద్దీన్, ఏజీపీ నరేంద్రకుమార్, కారుమంచి కృష్ణ, కొల్లా శ్రీనివాసరావు, పోత్రు శోభన్, రాముడు, వెంకటేశ్వర్లు, శివరాంప్రసాద్, పోపూరి శ్రీనివాసరావు, పఠాన్ సమీర్ పాల్గొన్నారు.

పర్చూరు ఏఎంసీని పరిశీలించిన కలెక్టర్



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి, మార్క్‌ఫెడ్ ఎండీ జిలానీ సామూన్, ఆర్డీవో గ్లోరియా

పర్చూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ వెంకటమురళి, మార్క్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ) జిలానీ సామూన్, వ్యవసాయ, రెవెన్యూశాఖ అధ్వర్యంలో పరిశీలించారు. నేడు బర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియ ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చిందన్నారు. నాణ్యమైన పొగాకు క్వింటా రూ.12వేలు, లోగ్రేడ్ పొగాకు క్వింటా రూ.6వేల చొప్పున కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో గ్లోరియా, మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ, ఏడీఏ ఎస్.మోహనరావు, ఆయా శాఖల అధికారులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట్ త్రివినాగ్ అన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో బుధవారం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షల నిషేధిత చట్టంపై వైద్యాధికారులు, స్వచ్ఛంద సంస్థలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ త్రివినాగ్ మాట్లాడుతూ మార్కాపురం డివిజన్ పరిధిలో ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు 44, ప్రభుత్వ వైద్యశాలల్లో ఐదు ఉన్నాయన్నారు. డివిజన్ పరిధిలో ఆడ పిల్లల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. వెయ్యి మంది మగ పిల్లలకుగాను 981 మంది ఆడపిల్లలు ఉన్నారన్నారు.

ఈ నిష్పత్తి అంతరాన్ని తగ్గించేందుకు వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.పద్మావతి, టౌన్ ఎస్సై డాక్టర్ ఎమ్.రాజమోహన్‌రావు, డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ శ్రావణితేజ, డాక్టర్ శివారెడ్డి, మదర్సస్ ఇండియా సంస్థ సెక్రటరీ జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్ద దోర్నాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను వినియోగించుకొని అభివృద్ధి చెందాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ చెప్పారు. మండలంలోని నల్లగుంట్ల, లకచెర్ల గిరిజన గ్రామాల్లో ధర్తి ఆబ జన్ భగీదరి అభియాన్ కార్యక్రమంపై బుధవారం చెంచు గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఫోర్స్‌మెంటు డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ మాట్లాడుతూ 17 మంత్రిత్వ శాఖల ద్వారా ప్రవేశపెట్టిన పథకాల్లో భాగంగా ప్రతి ఒక్కరికీ పక్కాగృహం, ఇంటింటికీ కొళాయి ద్వారా తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, రేషన్‌కార్డుల మంజూరు, ఉజ్వల గ్యాస్ సిలిండర్, ఆధార్ కార్డు అందజేత వంటి బృహత్తర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత అధికారులకు సహకరించి అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఏవో జవహర్‌లాల్ నాయక్, పంచాయతీ కార్యదర్శులు శివకోటేశ్వరరావు, రంగయ్య, ఏఈవో చైతన్యకుమార్, టీపీ షేక్ లాల్ అహ్మద్, హౌసింగ్ ఏఈ సోమశంకర్, గిరిజన నాయకులు మంతయ్య, వీఆర్‌వో చెన్నయ్య పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను చెంచు కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని ఎర్రగొండపాలెం తహసీల్దారు డి. మంజునాథరెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని గుర్రపుశాల, చెర్లోతాండా, వేగినాటి కోటయ్య నగర్ కాలనీలలో దర్తి ఆబ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా ఆయా గూడాలలో చెంచు కుటుంబాలను గుర్తించి వారికి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు, సర్పంచ్‌లు, సిబ్బంది, చెంచులు తదితరులు పాల్గొన్నారు.

చిట్టడవిని తలపిస్తున్న పోలీసు క్వార్టర్స్

అద్దంకిలో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మాణం

రెండు దశాబ్దాల క్రితం శిథిలావస్థకు

అద్దంకి, జూన్18(ఆంధ్రజ్యోతి): అద్దంకిలో సుమారు 4 దశాబ్దాల క్రితం పోలీస్ క్వార్టర్స్ నిర్మించారు. అయితే రెండు దశాబ్దాల క్రితం నుండి భవనాలు శిథిలావస్థకు చేరడం ప్రారంభమయ్యాయి. సుమారు 15 సంవత్సరాల క్రితం పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. దీంతో పూర్తిగా మూసివేసి సుమారు 7 సంవత్సరాల క్రితం శిథిలమైన భవనాలను భవనాలను తొలగించారు. అద్దంకి పట్టణంలో ఎన్టీఆర్ నగర్ వద్ద నామ్‌రోడ్డు వెంబడి సుమారు 2.50 ఎకరాల విస్తీర్ణంలో పోలీస్ క్వార్టర్స్ స్థలం ఉంది. అయితే కొద్ది భాగంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటు చేశారు. మిగిలిన స్థలంలో చెట్లు పెరిగి చిట్టడవిని తలపించేలా మారింది. దీంతో విషసర్పాలు చేరే ప్రమాదం ఉందని సమీప గృహాల ప్రజలు కూడా భయపడుతున్నారు. పోలీసు క్వార్టర్స్ లేకపోవడంతో పోలీస్ అధికారులు, సిబ్బంది నివాసానికి ఇబ్బంది పడుతున్నారు. అద్దంకి పట్టణంలో ఇళ్లఅద్దెలు ఎక్కువగా ఉండడం సిబ్బందికి మరింత భారంగా మారింది. అధికారులు, సిబ్బంది బదిలీలు జరిగినప్పుడల్లా అద్దె ఇళ్ల కోసం వేట సాగించాల్సిన పరిస్థితి. అద్దంకి పట్టణంలో త్వరలో డీఎస్పీ కార్యాలయం కూడా ఏర్పాటు చేసే అవకాశం కూడా ఉండడంతో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణంపై ప్రజా ప్రతినిధులు, పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.



పోలీస్ క్వార్టర్స్ స్థలం లో దట్టంగా పెరిగి ఉన్న చిల్లచెట్లు

క్వార్టర్స్ స్థలంలో పెరిగిన వేపచెట్లు



బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన

నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో ప్రసన్నలక్ష్మి

ఒంగోలురూరల్ జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం గుండాయపాలెం గ్రామానికి తూర్పున గల బకింగ్‌హాం కెనాల్‌పై వంతెన నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఆ మేరకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, ఆర్డీవో లక్ష్మీప్రసన్నలు బుధవారం స్థల పరిశీలన చేశారు. గుండాయపాలెం గ్రామ మత్స్యకారులు గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులకు బకింగ్‌హాం కాలువపై ఫ్లైఓవర్ వంతెన నిర్మించాలని వినతిపత్రాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో వంతెన కోసం నిధులు మంజూరు చేయటానికి ప్రతిపాదనలు తయారుచేయటానికి జేసీ, ఆర్డీవో, ఇంజనీరింగ్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు భూములను పరిశీలించారు. గుండాయపాలెం సమీపంలోని షిప్ ల్యాండింగ్ కేంద్రం నుంచి అధికారులు గుండ్లకమ్మ సముద్రంలో కలిసే ప్రదేశానికి బోటుపై ప్రయాణించారు. గుండ్లకమ్మ నుంచి పోయే బకింగ్‌హాం కాలువను కూడా పరిశీలించారు. అక్కడ పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. కార్యక్రమంలో రూరల్ తహసీల్దార్ నాయబ్ రసూల్, డీటీ అశోక్, ఆర్ఐ శ్రీనివాసరావు, మండల సర్వేయర్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.



బోటుపై సముద్రంలోకి ప్రయాణిస్తున్న జేసీ గోపాలకృష్ణ, ఆర్డీవో ప్రసన్నలక్ష్మి

బూత్‌లెవల్ ఏజెంట్ల వివరాలు అందజేయాలి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న జ్యోతికుమారి

అద్దంకి, జూన్18 (ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయపార్టీలు ఖచ్చితంగా ఆయా పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల వివరాలు అందజేయాలని అద్దంకి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుండ్లకమ్మ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జ్యోతికుమారి అన్నారు. అద్దంకిలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధ వారం రాజకీయపార్టీల నాయకులతో ఈఆర్‌వో జ్యోతికుమారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం ఉన్నందున వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, సీపీఐ, సీపీఎం నేతలు కేఏల్‌డీ ప్రసాద్, తంగిరాల వెంకటేశ్వర్లు, అద్దంకి, పంగులూరు తహసీల్దార్లు శ్రీచరణ్, శింగారావు, ఎలక్షన్ డిటీ సుబ్రహ్మణ్యం డిప్యూటీ తహసీల్దార్లు రాఘవ, రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

అవీఇవీ

వెలిగొండ పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై తీర్మానాలు

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సైదా



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సైదా

మార్కాపురం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై ఈ నెల 24న జరిగే జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో తీర్మానాలు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా అన్నారు. మార్కాపురంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24న ఒంగోలులో జరిగే జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల హాజరవుతున్నట్లు చెప్పారు. జిల్లాల పర్యటనలో భాగంగా ఆమె పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని పలు సమస్యలపై చర్చ జరుగుతుందన్నారు.అన్ని ప్రాంతాల నుంచి కాంగ్రెస్ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. సమావేశంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రెహనాబాబు, జిల్లా మైనార్టీ విభాగం ఛైర్మన్ షేక్ షంషీర్ అలీ, కార్యదర్శి మహబూబ్ అలి, మార్కాపురం టౌన్, మండల, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇమ్రాన్, వి.రమేష్, షేక్ హుసేన్, ఎన్.ఇమ్మానియేల్ పాల్గొన్నారు.

మూడు రోజులుగా వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం

ఎండిపోతున్న పంటలు.. రైతుల ఆందోళన

లైన్‌మన్ పనితీరుపై తీవ్ర విమర్శలు



తాళ్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తాళ్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మూడురోజులుగా తాళ్లూరు దక్షిణపొలాలకు వ్యవసాయ విద్యుత్ సరఫరా లేక పంటలు ఎండు ముఖం పడుతున్నాయని పలువురు రైతులు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. తాళ్లూరు లైన్‌మన్ బాబూరావు మూడురోజులుగా విద్యుత్ మరమ్మతులంటూ ఎల్‌సీలు తీసుకుని కోత విధిస్తున్నారన్నారు. గంటల కొద్దీ ఎల్‌సీ తీసుకోవడంతో వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం కలుగు తుందని వాపోయారు.సబ్ స్టేషన్ వద్దకు వచ్చి ప్రశ్నిస్తే లైన్‌మన్ ఎల్‌సీ తీసుకున్నాడని చెప్పారని, లైన్‌మన్‌కు ఫోన్ చేస్తే తీయకపోగా తమ పట్ల అవమర్యాదకరంగా మాట్లాడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.అధికారులు స్పందించి వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

భర్త రెండవ వివాహం చేసుకోవడంపై ఫిర్యాదు

అద్దంకి, జూన్18(ఆంధ్రజ్యోతి): భర్త రెండవ వివాహం చేసుకోవడంపై భార్య స్థానిక పోలీస్ స్టేషన్ లో బుధవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. మండలంలోని ధర్మవరానికి చెందిన బండి బాలరోశయ్య రెండవ వివాహం చేసుకున్నాడు. దీంతో భార్య శ్రీహిత బుధవారం పోలీసులకు భర్త, కుటుంబసభ్యులు, బంధువులపై ఫిర్యా దు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి,జూన్18(ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్ టవర్ లైన్ పనుల కారణంగా గురువారం ఉదయం కొత్త దామావారిపాలెం, శింగరకొండరోడ్డు, పెద్ద మసీదు సెంటర్, భవానిసెంటర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈఈ దామోదరం తెలిపారు.

సెప్టిక్‌ట్యాంకు నిండడంతో ప్రజలు అవస్థలు

ఇంకొల్లు,జూన్ 18,(ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు ఆర్టీసీ బస్టాండు ఆవరణలోని సెప్టిక్‌ట్యాంకు నిండి రోడ్డు మీద ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సెప్టిక్‌ట్యాంకు మ్యాన్‌హోల్ పైపులు దెబ్బతినడంతో సమస్య తలెత్తి మురుగునీరు అంతా బుధవారం ప్రధాన రహదారిపైకి చేరి ప్రవహించింది. దీంతో ఈ ప్రాంత మంతా దుర్గంధభరితంగా మారింది. సెప్టిక్‌ట్యాంకు పూడికతీత పనులు పూర్తిస్థాయిలో చేపట్టే విధంగా ఆర్టీసీ అధికారులు తగుచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

వ్యక్తిపై మద్యంమత్తులో పలువురి దాడి

ఈపూరుపాలెం (చీరాల), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తిపై పలువురు మద్యంమత్తులో దాడిచేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన వల్లెపు గోపి తన భార్యకు అస్వస్థతగా ఉండడంతో శీతలపానియం తెచ్చేందుకు తెల్లవారుజామున దుకాణం వద్దకు వెళుతున్నాడు. అదే సమ యంలో హరీష్, తేజసాయి, కిరణ్, రవి మరొకరు శివాలయం సమీపంలో మద్యం సేవిస్తున్నారు. అయితే గోపీ తేజసాయికి పాతపరిచయం ఉంది. ఆ చనువుతో పిలిచారు. కానీ మద్యం సేవించి శృతిమించి తూలనాడారు. అలాగే ఆయనపై ఐదుగురు దాడికి పాల్పడ్డారు. బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందగా బాధితుడి ఫిర్యాదు మేరకు ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.

పండించిన పొగాకు మొత్తం కొనాలి

ఇంకొల్లు, జూన్ 18, (ఆంధ్రజ్యోతి) : పొగాకు పండించిన ప్రతిరైతు వద్ద నుండి ఎటువంటి నిబంధనలు లేకుండా పొగాకు కొనుగోలు చేయాలని రైతుసంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి నల్లపనేని రామారావు బుధవారం డిమాండ్ చేశారు. ఇంకొల్లులో పర్చూరు రోడ్డులోని మార్కెట్ యార్డు వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో పొగాకు రైతులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కాలయాపన లేకుండా వెంటనే పొగాకు కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు కందిమళ్ల రామకోటేశ్వరరావు, మాదాల అంజియ్య, భానుప్రసాద్, రంగారావు, వెంకట్రావు, సుబ్బారామయ్య, జాన్, రైతులు పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్‌అదాలత్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో వచ్చేనెల 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి బుధవారం తెలిపారు. ఇరువర్గాల ఆమోదంతో కేసుల పరిష్కారానికి కక్షిదారులందరూ సహకరించాలన్నారు. రాజీపడదగిన అన్ని క్రిమినల్ కేసులు, మోటారు వాహన ప్రమాద బీమా పరిహారం చెల్లింపు, చెక్ బౌన్స్ కేసులు, వివాహ సంబంధ వ్యాజ్యాలు, అన్ని రకాల సివిల్ కేసులు ఇరువురి ఆమోదంతో పరిష్కరిస్తారన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల్లో ఉన్నవారు ఉపయోగించుకొని వ్యాజ్యాలను పరిష్కరించుకోవాలని కోరారు. లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసులలో తీర్పు అంతిమ తీర్పు అని అన్నారు. పోలీసు అధికారులు, ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారానికి సహకరించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి కోరారు.

అవీ..ఇవీ..

ప్రభుత్వ పాఠశాలలోనే పిల్లలను చేర్పించాలి


విద్యార్థుల వివరాలు నమోదు చేసుకుంటున్న హెచ్ఎం

చినగంజాం, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని రామచంద్రనగర్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం షేక్.నాయుబ్‌రసూల్ అన్నారు. కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ బుధవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో చేరే బాలబాలికలకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించారు. పాఠశాల అభివృద్ధికి సహకరించాలని విద్యార్థుల తల్లిదండ్రులను ఉపాధ్యాయులు కోరారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. నూతనంగా చేరే విద్యార్థుల వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ కొక్కిలిగడ్డ మస్తాన్‌రావు, ఉపాధ్యాయులు సిద్ధం నాగమల్లేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు స్టాప్ బోర్డుల ఏర్పాటు


భవనాసి చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లు

అద్దంకి, జూన్18 (ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో ప్రమాదాల నివారణకు పోలీస్, నామ్‌రోడ్డు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన నామ్ రోడ్డులో పెరిగిన ప్రమాదాలు కథనానికి పోలీసులు, నామ్‌రోడ్డు అధికారులు స్పందించారు. శింగరకొండ సమీపంలో భవనాసి చెరువు కట్ట వద్ద వేగనియంత్రణ కోసం స్టాపర్లను ఏర్పాటు చేశారు. దీంతో వాహనాల వేగం కొంత మేర తగ్గింది. అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్ వద్ద కూడా స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేయనున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పేరాల(చీరాల), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ జూలై 9న నిర్వహించు జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎం.వసంతరావు పిలుపునిచ్చారు. బుధవారం పేరాల కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్మికులంతా సంఘటితమై సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎన్.బాబురావు, సుధాకర్, రామిరెడ్డి, నీలాంబరం, శివనాగరాజు, ఏసురత్నం, సులోచన, సంధ్య, అరుణ, వెంకటేశ్వరమ్మ, పోతురాజు పాల్గొన్నారు.

శవాలకూ జాగారమే..!

- మార్చురీ కొరవడిన వసతులు
- మృతదేహాలను నిల్వ ఉంచేందుకు ఫ్రీజర్‌లు బాక్సులు కరువు

అద్దంకిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో మార్చురీ గదిలో వసతులు కొరవడ్డాయి. వివిధ సంస్థలు, దాతలు గతంలో ఆస్పత్రికి ఇచ్చిన ఫ్రీజర్లు మరమ్మతులకు గురయ్యాయి. ఇక వైద్యశాలకు పోస్టుమార్టం కోసం వచ్చిన మృతదేహాన్ని పోస్టుమార్టం చేసేంత వరకు భద్రపరచడం ప్రహసనంగా మారింది. ప్రైవేటు వ్యక్తులు అద్దె ప్రాతిపదికన ఉన్న ఫ్రీజర్ల కోసం వేచి ఉంచాల్సి వస్తోంది. ఇక మార్చూరీకి గుర్తు తెలియని మృతదేహాలను ఎవరివో కనుగోనేందుకు కనీసం మూడు రోజుల పాటు భద్రపరచాల్సి ఉంటుంది. ఇక్కడ ఫ్రీజర్లు లేకపోవడంతో ఇలాంటి మృతదేహాలను భద్ర


మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్న పాతఫ్రీజర్లు

పరచడం వ్యయప్రయాసలతో ఇబ్బందులు తప్పడం లేదు. పోలీసులే నయానో భయానో ప్రైవేటు ఫ్రీజర్లల్లో ఉంచుతున్నారు. ఇక వైద్యశాలకు వచ్చే మృతదేహాలను ప్రైవేట్ వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న మార్చరీ బాక్సులలో పెట్టి వాటికి డబ్బు చెల్లించాల్సిన పరిస్థితి వైద్యశాల వద్ద నెలకొంది.

వైద్యశాలకు ఒక వైపు జాతీయ రహదారి, మరొక వైపు రాష్ట్రీయ రహదారి ఉండడంతో ఏదో ఒకచోట తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. వీటితో పాటుగా అద్దంకి నియోజకవర్గంలోని వివిధ మండలాలలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరిగి ప్రతి రోజు పోస్టుమార్టం కోసం మృతదేహాలను అద్దంకి వైద్యశాలకు తీసుకొస్తుంటారు. ఈ క్రమంలో వైద్యశాలలో మృతదేహాలను భద్ర పరిచేందుకు ఫ్రీజర్‌బాక్సులు లేకపోవడంతో అద్దెబాక్సులే దిక్కయ్యాయి. దీంతో మృతుల కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. గతంలో వైద్యశాలకు వివిధ సంస్థలు, దాతలు సమకూర్చిన ఫ్రీజర్లు మరమ్మతులకు గురికావడంతో వాటిని పక్కన పడేశారు. అయితే పలుమార్లు మరమ్మతులు చేయించిన అవి పని చేయడం లేదని వైద్యాధికారులు చెబుతున్నారు. దీంతో పోస్టుమార్టం కోసం వచ్చిన మృతదేహాలను భద్రపరిచేందుకు ప్రైవేట్ వ్యక్తులకు చెందిన మార్చరీ బాక్సులను నగదు చెల్లించి నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం 30 పడకల వైద్యశాల కావడంతో మార్చరీలో కనీస వసతులు లేక ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.



అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీ గది

వైద్యశాలను అప్‌గ్రేడ్ చేస్తేనే వైద్యశాలకు మరిన్ని వసతులు సమకూర తాయని పలువురు వైద్యాధికారులు అంటున్నారు. ఏదిఏమైనా మార్చరీ వద్ద ఫ్రీజర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొత్తవాటి కోసం ప్రతిపాదన పెట్టాం

ఇప్పటికే నాలుగైదు పర్యాయాలు మరమ్మతులకు గురైతే బాగుచేయించాం. ప్రస్తుతం అవకాశం లేకపోవడతో పక్కన పెట్టాం. ప్రభుత్వానికి ఒక ఫ్రీజర్ కావాలని నవేదికను పంపించాం.

వాహిలా చౌదరి వైద్యశాల పర్యవేక్షణాధికారి

తూర్పు తక్కెళ్లపాడులో తాగునీటి కష్టాలు

పంగులూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు తక్కెళ్లపాడు గ్రామ ప్రజలను తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రెండు దశాబ్దాల క్రితం ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన (రక్షిత మంచినీటి పథకం) ఉనికిని కోల్పోయింది. గ్రామ ప్రజల నీటి అవసరాలు తీర్చాలన్న నాటి పాలకుల సంకల్పం, దాతల దాతృత్వం నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. ప్రజలకు రక్షిత నీటిని అందించాలని ఏర్పాటు చేసిన పైలెట్ ప్రాజెక్ట్ నిర్వహణ లోపంతో అటకెక్కింది. రక్షిత నీటి సరఫరా నిలిచి పోవడంతో ప్రజలకు కనీసం తాగునీరైనా అందించాలన్న ఉద్దేశ్యంతో రక్షిత ట్యాంక్‌కు అనుసంధానంగా ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.


మూతపడ్డ ఆర్‌వో ప్లాంట్

పదేళ్లగా ప్లాంటు ద్వారా నీటి సరఫరా

పైలెట్ ప్రాజెక్ట్ ఏర్పాటుతో ప్రజల ముంగిటకు రక్షిత నీటిని సరఫరా చేసిన అధికారులు పైపులైన్‌లో తలెత్తిన లోపాలు, కొళాయిల వద్ద నెలకొన్న వివాదాలతో రక్షిత నీటి సరఫరా స్థానంలో తాగునీరు అందించే ఉద్దేశ్యంతో కొన్నేళ్ల క్రితం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా ఆర్‌వో ప్లాంట్ ద్వారా సజావుగా అందిన తాగునీరు ఏడాది కాలంగా ఎదురవుతున్న మరమ్మతులతో నేడు ప్రజలకు తాగునీరు సరిగా అందించలేని పరిస్థితి నెలకొంది. నీటిని శుద్ధి చేసే ఫిల్టర్లు మరమ్మతులకు గురికావ డంతో గత నెల తాగునీటి సరఫరా కు అంతరాయం ఏర్పడింది. మోటార్ వైండింగ్ రిపేరుతో నేడు నీటిసరఫరాకు అంతరాయం ఏర్పడింది. గత నెల నీటిని శుద్ధి చేయకుండా ప్లాంట్ ద్వారా తాగునీటి సరఫరా చేయడంతో కలుషితంగా ఉన్న నీటిని తాగలేక ప్రజలు ఇబ్బందిపడిన పరిస్థితి నెలకొంది. ఆర్‌వో ప్లాంట్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధికార యంత్రాంగం, ప్లాంట్ నిర్వాహకులు తగిన చర్యలు చేపట్టక పోవడాన్ని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ఆర్‌వో ప్లాంటునైనా సక్రమంగా నిర్వహించి తమకు స్వచ్ఛమైన నీటిని అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


జమ్ముతో నిండిన చెరువు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

- ఒకరి పరిస్థితి విషమం గుంటూరుకు తరలింపు


అపస్మారక స్థితిలో ఉన్న ఇమ్రాన్

రోశయ్యకాలనీ (చీరాల), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని రోశయ్య కాలనీలో చోటుచేసుకున్న రోడ్డుప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చీరాల నవాబ్‌పేటకు చెందిన షేక్ ఇమ్రాన్, రమీజాలు వరుసకు అన్నాచెల్లెళ్లు. ఇమ్రాన్ పెయింట్ పనిచేస్తున్నాడు. అయితే బ్యాంకు పనినిమిత్తం ద్విచక్ర వాహనంపై రోశయ్య కాలనీలో నుంచి వీరు బైకుపై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన వాహనం వీరి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో బైకు నడపుతున్న ఇమ్రాన్ కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో అపస్మారక స్థితిలోకి చేరాడు. ఆయన సోదరి రమీజా కాళ్ల చేతులకు స్వల్పగాయాలయ్యాయి. దీంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు గుంటూరుకు తరలించారు. అలాగే మరో వాహనంపై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వారికి స్వల్పగాయాలయ్యాయి. వీరు ప్రాథమిక చికిత్స తీసుకొని అక్కడి నుంచి వెళ్లారు.

మెరైన్ భవనం పనుల వేగం పెంచాలి

- ఎమ్మెల్యే కొండయ్య


మెరైన్ పోలీస్ స్టేషన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

వాడరేవు(చీరాల), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : దాతల సహకారంతో ప్రజాసేవకు వినియోగించే మెరైన్ పోలీస్ స్టేషన్ భవనాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. తీరంలో కొంత కాలంగా జరుగుతున్న భవన నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్ ఉన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై నిరసన


కమిషనర్ అబ్దుల్‌రషీద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు

చీరాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంలో అధికారులు చొరవ చూపాలని జిల్లా ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికుల కన్వీనర్ చిమటా వీరస్వామి కోరారు. బుధవారం మున్సిపల్ అబ్దుల్ రషీద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం రూ.21వేల జీతభత్యం అందిచాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అందించాలన్నారు. రిటైర్‌మెంట్ వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు నాగేశ్వరరావు, చాంద్‌బాషా, అశోక్, కాంతారావు, చందు, సంగీతరావు, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తల్లికివందనంతో పేద కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పాటు



రాజీవ్‌కాలనీలో సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న అశోక్

అద్దంకి,జూన్18(ఆంధ్రజ్యోతి): తల్లికివందనం పథకం ద్వారా వచ్చిన నగదు పేద కుటుంబాలలోని విద్యార్థుల విద్యాభివృద్ధికి ఎంతగానో తోడ్పాటుగా ఉంటుందని అద్దంకి పట్టణ టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకాని అశోక్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం పథకం డబ్బులు జమ చేసిన నేపథ్యంలో అద్దంకి పట్టణంలోని రాజీవ్ కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ల ఫోటోలు ఉన్న ఫ్లెక్సీ కి విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి టీడీపీ నేతలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు వడ్డవల్లి పూర్ణచంద్రరావు, చిలుకూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు అండగా కూటమి ప్రభుత్వం


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, జూన్18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడేవారికి ఆర్థిక ఇబ్బందులు లేకుండా ఉండేందుకు సీఎంఆర్ఎఫ్ రూపంలో టీడీపీ కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. బుధవారం మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 32 మందికి రూ.37,39,469 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరుకాగా, వారందిరికి, ఎమ్మెల్యే చేతుల మీదగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యం కోసం కూటమి ప్రభుత్వం భారీగా నిధులను ఖర్చు చేస్తోందన్నారు. దీనిలో భాగంగా సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదలను ఆదుకొంటోందన్నారు. పార్టీలు, గ్రూపులు, వర్గాలతో ప్రమేయం లేకుండా గ్రామాలలోని పేద కుటుంబాలకు ఆరోగ్యపరంగా ప్రభుత్వం సాయం అందించడానికి కంకణం కట్టుకొందన్నారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామేపల్లి హరిబాబు, కామినేని జనార్దన్, షేక్ రజాక్, కమ్మ శివనాగేశ్వరరావు, కోటపాటి సురేష్, మిన్నెకంటి రవికుమార్, నల్లపనేని రంగయ్యచౌదరి, గుదే తారక రామారావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

- బీజేపీ మహిళామోర్చ అధ్యక్షుడురాలు యామినిశర్మ


మాట్లాడుతున్న యామినిశర్మ

అద్దంకి,జూన్18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి తీసుకుపోవాలని బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చ కార్యదర్శి యామినిశర్మ అన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బుధవారం సాయంత్రం అద్దంకి పట్టణంలోని గీతామందిరంలో జరిగిన సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేద ప్రజలు, మహిళల సాదక బాధ లు తెలిసిన మోడీ జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి, గ్యాస్ సిలెండర్లు, మహిళా ఆర్థిక స్వావలంభన పథకాలు అమలుజేస్తు న్నారన్నారు. ముందుగా శింగరకొండ వద్ద హరిహర గోకులంలోని ఆవులను పరిశీలించి మొక్కలు నాటారు. కార్య క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బంగారుబాబు, తమ్మన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో దోషికి జైలు

చీరాల, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లులో ఇనుపరాడ్లను చోరీ చేసిన కేసులో దోషికి 10 నెలలు సాధారణ జైలుశిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జె కాత్యాయని తీర్పును వెలువడించారు. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని తోటవారిపాలెంలో రంగినేని హనుమంతురావు వేటపాలెం మండల పరిధిలోని కొత్తపేటలో శివసాయి రైస్‌మిల్ నడుపుతున్నారు. ఈక్రమంలో కొత్తపేట పరిధిలోని వడ్డెసంఘంకు చెందిన కసుకుర్తి సుబ్బారావు అలియాస్ సుమంత్ గతేడాది సెప్టెంబర్‌లో రైస్ మిల్లులో సుమారు రూ.20 వేలు విలువైన 10 ఇనుప గ్రిల్స్, 5 ఇనుప పైపులు చోరీకి పాల్పడ్డాడు. ఈ మేరకు నమోదైన కేసులో డీఎస్పీ ఎండీ మొయిన్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ నాగభూషణం, ఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుల్ నాగరాజు సకాలంలో కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేసి సాక్షులను కోర్టులో హాజరు పరిచారు. అలాగే పబ్లిక్ ప్రాసిక్యూటర్ పద్మారెడ్డి వాదనలు వినిపించడంతో బుధవారం న్యాయాధికారి తీర్పు వెలువడించారు. నేరస్థులు కచ్చితంగా శిక్షించబడతారని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు.

రామలింగేశ్వరుడికి

వైభవంగా చిలుక వాహనసేవ


చిలుక వాహనంపై ఊరేగుతున్న ఆది దంపతులు

విడవలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామతీర్థం రామలింగేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారు చిలుక వాహనంపై ఊరేగారు. తానే లోకంలో అందగాడినని గర్వంతో ఉన్న మన్మథుడిని, శివుడు తన మూడో నేత్రంతో దహించి గర్వభంగం చేస్తాడు. భౌతిక సౌందర్యం కన్నా, భక్తి గొప్పదని భక్తులకు చాటేందుకు రతీమన్మథుడి రూపంలో ప్రత్యేకంగా అలంకరించిన చిలుక వాహనంపై అధిరోహించి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత ఆలయ అర్చకులు పేరేపి శ్రీకాంత్‌శర్మ స్వామివారికి గణపతి పూజ, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఆనంతరం స్వామి అమ్మవార్లకు కొమారి వేణుగోపాల్ మత్స్యకార యూత్ వారు పూలంగి సేవను ఘనంగా జరిపారు. తదుపరి స్వామి,అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన చిలుక వాహనంపై రామతీర్థం, లక్ష్మీపురం గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఈ ఉత్సవానికి పొన్నపూడి పెద్దపాళేనికి చెందిన కొమారి రాము ఉభయకర్తగా వ్యవహరించారు. భక్తులకు లక్ష్మీపురానికి చెందిన గ్రామకాపులు కొండూరు సుబ్రహ్మణ్యం, రంగంగారి వెంకటేశ్వర్లు, గోవిందు అన్న సంతర్పణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో మల్లికార్జునరెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ సురేష్, గుమస్తా వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో బదిలీలకు షెడ్యూల్

- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల బదిలీలకు షెడ్యూల్ విడుదలైంది. బదిలీలను సజావుగా నిర్వహించేందుకు కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో ఎక్స్ అఫిషియోగా, సమగ్రశిక్ష ఏపీసీ సభ్యులుగా, డైట్ ప్రిన్సిపల్, డిప్యూటీఈవో, జీసీడీవోలను సభ్యులుగా నియమిస్తూ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరక్టర్ బీ.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు సంబంధించి గురువారం (నేటి) నుంచి ఈనెల 21వతేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ, 23న సీనియారిటీ జాబితా రూపకల్పన, 24న జాబితాల ప్రదర్శన, 27న అభ్యంతరాల స్వీకరణ, 28న ఫైనల్ సీనియారిటీ జాబితాను ప్రదర్శించనున్నట్లు ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఈనెల 30 నుంచి జూలై 2వతేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించి స్టేషన్ పాయింట్ల వారీగా నిబంధనలను అనుసరించి బదిలీలు చేపడతారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కేజీబీవీల బోధన, బోధనేతర సిబ్బంది, ఐఈఆర్‌పీలు, పార్ట్‌టైమ్ బోధకులు, క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లు, మండలస్థాయి అకౌంటెంట్‌లు, సైట్ ఇంజనీర్‌లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్‌లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసేంజర్లు, ఆఫీస్ సబార్డినేట్‌లు దరఖాస్తులు చేసుకోవాలని ఏపీసీ తెలిపారు. పూర్తి వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

ఆమంచర్ల కత్తి.. రైతులకు భలే ఆసక్తి!

- 50 గ్రామాలకు వ్యవసాయ పనిముట్లు ఇక్కడే తయారీ
- 'కనరాతి' కుటుంబానికి 120 ఏళ్లుగా ఇదే జీవనాధారం
- పొరుగు జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి


ఇనుక కడ్డీని ఎర్రగా కాల్చి కత్తిని తయారు చేస్తున్న కొలిమిపనివాళ్లు

రైతన్న కొడవలి పట్టాలన్నా.. గీత కార్మికుడు కత్తితో గొల కోయాలన్నా.. గొడ్డళ్లతో కూలీలు చెట్లు నరకాలన్నా.. అల్లె కత్తులతో బుట్టలు అల్లాలన్నా... ఎడ్ల బండ్లకు పట్టాలు వేయాలన్నా.. మొద్దు కత్తులతో కంపచెట్లు కొట్టాలన్నా నెల్లూరు రూరల్‌లోని ఆమంచర్ల గ్రామానికి రావాల్సిందే. చుట్టుపక్కల 50 గ్రామాలలో వ్యవసాయ అనుబంధ పనిముట్లు ఏవైనా సరే 'కనరాతి' కుటుంబం చేసిన సామగ్రే దిక్కు. 120 ఏళ్లుగా ఆ కుటుంబాలు కొలిమి వృత్తినే జీవనాధారంగా మలుచుకున్నాయి. వీరి చేతుల్లో తయారైన పదునైన కత్తులు మన రాష్ట్రంతోపాటు పొరుగు రాష్ట్రాలకూ ఎగుమతి అవుతుంటాయి.

- నెల్లూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

8 లో..

అన్నదాతలకు ఆర్థిక భరోసా

- జిల్లాలో 1.77లక్షల మందికి 'అన్నదాత సుఖీభవ'
- ఇప్పటికే 98శాతం ఈకేవైసీ పూర్తి
- ఇక మిగిలింది రెండురోజులే...!
- నెలాఖరులోపు ఖాతాల్లో నగదు జమ

నెల్లూరు(వ్యవసాయం), (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు అన్నదాత సుఖీ భవ పథకం అమలుకు కార్యాచరణ రూపొందించింది. ఈ నెలాఖరులోపు కర్షకుల ఖాతాల్లో మొదటి విడత నిధులు జమ చేసే అవకాశం ఉంది. జిల్లాలో ఈ పథకం కింద దాదాపుగా 1.77లక్షల మంది రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించనుంది. ఈ మేరకు జాబితాను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. ఇప్పటికే 98శాతానికి పైగా ఈకేవైసీ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన రెండు శాతం పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొన్నారు.

మూడు విడతల్లో సాయం

అన్నదాత సుఖీభవ, పీఎం.కిసాన్ పథకాల ద్వారా రైతులకు ఏడాదికి రూ.20వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చింది. పీఎం.కిసాన్ రూ.6వేలు కాగా, రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.14వేలు. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో అందించేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పీఎం కిసాన్ పథకం కింద మూడు విడతల్లో రూ.2వేల చొప్పున రూ.6వేలు అందించ నున్నది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల చొప్పున రెండు విడతలు మరో విడతలో రూ.4వేలు జమ చేయనున్నట్లు సమాచారం. ఈనెలలోనే రైతులకు సాయం అందే అవకాశాలు ఉన్నాయి.

రేపటితో గడువు పూర్తి



రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి 1.77లక్షల కుటుంబాల జాబితా సిద్ధం చేశాం. ఇందులో సుమారుగా 1,73,652 మంది కుటుంబాలకు అంటే 98శాతానికి పైగా ఈకేవైసీ పూర్తయింది. మిగిలిన 3,348 మంది కుటుంబాలకు చేయాల్సి ఉంది. ఈనెల 20వతేదీ వరకు ప్రభుత్వం సమయం ఇచ్చినందున నూరు శాతం ఈకేవైసీ పూర్తి చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

అర్హులుగా 1.77లక్షల మంది

అన్నదాత సుఖీభవ పథకం కింద జిల్లాలో 1.77లక్షల మంది రైతు కుటుం బాలకు సాయం అందనుంది. జిల్లాలో మొత్తం 3.19లక్షల రికార్డులు ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. అందులో ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ప్రతి సర్వే నెంబరును పరిశీలిం చడం, ఆర్‌టీజీఎస్ పరిశీలనల అనంతరం కుటుంబం యూనిట్‌గా లబ్ధిదారులను ఎంపిక చేశారు. పథకానికి అర్హత ఉందో లేదో తెలుసుకునేందుకు 'చెక్ స్టేటస్' అనే ఆప్షన్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. రైతు సేవా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి వారి ఆధార్ నెంబరు నమోదు చేస్తే అర్హుల వివరాలు కనిపిస్తాయి.


కనుపూరు చెరువులో మట్టి అక్రమ తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు(ఫైల్)

'కనుపూరు'లో

దోపిడీ రూ.30 కోట్లు

- 12.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి ఎత్తుకెళ్లినట్లు నిర్ధారణ
- రూ.231కు బదులుగా రూపాయి చెల్లించి దోపిడీ
- రైతుల సంతకాలు ఫోర్జరీ చేసి అనుమతులు
- పోలీసు విచారణలో వెలుగులోకి అక్రమాలు
- కాకాణి కోసం పీటీ వారెంట్ వేసిన వెంకటాచలం పోలీసులు
- పరారీలో పలువురు వైసీపీ నేతలు

నెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): చేసిన తప్పునకు శిక్ష అనుభవించక తప్పదని పెద్దలు ఊరికే అనలేదు. కనుపూరు చెరువు విషయంలో ఇప్పుడు అదే జరుగుతోంది. నాడు వైసీపీ ప్రభుత్వంలో అధికారమే అండగా సాగిన దోపిడీకి నేడు అక్రమార్కులు మూల్యం చెల్లించుకుంటున్నారు. రైతులు గగ్గోలు పెట్టినా, ప్రతిపక్షాలు గోల చేసినా, ప్రజలు బహిరంగంగా విమర్శలు చేసినా.. నాడు మట్టి అక్రమార్కులు ఏ మాత్రం జంకలేదు. కనుపూరు చెరువులో భారీ ఎత్తున మట్టిని తవ్వి, లేఅవుట్లకు అమ్ముకొని సొమ్ముచేసుకున్నారు. ఈ అక్రమాలపై ఇప్పుడు రైతులు వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ వేగవంతంగా జరుగుతోంది. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఏ2గా మందల వెంకటశేషయ్య, ఏ3గా అల్లంపాటి నిరంజన్‌రెడ్డిలను చేర్చారు. వారం క్రితం వెంకటాలం పోలీసులు నెల్లూరులోని ఇరిగేషన్ కార్యాలయం నుంచి రికార్డులు తీసుకెళ్లారు. ఆ తర్వాత కనుపూరు చెరువులో జరిగిన తవ్వకాలను సాంకేతికత సాయంతో లెక్కించారు. దాదాపు 12.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వేసినట్లు నిర్ధారించారు. అయితే అనుమతులు మాత్రం రూ.2.30 లక్షల క్యూబిక్ మీటర్లకే ఉన్నట్లు ఇరిగేషన్ శాఖ రికార్డులు చెబుతుండడం గమనార్హం.

ప్రభుత్వ విలువే రూ.30 కోట్లు..!

చెరువుల్లో మట్టిని రైతులు సొంత అవసరాలకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. పొలాలను మెరక చేసుకునేందుకు క్యూబిక్ మీటర్‌కు రూపాయి చెల్లించి మట్టిని తవ్వి తీసుకెళ్లవచ్చు. ఇందుకు రెవెన్యూ అధికారులు ధ్రువీకరణ అవసరమవుతుంది. అయితే కమర్షియల్ అవసరాలకు మాత్రం క్యూబిక్ మీటర్‌కు రూ.231 చెల్లించాల్సి ఉంది. కానీ గత ప్రభుత్వంలో రైతుల మాటను వైసీపీ నేతలు మట్టి దోపిడీ చేశారు. కనుపూరు చెరువు కింద ఉన్న కొందరు రైతుల పాసుపుస్తకాలను సంపాదించి, వారి సంతకాలు ఫోర్జరీ చేసి ఇరిగేషన్ అధికారులకు దరఖాస్తు చేశారు. ఈ దరఖాస్తులకు రెవెన్యూ అధికారుల ధ్రువీకరణపత్రం కూడా లేదు. అయినా ఇరిగేషన్ అధికారులు అనుమతులు మంజూరు చేసేశారు. ఇలా రూపాయి లెక్కన చెల్లించి లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని లేఅవుట్లకు తరలించారు. పోలీసుల విచారణలో 12.80 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వినట్లు తేలింది. అంటే రూ.231 లెక్కన చూసుకుంటే సుమారు రూ.30 కోట్ల మేర ప్రజాధనాన్ని దోచుకున్నట్లు లెక్క. కానీ మార్కెట్లో ఇంకా

- మిగతా 8వ పేజీలో

రేపే బార్ అసోసియేషన్

ఎన్నికలు

- త్రిముఖ పోటీలో గెలుపెవరిదో...?

నెల్లూరు (లీగల్), మే 18 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మకమైన నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు శుక్రవారం జరగనున్నాయి. అసోసియేషన్‌లో మొత్తం న్యాయవాదులు 2,507మంది ఉన్నారు. అయితే బార్ కౌన్సిల్ పంపిన ఓటర్ల జాబితా ప్రకారం అరియర్స్ కట్టని వారి పేర్లు పోను ఓటర్ల సంఖ్య 1,362గా ఉంది. ఒక ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, ట్రెజరర్, లైబ్రరీ సెక్రటరీ, స్పోర్ట్స్ సెక్రటరీ, లేడీ రెప్రజంటేటివ్, ముగ్గురు సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, ఐదుగురు జూనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నెంబర్ల ఎంపకకు ఎన్నికలు జరగనున్నాయి. ప్రధానంగా మూడు ప్యానళ్లు బరిలో ఉన్నాయి. వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్యానల్ నుంచి అధ్యక్ష పదవికి పులిమి అయ్యప్పరెడ్డి, ఉపాధ్యక్ష పదవికి ఈదూరు భాస్కరయ్య, ప్రధాన కార్యదర్శి పదవికి నక్కల నాగరాజు, సంయుక్త కార్యదర్శి పదవికి కేఎల్. నారాయణ పోటీలో ఉన్నారు అలాగే ఐక్యవేదిక ప్యానల్ నుంచి అధ్యక్ష పదవికి వేళ్ల ఉపేంద్రరావు, ఉపాధ్యక్ష పదవికి జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి పదవికి ఎస్. అంకయ్య, సంయుక్త కార్యదర్శి పదవికి నాగేళ్ల రవిక్రిష్ణ పోటీలో ఉన్నారు. జాతీయ న్యాయవాద వేదిక తరఫున అధ్యక్ష పదవికి దాసరి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్ష పదవికి బీఎస్.రంగరాజన్, ప్రధాన కార్యదర్శి పదవికి సీహెచ్.నవీన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి పదవికి టీ బాబురెడ్డి పోటీలో ఉన్నారు. మిగతా పదవులకు కూడా అత్యధిక సంఖ్యలో న్యాయవాదులు పోటీ పడుతు న్నారు. ఇప్పటికే పోటీలో ఉన్న న్యాయవాదులు తమ గెలుపు కోసం విస్తృత ప్రచారం చేశారు. ఈ దఫా ముక్కోణపు పోటీ జరనుండడంతో పోటీ రసవత్తరంగా మారింది. ఎన్నికల అధికారు లుగా సీనియర్ న్యాయవాదులు బీ.శ్రీనివాసన్, సీవీ.రత్నం వ్యవహరిస్తున్నారు. ఈనెల 20వతేదీ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. అదేరోజు రాత్రి ఏడు గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఓటింగ్‌కు వచ్చే న్యాయవాదులు తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును తెచ్చు కోవాలని, పోలింగ్ బూత్‌లోకి సెల్‌ఫోన్లు లేకుండా రావాలని నిబంధనలు విధించారు.

కమనీయం..

వెంగమాంబ కల్యాణం


వెంగమాంబ పేరంటాల కల్యాణోత్సవంలో మంగళసూత్రాన్ని చూపుతున్న అర్చకులు

- వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమ ఊరేగింపు
- కనుల పండువగా ప్రదానోత్సవం
- నర్రవాడకు పోటెత్తిన భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన దుత్తలూరు మండలం నర్రవాడ వెంగమాంబ పేరంటాల బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వెంగమాంబ, గురవయ్యనాయుడు కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, అధికారులు కల్యాణ వేదికపై ఆసీనులయ్యారు. తొలుత వెంగమాంబ ఉత్సవ మూర్తులను, ముత్యాల తలంబ్రాలను, ఆలయ ధర్మకర్తలు, అర్చకులు ప్రధాన ఆలయం నుంచి కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. వెంగమాంబ, గురవయ్యనాయుడులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఆలయ అర్చకులు పట్టువస్త్రాలను సమర్పించారు.


వెంగమాంబ దంపతులకు పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ఊరేగింపుగా పసుపు, కుంకుమ

ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి పసుపు, కుంకుమను ఊరేగింపుగా ఆలయం వద్దకు తరలించారు. స్వర్ణభారత్ ట్రస్టు చైర్మన్ దీపావెంకట్, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబరాన్నంటిన ప్రదానోత్సవం

వెంగమాంబ పేరంటాలు ప్రదానోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అమ్మవారి పుట్టినిల్లయిన వడ్డిపాళెం నుంచి ప్రదానోత్సవం ప్రారంభమై నర్రవాడ

- మిగతా 7వ పేజీలో

సిఫార్సు లేఖకు సొమ్ములు

- ఒక్కొక్కదానికి రూ. 25 వేల నుంచి రూ.40 వేల వరకు వసూళ్లు
- ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్‌లో అక్రమాలు
- యూనియన్ నేతల రెకమండేషన్లపై నిరసనలు


ఏఎన్‌ఎంల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, ఇతర అధికారులు

నెల్లూరు (వైద్యం) జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్‌లో ఎన్నో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. బుధవారం జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో పలు అక్రమాలు జరిగినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించగా, ఏఎన్‌ఎంలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఏకంగా ఉద్యోగ సంఘాల సిఫార్సు లేఖలను ఏఎన్‌ఎంలకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పలువురు ఏఎన్‌ఎంలు ఆందోళన వ్యక్తం చేశారు. తాము పని చేస్తున్న పీహెచ్‌సీలకు చాలా దూరంగా వెళ్లాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా లేఖలు

జిల్లా వ్యాప్తంగా 52 పీహెచ్‌సీలు ఉండగా, అందులో 134 మంది ఏఎన్‌ఎంలు బదిలీ కావాల్సిఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా యూనియన్ సిఫార్సు లేఖలను ఏఎన్‌ఎంలు బదిలీల దరఖాస్తులో జత చేసినట్లు విమర్శలు ఉన్నాయి. ఈ సిఫార్సు లేఖలకు ఒక్కొక్కరు రూ. 25వేల నుంచి రూ. 40 వేల వరకు సదరు యూనియన్ నేతలకు చెల్లించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే యూనియన్‌లో ఎలాంటి సభ్యత్వం లేక పోయినా , ఆఫీసు బ్యారర్లు అంటూ సిఫార్సు లేఖలు ఇవ్వటంపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్న చోటే ఏఎన్‌ఎంలు ఉండేందుకు, తాము పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రాలకు దగ్గరలోనే బదిలీ చేయించుకునేందుకు ఈ సిఫార్సు లేఖలు ఇచ్చినట్లు వైద్యఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిస్థితుల్లో చాలా మంది ఏఎఎన్‌లు బదిలీల జాబితాలో 50లోపు పేర్లు ఉన్నా, తుది జాబితాలో 100పైగా పేర్లు రావటంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా అయితే చాలా దూరంగా ఉన్న పీహెచ్‌సీలకు బదిలీ కావాల్సి వస్తుందని వారు ఆవేదన చెందుతున్నారు.

నెట్ పనిచేయక అవస్థలు

ఇదిలా ఉంటే జూమ్ ద్వారా బదిలీల కౌన్సెలింగ్ జరుగుతుండటంతో ఉదయగిరి, సీతారామపురం, రాపూరు తదితర ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు చాలా తక్కువగా ఉన్నాయి. దీంతో కౌన్సెలింగ్‌లో ఎక్కడ ఇబ్బందులు పడాల్సి వస్తుందనే ఉద్దేశ్యంతో నెట్‌వర్క్ సక్రమంగా ఉన్న ప్రాంతాలకు చేరకున్నారు. మరికొందరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయా ఆరోగ్య కేంద్రాల ఏఎన్‌ఎంల రాకతో ఆయా ప్రాంగణాల్లో సందడి నెలకొంది. ఈ బదిలీల కౌన్సిలింగ్ రాత్రి 7 గంటల వరకు కొనసాగింది.

కాకాణి బెయిల్‌పై రేపు ఉత్తర్వు

నెల్లూరు (లీగల్), జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, అక్రమ మైనింగ్, పేలుడు పదార్థాల నిషేధ చట్టం కేసుల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ మంత్రి కాకాణి బెయిల్‌పై బుధవారం ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణ జరిగింది. కోర్టు ప్రత్యేక న్యాయాధికారి ఎన్. సరస్వతి బెయిల్‌పై ఉత్తర్వు నిమిత్తం కేసును శుక్రవారానికి వాయిదా వేశారు. కాగా అక్రమంగా గ్రావెల్ తరలింపు అభియోగాలపై సీబీసీఐడీ అధికారులు మాజీ మంత్రి కాకాణిపై పెట్టిన కేసులో పీటీ వారెంట్ కింద అరెస్ట్ చేసి, నెల్లూరు రెండవ అదనపు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో బుధవారం హాజరు పరిచారు. న్యాయాధికారి ఎల్. శైలజారెడ్డి జూలై 2 వరకు ఆయన్ను జ్యుడీషియల్ రిమాండ్‌కు ఆదేశించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	238

కోడిగుడ్ల ధర (100): 515

నిరుపేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు వెళ్లేందుకు బస్‌సౌకర్యం లేక ఇబ్బందిపడుతున్న 17మంది నిరుపేద విద్యార్థినులకు వరల్డ్‌విజన్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సైకిళ్లు పంపిణీ చేశారు. స్థానిక డివిజన్ విద్యాశాఖ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ నరసింహారావు, ఎంఈఓ సుబ్బారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె అనూషల చేతుల మీదుగా వీటిని పంపిణీచేశారు. కార్యక్రమంలో వరల్డ్‌విజన్ సంస్థ మేనేజరు యేసయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ వై పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బాలికలకు సైకిళ్లు అందజేస్తున్న డిప్యూటీ డీఈవో

సెంట్రల్ డివైడర్‌లో మొక్కలకు రక్షణేదీ..?

● విరిగి మొక్కలపై పడిపోతున్న సేఫ్టీ గ్రిల్స్ ● పట్టించుకోని అధికారులు

కావలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డు సెంట్రల్ డివైడర్‌లో పచ్చదనం, పర్యావరణం కోసం పెంచుతున్న మొక్కలకు రక్షణ కరువవుతోంది. డివైడర్‌లో కొంతభాగం ఎత్తు తక్కువగా ఉన్న ప్రాంతంలో డివైడర్‌కు రెండు వైపులా మొక్కల రక్షణ కోసం గ్రిల్స్ ఏర్పాటు చేశారు. అయితే మొక్కలకు నీరు పట్టినపుడు అవి తడిచి తుప్పు పట్టి విరిగి పడిపోతున్నాయి. అయితే విరిగిపోతున్న గ్రిల్స్‌కు వెల్డింగ్ చేసి సరిచేయకపోవడంతో అవి మొక్కల మీద పడి మొక్కలు పాడైపోతున్నాయి. గ్రిల్స్ విరిగిన చోట మొక్కలకు పశువుల నుంచి రక్షణ కరువైంది. ఒక పక్క గ్రిల్స్ విరిగి పాడై పోవటమే కాక వాటిని దొంగలు తరలించుకుని పోతుండటంతో మున్సిపల్ ఆస్తులకు రక్షణ కరువవుతోంది. మరో పక్క మొక్కల ఆలనా పాలనా కరువై అవి పూర్తిగా ఎండిపోతున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. పచ్చదనం కోసం ఏర్పాటుచేసిన సెంట్రల్ డివైడర్ ఫ్లెక్సీలు కట్టుకోవటానికే పరిమితమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి సెంట్రల్ డివైడర్‌లో విరిగిపోయిన గ్రిల్స్‌ను పునరుద్ధరించి మొక్కలకు రక్షణగా ఉంచి డివైడర్‌పై మొక్కలను రక్షించి పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రంకు రోడ్డు సెంట్రల్ డివైడర్‌లో మొక్కలపై పడిఉన్న సేఫ్టీ గ్రిల్స్

న్యూస్ బాక్స్

బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవు


ఉపాధి పనుల్లో శ్రామికుల మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీవో

లింగసముద్రం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పనుల్లో బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఆ పథకం ఏపీఓ దయాసాగర్ హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని పెద పవని గ్రామంలో జరుగుతున్న చెరువు, కాలువల పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శ్రామికుల మస్టర్లను తనిఖీ చేశారు. ఒకరి బదులు మరొకరు పనులకు రావద్దని చెప్పారు. అలాగే ఉదయం 6 గంటలకు పనులకు వచ్చి 10 గంటల వరకు పనులు చేసి ప్రభుత్వం నిర్దేశించిన కూలీ డబ్బులు వచ్చేలా పనులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఏ మహేంద్ర, ఎఫ్ఏ డి మధు ఉన్నారు.

తహసీల్దారుకు సన్మానం


తహసీల్దారు శ్రీనివాసులురెడ్డిని సన్మానిస్తున్న సిబ్బంది

బిట్రగుంట, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల తహసీల్దారుగా సానా శ్రీనివాసులురెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు తహసీల్దారుగా పనిచేస్తున్న సురేష్‌బాబు కొండాపురానికి బదిలీ కావడంతో ఆ స్థానంలో శ్రీనివాసులురెడ్డి నియమితులయ్యారు. డిప్యూటీ తహసీల్దారు భరత్‌కుమార్, ఆర్ఐ రామ్‌కుమారి, వీఆర్వోలు, మండల సర్వేయరు వెంకటేశ్వర్లు, జూనియర్ సర్వేయర్లు తహసీల్దారుకు స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు.

పందుల స్వైర విహారం

● బెంబేలెత్తుతున్న ప్రజలు


అల్లూరులో సంచరిస్తున్న పందులు

అల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పందుల స్వైర విహారంతో అల్లూరు వాసులు బెంబేలెత్తిపోతున్నారు. వందల సంఖ్యలో పందులు సంచరిస్తున్నాయి. ఎప్పుడు ఎవరిమీద దాడులు చేస్తాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. పాఠశాలల పునఃప్రారంభం కావడంతో చిన్నారులకు వీటివల్ల ఏదైనా ప్రమాదం వాటిల్లితే ఎవరు జవాబుదారీ అంటూ తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉండాల్సిన పందులు గ్రామంలోనే విచ్చలవిడిగా తిరుగుతుంటే పట్టించుకునే నాథుడే కరువయ్యాడని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వీటి యజమానులు మాత్రం తమకేమీ పట్టనట్టు దూరంగా ఉండి చూసుకొని వెళ్తా ఉంటారు. ఇప్పటికైనా పందులను గ్రామానికి దూరంగా ఉండేలా కఠిన చర్యలు తీసుకొని ప్రమాదాలు సంభవించకుండా చేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

నర్రవాడకు ఉచిత బస్సు సౌకర్యం



బస్సులను ప్రారంభిస్తున్న ఎస్ఐ ఉమాశంకర్

కలిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన నర్రవాడకు తమ బస్సుల ద్వారా భక్తులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పిస్తున్నట్లు హరికృష్ణ ట్రావెల్స్ అధినేత పాపన హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం గ్రామానికి చెందిన హరికృష్ణ స్థానికుడవడంతో ఈప్రాంత వాసులకు కావలి నుంచి నాలుగు, అదేవిధంగా గుంటూరు జిల్లా మాచర్ల నుంచి మరో నాలుగు బస్సులను ఉచితంగా వెంగమాంబ దేవస్థానం వరకు భక్తుల సౌకర్యార్థం నడుపుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఎస్ఐ ఉమాశంకర్ బస్సులను ప్రారంభించారు. భక్తులు ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఇంటర్ ఆన్సర్ షీట్స్ ట్యాంపరింగ్ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరపాలి

● శ్రీ గాయత్రీ కళాశాల యాజమాన్యం డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీగాయత్రీ విద్యాసంస్థల కరస్పాండెంట్, డైరెక్టర్

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కందుకూరులో ఆన్సర్ షీట్స్ ట్యాంపరింగ్ వ్యవహారంపై విజిలెన్స్ విచారణ జరపాలని శ్రీగాయత్రీ విద్యాసంస్థల ఛైర్మన్ సీహెచ్ రామకృష్ణారావు, డైరెక్టర్ భరద్వాజ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ కళాశాలలోని మెరిట్ విద్యార్థులను దెబ్బతీసేందుకు శ్రీ వివేకా జూనియర్ కళాశాల యాజమాన్యం కుటిల యత్నాలు చేసిందని విచారణలో నిగ్గుతేలినప్పటికీ ఇంటర్ బోర్డు అధికారులు నామమాత్రపు చర్యలతో సమస్యను రూపుమాపే ప్రయత్నం చేస్తున్నదని వారు ఆందోళన వ్యక్తంచేశారు. బోర్డు ఉన్నతాధికారులు జరిపిన విచారణలో నివ్వెరపోయే నిజాలు వెలుగుచూశాయని, బోర్డు అనుమతిలేని ఓ షెడ్డులో బాధిత విద్యార్థులు పరీక్షలు రాసిన వైనం బయటపడిందని తెలిపారు. ట్యాంపరింగ్ వ్యవహారానికి కీలకంగా ఎగ్జామినేషన్ సెంటర్‌లో అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్‌గా ఆ కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు విధినిర్వహణ చేయాల్సి ఉండగా కాలేజీ యాజమాన్యం దుర్బుద్ధితో ఏమాత్రం అర్హతలేని షాహుల్‌హమీద్ అనే ప్రైవేటు వ్యక్తిని ఆస్థానంలో నియమించి ట్యాంపరింగ్ వ్యవహారానికి తెరలేపిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి శ్రీవివేకా కళాశాలపై క్రిమినల్ కేసు నమోదుచేయటంతో పాటు మొత్తం వ్యవహారాన్ని నిగ్గుతేల్చేందుకు విజిలెన్స్ విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు.

శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకును కూల్చివేయండి

● మున్సిపల్ కమిషనర్‌కు గ్రామస్థుల మొర


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న చౌదరిపాలెం వాసులు

కావలి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పరిధిలో ఉన్న చౌదరిపాలెం గ్రామంలోని వాటర్ ట్యాంకుతో ప్రమాదం పొంచి ఉందని వెంటనే దానిని కూల్చివేయాలని ఆ గ్రామస్థులు బుధవారం కావలి మున్సిపల్ కమిషనర్ జీ శ్రావణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. సుమారు 50 సంవత్సరాల కిందట నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థలో ఉందని, పశువులు వెళ్లి వాటర్ ట్యాంకు పిల్లర్లను రుద్దినా అది పడిపోయే పరిస్థితిలో ఉందని, అధికారులు ముందుగానే దానిని కూల్చి వేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్థులు కోరారు.

వేతనానికి తగ్గట్లుగా పనిచేయాలి - ఏపీఓ



కళవళ్లలో ఉపాధి హామీ పనుల వద్ద మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీవో దయాసాగర్

వలేటివారిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వేతనానికి తగినట్లుగా పనిచేయించాలని ఏపీఓ దయాసాగర్ తెలిపారు. మండలంలోని కళవళ్లలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం ఏపీఓ దయాసాగర్ పరిశీలించారు. మస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ కొలతల ప్రకారమే వేతనాలు లభిస్తాయని, కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యాలను శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

ప్రజాసమస్యలు సత్వరం పరిష్కరించాలి : సబ్ కలెక్టర్


ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్న సబ్ కలెక్టర్

లింగసముద్రం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో జరిగిన ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవిఆర్ఎస్ సర్వేలో అర్జీల పరిష్కారంలో మండల అధికారుల పనితీరు చాలా వెనుకబడి ఉందన్నారు. వీఆర్ఓలు, తహసీల్దార్ భూసమస్యలపై అర్జీలు వచ్చినప్పుడు ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అనంతరం రికార్డులు పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా సమస్యను పరిష్కరించాలన్నారు. ఎక్కువగా గయాళు, గ్రామ కంఠం భూములపై అర్జీలు వచ్చినప్పుడు మాత్రమే సమస్యలు పరిష్కారం కావడం లేదని తన దృష్టికి వచ్చిందని, అధికారులు తప్పని సరిగా సమస్యలపై అవగాహన పెంచుకొని అర్జీదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈసందర్భంగా యర్రారెడ్డిపాలెం, పెంట్రాల గ్రామాలలోని పంచాయతీ గ్రేజింగ్ భూములలో ఇంటి స్థలాలు ఇప్పించాలని ఆయా గ్రామస్థులు కోరారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, పింఛన్లు తదితర సమస్యలపై ప్రజలు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్ సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, ఎస్ఐ ఎం నారాయణ, ఆర్ఐ ఎం రమణయ్య, వీఆర్ఓలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలి

● సీఐటీయూ ధర్నా



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కావలిటౌన్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగించాలని సీఐటీయు జిల్లా నాయకుడు వై కృష్ణమోహన్ కోరారు. మున్సిపల్ కార్మికులకు ప్రభుత్వ పథకాల్లో కోత పెట్టడాన్ని నిరసిస్తూ బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. కృష్ణమోహన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చాలీచాలని జీతాలతో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగులుగా చూపించి వీరి పిల్లలకు తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాల్లో కోత పెట్టడం అన్యాయమన్నారు. రూ. 25వేల లోపు జీతాలున్న కార్మికులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పథకాల్లో కోత పెట్టడం అన్యాయమని, కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగించి చంద్రబాబు మాట నిలబెట్టుకోవాలన్నారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు బాబు, శీనయ్య, పోలయ్య, బీ మహేష్, పల్లెపాటి అనిత, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణ పనులు వేగవంతం చేయాలి

● హౌసింగ్ డిప్యూటీ ఈఈ


కాకర్లవారిపాలెంలో ఎస్టీల గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డిప్యూటీ ఈఈ

వలేటివారిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీల గృహ నిర్మాణాలకు ప్రభుత్వం అదనంగా చెల్లించనున్న రూ. 70 వేలతో గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని హౌసింగ్ డిప్యూటీ ఈఈ పి.వి నారాయణ తెలిపారు. మండలంలోని కాకర్లవారిపాలెంలోని ఎస్టీ గృహనిర్మాణాలను బుధవారం హౌసింగ్ డిప్యూటీ ఈఈ నారాయణ పరిశీలించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అదనంగా చెల్లించనున్న రూ 70 వేలలో ఇప్పటికే రూ 22500 చెల్లించినట్లు చెప్పారు. గృహ నిర్మాణాలకు పెరిగిన ఖర్చులను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఎస్టీలకు రూ. 70 వేలు, ఎస్సీ, బీసీలకు రూ 50 వేలు అదనంగా చెల్లిస్తునట్లు తెలిపారు. ఎస్టీ, ఎస్సీ బీసీల గృహ నిర్మాణ లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని గృహ నిర్మాణ పనులను త్వరితగతిన నిర్మించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రదేవ్, హౌసింగ్ ఏఈ నాగరాజు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

రైతులకు 80 శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్లు


కందుకూరు: సమావేశంలో మాట్లాడుతున్నఏవో

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రైతులకు 80శాతం రాయితీపై వ్యవసాయ డ్రోన్లు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నందున సద్వినియోగం చేసుకోవాలని ఏఓ అబ్దుల్‌రహీం కోరారు. మండలంలోని ఓగూరులో బుధవారం పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లా డుతూ ఐదుగురు రైతులు ఒక గ్రూపుగా ఏర్పడి 80శాతం రాయితీపై డ్రోన్ పొంద వచ్చన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏ పి అనసూయ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ ఈకేవైసీ ఎక్కడైనా చేయించుకోవచ్చునని తెలిపారు. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీపై పొంద దలచుకున్న రైతులు సమీప రైతుసేవా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వీఏఏ శరత్, గ్రామనాయకులు అల్లం రాధయ్య, పచ్చవ తిరుపతిస్వామి పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

వలేటివారిపాలెం: పంటల సాగుకు ముందు విత్తనశుద్ధి తప్పనిసరి అని ఏఓ శేషారెడ్డి తెలిపారు. మండలంలోని పోలినేని పాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఏఓ శేషారెడ్డి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధి వలన పంటలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు సురేష్, నాగరాజు, రవీంద్ర, రైతులు తదితరులు పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్ర’పై విజిలెన్స్ అధికారుల విచారణ

లింగసముద్రం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2023వ సంవత్సరంలో జరిగిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై నెల్లూరు విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. ఈమేరకు బుధవారం నెల్లూరు విజిలెన్స్ సీఐ శ్రీహరి ఆధ్వర్యంలో అధికారుల బృందం లింగసముద్రం లోని ఎంపీడీఓ కార్యాలయంలో పలువురు పంచాయతీ కార్యదర్శులను విచారించారు. ఆ ఏడాదిలో ఏయే పంచాయతీలలో ఆడుదాం ఆంధ్రలో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించారు, ఎంతమంది క్రీడాకారులు పోటీలలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు, ఎంతమంది క్రీడాకారులు పాల్గొన్నారు, పంచాయతీలలో ఏయే చోట్ల పోటీలు నిర్వహించారు, పంచాయతీల నుంచి మండల స్థాయి పోటీలకు ఎంతమంది వెళ్లారు, ఈ పోటీలకు వచ్చిన క్రీడా పరికరాలు తదితర వివరాలను ఆయా పంచాయతీ కార్యదర్శులను అడిగి రాతపూర్వకంగా తీసుకున్నారు. అలాగే ఈ పోటీలకు ఎంత మొత్తం నిధులు మంజూ రయ్యాయి, ఏమేరకు ఖర్చయ్యాయి, వాటి రశీదులు తదితర వివరాల గురించి ఆరా తీసి వాటిని వారి నుంచి తీసుకున్నారు. అలాగే కొందరి నుంచి బ్యాంకు స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు తెలిసింది. మిగిలిన వారు ఒకటి రెండు రోజుల్లో పంపనున్నట్టు సమాచారం.

అడ్మిషన్ల ప్రక్రియలో జాప్యంతో ప్రభుత్వ కాలేజీలకు నష్టం

● డాక్టరు ఎం. రవికుమార్, ప్రిన్సిపాల్, టీఆర్ఆర్ కళాశాల



కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న జాప్యం కారణంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు నష్టం జరుగుతోందని, విద్యార్థినీ, విద్యార్థులు ముందు ప్రారంభమవుతున్న ప్రైవేటు కాలేజీల్లో చేరిపోతున్నారని కందుకూరు టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ ఏడాది కళాశాలలో కొత్తకోర్సు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ముఖాముఖి

? టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుంది

! అడ్మిషన్ల ప్రక్రియపై ఇంకా స్పష్టత రాలేదు. జూలై 15నుంచి ప్రారంభిస్తామని ఉన్నతాధికారులు మౌఖికంగా తెలిపారు తప్ప ఇప్పటివరకు స్పష్టత లేదు.

? ప్రైవేటు కళాశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి కదా.

! తరగతులు కూడా ప్రారంభించారు.

? మొత్తం ఎన్నిసీట్లు ఉన్నాయి

! ఈ ఏడాది 367 సీట్లు ప్రపోజ్ చేశాం. ఉపాధి కల్పన గ్యారంటీతో ఈ ఏడాది కొత్త కోర్సును కళాశాలలో ప్రారంభిస్తున్నాం. సెక్టార్‌స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా బ్యాంకింగ్ ఫైనాన్స్ సెక్టార్ అండ్ ఇన్సూరెన్స్ కోర్సు

వ్యభిచార గృహంపై దాడి

● నలుగురి అరెస్టు

కందుకూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్ధనకాలనీ వాటర్‌ట్యాంకు సమీపంలోని ఓ నివాసంలో నిర్వహిస్తున్న వ్యభిచార గృహంపై దాడిచేసి నలుగురిని అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు మహిళలు, ఒక విటుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని తెలిపారు.

సర్వీసు రోడ్లు లేక వాహనదారుల అవస్థలు


కావలి-దుత్తలూరు మార్గంలో గ్రామాలవద్ద ఏర్పాటు చేసినడ్రమ్ములు

కలిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కావలి నుంచి దుత్తలూరు మీదుగా సీతారామపురం జాతీయ రహదారి పనులు పూర్తి కావస్తున్నా సర్వీసు రోడ్ల నిర్మాణం లేకపోవడం ఈమార్గంలో ప్రయాణం చేసేవారు ఇబ్బందులకు గురవుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన 167బీజీ జాతీయ రహదారి పనులు ప్రస్తుతం ఒక రూపు దాల్చాయి. జలదంకి, కలిగిరి పట్టణాల వద్ద అసంపూర్తిగా ఉన్న రహదారి పనులు జరుగుతున్నాయి. రహదారి పనులు నిర్మాణం పూర్తి కావస్తున్నా గ్రామాల సమీపంలో సర్వీసు రోడ్ల నిర్మాణాలను మొదలు పెట్టకపోవడంతో వాహనదారులతోపాటు, ఆయా గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 9వ మైలు, అయ్యపరెడ్డిపాలెం, పెదకొం డూరు, పోలంపాడు, నాగిరెడ్డిపాలెం సెంటర్ తదితర గ్రామాల వద్ద రోడ్లపైనే ఇళ్ళు, దుకాణాలు ఉండటంతో స్థానికులు నిత్యం వివిధ పనులపై రహదారి దాటవలసి వస్తుంది. జాతీయ రహదారి కావడంతో ఈ మార్గాల్లో వెళ్ళే వాహనాలు వేగంగా వెళ్ళే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశముంది. హెచ్చరికలు, సూచికల బోర్డులు ఏర్పాటు చేయకుండా డ్రమ్ములకు తెలుపురంగు పెయింట్, రెడ్‌స్టిక్కర్లు అతికించి గ్రామాల వద్ద రహదారులపై ఏర్పాటు చేశారు. తాత్కాలిక పద్ధతులతో ప్రమాదాలను నివారించలేమని, గ్రామాల సమీపంలో సర్వీసురోడ్లు నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

పశువులకు సోకే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


ఎంతోటి చెన్నకేశవులు

వలేటివారిపాలెం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చేసింది. తొలకరి వర్షాలు సమయంలో జీవాలకు వ్యాధులు సోకే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎంతోటి చెన్న కేశవులు పశుపోషకులకు సూచించారు. వర్షాకాలంలో పశువులపై వ్యాధులు దాడి చేస్తాయంటున్నారు. జాగ్రత్తలు పాటిస్తే వ్యాధుల బారి నుంచి పశువులను, జీవాలను కాపాడుకోవచ్చునని అన్నారు. రోగాలు వచ్చినట్లు గుర్తించగానే సంచార పశువైద్యశాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 1962కు సమచారం అందించాలని చెప్తున్నారు. వలేటివారి పాలెం మండలంలోని 15 రైతు బరోసా కేంద్రాల పరిదిలో 460 ఆవులు, ఎద్దులు, 14692 గేదెలు, 7063 మేకలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

వర్షాకాలంలో వచ్చే వ్యాధులు ఇవే..

వర్షాకాలంలో గుదిపెట్టు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. దీంతో గొర్రెలు, మేకలు జ్వరం నీరసంలో మేత మేయవు. గొర్రెలు అప్పటికప్పుడే చనిపోతాయి. తొలకరి వర్షాలకు 10 నుంచి 15 రోజులు ముందుగానే వ్యాక్సిన్ వేయించాలి.

పశవులకు గొంత వాపు వ్యాధితో ముప్పు ఉంటుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులు కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి సొంగ కారడం, శ్వాస పీల్చడానికి ఇబ్బంది పడతాయి. గొంతు కిందకు నీరు దిగి గొంత వాపు వస్తుంది. జూన్, జూలై నెలలో (హెచ్ఎస్) టీకా వేయించుకోవాలి.

కమనీయం.. వెంగమాంబ కల్యాణం

(5వ పేజీ తరువాయి)

వీధుల గుండా సాగింది. భజనలు, బైనడీల నృత్యాలతో అంగరంగ వైభవంగా ప్రదానోత్సవం చేపట్టారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

● పోటెత్తిన జనం

బుధవారం జరిగిన వెంగమాంబ కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు.అగ్నిగుండంలో కొబ్బరి వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు కానుకలు సమర్పించుకొని మొక్కులు తీర్చుకొన్నారు.

● నేడు పొంగళ్లు

వెంగమాంబ తిరునాళ్ల చివరి రోజైన గురువారం ఉదయం పొంగళ్లు, బండ్ల తిరుగుట, సాయంత్రం బండలాగుడు పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు లక్షలాదిమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. దీంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు.


వడ్డిపాళెం నుంచి ఊరేగింపుగా పసుపు, కుంకుమ తీసుకొస్తున్న భక్తులు

క్యాంపస్ ఉద్యోగాలకు ఐటీఐ విద్యార్థుల ఎంపిక



నియామక పత్రాలు అందుకున్న కళాశాల విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల విద్యార్థులు పలువురు క్యాంపస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ కే.ఏడుకొండలు తెలిపారు. కళాశాలలో బుధవారం జరిగిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో బాలికల ఐటీఐతోపాటు సంగం, ఏఎస్‌పేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలల నుంచి మొత్తం 160 మంది పాల్గొన్నారని ఆయన వివరించారు. శ్రీసిటీకి చెందిన బ్లూస్టార్, నాయుడుపేట సెజ్‌కు చెందిన గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, శ్రీకాళహస్తికి చెందిన ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్ కంపెనీ, బెంగళూరుకు చెందిన యామ్‌ఫినోల్ కంపెనీలు డ్రైవ్ నిర్వహించి అర్హత, ప్రతిభ కలిగిన 132 మంది విద్యార్థులను వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆమంచర్ల కత్తి.. రైతులకు భలే ఆసక్తి!

● 50 గ్రామాలకు వ్యవసాయ పనిముట్లు ఇక్కడే తయారీ ● 'కనరాతి' కుటుంబానికి 120 ఏళ్లుగా ఇదే జీవనాధారం

● పొరుగు జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాలకూ ఎగుమతి



అబ్బో.. ఎన్ని రకాల కత్తులో!

నెల్లూరు-పొదలకూరు మార్గంలోని ఆమంచర్ల గ్రామం రాగానే ప్రతి ప్రయాణికుడికి గుర్తుకువచ్చేది ఇక్కడ తయారయ్యే కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు ఇతర వ్యవసాయ పనిముట్లు. ఈ గ్రామంలోని 'కనరాతి'కి చెందిన ఎనిమిది కుటుంబాలు సుమారుగా 120 ఏళ్లుగా కొలిమి వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాయి. పూర్వీకుల ఆస్తిగా భావిస్తున్న ఆ కుటుంబ వారసులు కొలిమిని వీడకుండా అనేక వర్గాలవారికి అవసరమైన ఇనుప పనిముట్లను తయారు చేసి ఇస్తున్నారు. వరి కోతలకు వినియోగించే కొడవళ్లు, చెట్లు, మొద్దులు నరికే గొడ్డళ్లు, గీత కార్మికులు వాడే గీతకత్తులు, ఊరిచాకళ్లు వాడే సూరికత్తులు, ఎడ్ల బండి చక్రాలకు ఉపయోగించూ పట్టాలు, గిరిజనులు బతుకుదెరువు కోసం కంపచెట్లు, తాటాకులను కొట్టే మొద్దుకత్తులు, బుట్టల తయారీలో వాడే అల్లెకత్తులు, మాంసపు దుకాణాల్లో ఉపయోగించే కత్తులు ఇలా అనేక వర్గాలు ఉపయోగించే ఏ ఇనుప వస్తువు అయినా ఆమంచర్ల కొలిమిలో తయారు కావాల్సిందే. ఆమంచర్లకు చుట్టూ ఉన్న సుమారు 50 గ్రామాలకు చెందిన అనేకమంది ఇక్కడ నుంచే తమకు కావాల్సిన వస్తువులను ఆర్డర్లు ఇచ్చి మరీ చేయించుకెళ్తుంటారు. కత్తుల రకాన్ని బట్టి ఒక్కో కత్తిని రూ.350 నుంచి రూ. 1,500 వరకు విక్రయిస్తుంటారు.

● **పొరుగు ప్రాంతాలకు ఎగుమతి**

ఆమంచర్లలోని కొలిమిలో తయారయ్యే ఇనుప వస్తువుకు స్థానికంగానే కాకుండా పొరుగు ప్రాంతాల్లోనూ మంచి గిరాకీ ఉంది. కడప, ప్రకాశం, తిరుపతి జిల్లాలతోపాటు తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, కర్ణాటకలోని బెంగళూరు, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన రైతులు, ఇతర వృత్తిదారులు ఇక్కడకు వచ్చి తమకు అవసరమైన ఇనుప వస్తువులను తయారు చేయించుకెళ్లడం విశేషం. నెల్లూరులోని ఆటోనగర్, రంగనాయకులపేట, విజయవాడ నుంచి ముడిసరుకు దిగుమతి చేసుకుని ఇనుప వస్తువులు తయారు చేయడం వీరి ప్రత్యేకత. ఇక్కడ కిలో ఇనుమును రూ.100 నుంచి రూ. 400 లకు కొనుగోలు చేస్తారు. అక్కంపేట, రాపూరు, పంగిలి, ఓట్లపాళెం ప్రాంతాల నుంచి ఆమంచర్లలోని కొలిమి వద్దకు కూలీ పనులకు వచ్చి సమ్మెటకొట్టి రోజువారి రూ.800 సంపాదించుకు వెళ్లడం గమనార్హం.

● **యంత్ర ప్రవేశంతో తగ్గిన గిరాకీ**

అనేక రంగాలలో యంత్రాల ప్రవేశంతో తమకు గిరాకీ తగ్గిందని నిర్వహకులు వాపోతున్నారు. ప్రధానంగా వరికోత యంత్రాలు రావడం వల్ల వ్యవసాయ కూలీలకు పని తగ్గడంతో పాటు పైరును కోసే కొడవళ్ల తయారీ పూర్తిగా నిలిచిపోయింది. చెట్లను కొట్టేందుకు కూడా యంత్రాలు వచ్చేయడంతో గొడ్డళ్లకు పనిలేకుండా పోయింది. ఇక గ్రామాల్లో ఎడ్ల బండ్లు మనసీయంగా తగ్గడంతో వాటి చక్రాలకు వాడే పట్టాల తయారీ పూర్తిగా నిలిచిపోయింది. ప్రస్తుతానికి మొద్దుకత్తులు, బుట్టఅల్లె కత్తులు, కల్లు గీత కత్తులు,





మాంసపు దుకాణ కత్తులే తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు.

● **చేయూత కోసం ఎదురుచూపు**

కొలిమి వృత్తినే నమ్ముకుని తమ జీవితాలను మాడి, మసి చేసుకుంటున్నా ప్రభుత్వాల నుంచి నేటికీ ఒక రూపాయి సహాయం కూడా అందలేదని ఆ వృత్తిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అన్నీ వృత్తిదారులకు వారి అవసరాలకు తగ్గట్టుగా పనిముట్లను తయారు చేసి ఇస్తున్నా తాము మాత్రం సర్కారు వైపు నుంచి చేయూతను కోల్పోతున్నామని వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

వదులుకోలేక..



మా తాతల కాలం నుంచి ఈ వృత్తిలో మగ్గిపోతున్నాం. మాకు మరో పని తెలియదు. తెలిసినా వెళ్లలేం. తరతరాలుగా వస్తున్న ఈ వృత్తినే ఆస్తిగా భావించి వారసులకు అందించి ముందుకు నెట్టుకొస్తున్నాం. వారసత్వంగా వస్తున్న పనిని దులుకోలేకనే ఇందులోనే ఉండిపోతున్నాం.

- కనరాతి రవి

నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తాం



చిన్నప్పుడు నుంచి మాకు తెలిసిన పని ఇదొక్కటే. బయటకు వెళ్లి మరో పని చేయలేక ఇక్కడే బాధలుపడుతున్నాం. మా దగ్గర తయారు చేసే ఇనుప వస్తువుకు పొరుగు ప్రాంతాలలో మంచి గుర్తింపు ఉంది. ఎక్కడెక్కడి నుంచో వచ్చే వస్తువు చేయించుకుని వెళ్తుంటారు. మేము నాణ్యతకు మొదట ప్రాధాన్యం ఇస్తాం.

- సిందు వెంకయ్య

పాలకులు ఆదుకోవాలి!



ప్రభుత్వాలు వస్తున్నాయి పోతున్నాయి కానీ మా తలరాతలు మాత్రం మారడంలేదు. ఇప్పటి వరకు సర్కారు నుంచి రూపాయి సహాయం పొందలేదు. ఎవరెవరికో పథకాలు పెడుతున్నారు కానీ కొలిమి వృత్తిలోనే కుమిలిపోతున్న మాకు మాత్రం ఒక్క పథకం కూడా లేదు.

- కనరాతి పెంచలయ్య

'కనుపూరు'లో దోపిడీ రూ.30 కోట్లు

(5వ పేజీ తరువాయి)

ఎక్కువ ధరకు విక్రయించారు. ఒక టిప్పర్ 15 క్యూబిక్ మీటర్ల మట్టిని తీసుకెళుతుండగా, ఆ టిప్పర్ విలువ రూ.8 వేలకు పైగా పలికింది. ఇక్కడా ఒక టిప్పర్ రవాణా చార్జీలు పోను రూ.2 వేల వరకూ మిగుల్చుకున్నారు. ఇలా రూ.కోట్ల ప్రజాధనాన్ని అక్రమార్కులు జేబుల్లో వేసుకున్నారు. నిబంధనల ప్రకారం మీటర్ లోతుకు మించి తవ్వకూడదు. కానీ కనుపూరు చెరువులో పది మీటర్ల లోతుకు పైగా తవ్వి చెరువును గుల్ల చేశారు.

● **కాకాణి కోసం పీటీ వారెంట్**

వెంకటాచలం పోలీసు స్టేషన్‌లో ఈనెల 7న కనుపూరు చెరువులో అక్రమ మట్టి తవ్వకాలపై సాగునీటి సంఘం అధ్యక్షుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. 379, 409, 465, 467, 471, 506, 109, 120(బీ) రెడ్‌విత్34 ఐపీసీ, 21(1), 21(4) ఎంఎండీఏఆర్ఐ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వీటిలో నాన్ బెయిలబుల్ సెక్షన్లు ఉన్నాయి. ఈ కేసు విచారణ చాలా వరకూ పూర్తి కాగా, అనేక మందిని విచారించారు. నాడు మట్టిని రవాణా చేసిన టిప్పర్ల యజమానులను పిలిచి స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఇరిగేషన్ అధికారులను విచారించారు. ఈ నేపథ్యంలో తదుపరి ఏ1గా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని విచారించేందుకు పోలీసులు కోర్టులో బుధవారం పీటీ వారెంట్ వేశారు. ఈ నెల 28లోపు దీనిపై కోర్టు విచారించనుంది. కాగా ఈ కేసుతో సంబంధం ఉన్న పలువురు వైసీపీ నేతలు పరారీలో ఉన్నారు. వారు విచారణకు హాజరుకాకపోతుండడంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కేంద్ర బృందం 'ఉపాధి' పనుల పరిశీలన



ఇంకుడుగుంతను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

ఉదయగిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలు చేసిన పనులను బుధవారం కేంద్ర జల కమీషన్ బృంద సభ్యులు ప్రదీప్‌కుమార్, రామకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మండలంలోని బండగానిపల్లి పంచాయతీలో చెక్‌డ్యాంల్లో కూలీలు చేసిన పూడికతీత పనులను పరిశీలించారు. అలాగే ఉదయగిరి పట్టణంలోని యాదవపాళెం, ఎస్టీ కాలనీల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలను పరిశీలించారు. చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు రమణ, ప్రసన్న, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ. 2 లక్షల విరాళం



ఆర్థిక సాయం అందిస్తున్న దాత భరత్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు (వైద్యం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి దాతలు రూ.2 లక్షల విరాళం అందించారు. బుధవారం దొడ్ల భరత్‌కుమార్‌రెడ్డి రూ.లక్ష, గంగా కన్యాకుమారి రూ.లక్ష సాయం అందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్ రెడ్డికి ఈ నగదును అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలకమండలి కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, కేన్సర్ ఆసుపత్రి కో కన్వీనర్ కమలేష్ జైన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నాగేశ్వరరావు, వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీ, రేడియేషన్ శాఖ హెచ్‌వోడీ డాక్టర్ గీత ఉషశ్రీ, క్యాన్సర్ ఆసుపత్రి జీఎం భక్తవత్సలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాలనీ బడికే పంపుతాం !

● కాదంటే పాఠశాలకు తాళం వేస్తాం..

● కేఆర్‌పురం అరుంధతీ కాలనీ వాసుల ఆందోళన

మనుబోలు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): తమ పిల్లలను కాలనీలో ఉండే పాఠశాలకు తప్ప మరే పాఠశాలకు పంపలేమంటూ మనుబోలులోని కేఆర్ పురం అరుంధతీ కాలనీ వాసులు స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి.... మనుబోలులో ఈ ఏడాది కొత్తగా రెండు ప్రభుత్వ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా మర్చారు. మనుబోలు మోడల్ స్కూల్‌లో పిల్లల సంఖ్య తక్కువగా ఉండడంతో మనుబోలు దళితవాడ, కేఆర్‌పురం గమళ్ళపాళెం, కేఆర్‌పురం అరుంధతీ వాడ పాఠశాలలను అందులో మ్యాపింగ్ చేశారు. అంటే ఈ పాఠశాలలోని 3,4,5 తరగతుల విద్యార్థులంతా ఈ మోడల్ స్కూల్‌కు రావాల్సి ఉంటుంది. మరో మోడల్ స్కూల్‌కు సరిపడా విద్యార్థులు ఉండడంతో బీసీ కాలనీ పాఠశాలను అందులో మ్యాపింగ్ చేయలేదు. అరుంధతీ వాడ పాఠశాలలో 3,4,5 తరగతుల విద్యార్థుల సంఖ్య 36 వరకు ఉంది. వారిని మోడల్ స్కూల్‌కు పంపేందుకు తల్లిదండ్రులు అంగీకరించడం లేదు. పిల్లలను బడులకు పంపాలని మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు వచ్చి బతిమాలినా కాలనీ వాసులు నిరాకరించారు. దీనిపై తల్లిదండ్రులు మాట్లాడుతూ కాలనీ నుంచి మోడల్ స్కూల్ కిలోమీటరు దూరం ఉందని, చిన్న పిల్లలు రోడ్డుదాటుకుని అంత దూరం ఎలా వెళతారని ప్రశ్నించారు. అధికారులు పిల్లల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మ్యాపింగ్ చేయాల్సింది పోయి, ఎక్కడకంటే అక్కడకు పొమ్మంటే ఎలాగని నిలదీశారు. తమ కాలనీలో 1, 2 తరగతుల పిల్లలు 25 మంది ఉన్నారని చెప్పారు. తమ అభ్యర్థనను అధికారులు పరిగణలోకి తీసుకోవాలని, లేకుంటే కాలనీలోని పాఠశాలకు తాళం వేస్తామని హెచ్చరించారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంఈవో లేకపోవడంతో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్‌కు సమస్యను వివరించారు.



ఆందోళన చేస్తున్న మనుబోలు అరుంధతీవాడ కాలనీవాసులు

ఇంటర్ విద్యార్థిని బలవన్మరణం

నెల్లూరు(క్రైం), జూన్18,(ఆంధ్రజ్యోతి) : హాస్టల్‌లో ఉండి చదువుకోవడం ఇష్టంలేని ఇంటర్ విద్యార్థిని చున్నీతో ఉరేసుకుని ఆత్మ హత్య చేసు కుంది. ఈ సంఘటన నగరంలోని బీవీనగర్‌లో గల ఓ ప్రైవేట్ కళాశాల లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం వివరాలు.. నగరంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సునీత, రమణయ్య దంపతులకు కుమార్తె సింధూజ (16)తోపాటు ఇద్దరు కుమారులున్నారు. ఈనెల 16న రమణయ్య తన కుమార్తెను బీవీనగర్‌లోని ఓ ప్రైవేట్ రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్ మొదట సంవత్సరం ఎంపీసీ గ్రూపులో చేర్పించారు. సింధూజ తాను హాస్టల్లో ఉండి చదువుకోవడం ఇష్టంలేదని చెప్పడంతో తల్లిదండ్రులు మంగళ వారం హాస్టల్ నుంచి ఇంటికి తీసుకువచ్చారు. కుమార్తెకు సర్ది చెప్పి బుధవారం మళ్లీ కళాశాలలో వదిలివెళ్లారు. ఈ క్రమంలో తోటి విద్యార్థినులంతా భోజనం చేసేందుకు వెళ్లగా సింధూజ తన గదిలోకి వెళ్లి లోపల గడేసుకుని సీలింగ్ ఫ్యానుకు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థినులు గది తలుపులు తీసేందుకు ప్రయత్నించగా రాలేదు. దీంతో వారు కళాశాల సిబ్బందికి తెలియచేశారు. వారు బలవంతంగా తలుపులు తెరచి చూడగా అప్పటికే సింధూజ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతుంది. మృతురాలి తండ్రి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

రేపు డీకేడబ్ల్యూ కళాశాలలో ఉద్యోగ మేళా

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని డీకేడబ్ల్యూ ప్రభుత్వ కళాశాలలో శుక్రవారం ఉగ్యోగ మేళా జరగనుంది. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈ మేళా నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీ గిరి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మేళాకు 21 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. జిల్లాలో పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, ఇంటర్, డ్రిగీ పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ, యువకులందరూ హాజరు కావచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలు naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, యువత దీనిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

22న జిల్లా బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

నెల్లూరు(విద్య), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-16 బాలుర జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ రాజశేఖర్‌రెడ్డి, కే శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2009 సెప్టెంబరు 1 తర్వాత జన్మించి ఉండాలని, సొంత క్రికెట్ కిట్, వైట్ డ్రస్‌తోపాటు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు.

రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుడ్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని తెట్టు సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు.. గ్రామస్థులు అందించిన వివరాల మేరకు... తెట్టు గ్రామానికి 100 మీటర్ల దూరంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదానికి గురై ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గమనించిన కొందరు గ్రామస్థులు గుడ్లూరు పోలీసులకు సమచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా నెల్లూరు నుంచి ఒంగోలు వైపు వెళ్లే గుర్తుతెలియని వాహనం ఆ వ్యక్తిని ఢీకొనడంతో మృతిచెంది ఉంటాడని పోలీసులు అభిప్రాయపడ్డారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాల లోపు ఉంటుందని, చొక్కా లేకపోగా లైట్ బ్లూకలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

కలిగిరి, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బస్‌స్టేషన్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. కావలి ఆర్టీసీ డిపోమేనేజర్ ఆర్ శ్రీనివాసులు, స్థానిక బీజేపీ నాయకులతో కలిసి కలిగిరిలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆర్టీసీని ఆదరించి సేవలు పొందాలని సూచించారు. అదేవిధంగా బస్‌స్టేషన్‌లో కార్గో సౌకర్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు లేక పడుతున్న ఇబ్బందులను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మండలి సభ్యుడు నందనవనం ప్రభాకరరావు, వాకా మాల్యాద్రి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు అగ్రతాంబూలం

● ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ చైర్మన్ జెడ్‌ఎస్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శివప్రసాద్

నెల్లూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : చట్ట సభలు, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు.... రంగం ఏదైనా కూటమి ప్రభుత్వంలో బీసీలదే అగ్రతాంబూలం అని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ జెడ్ శివప్రసాద్ అన్నారు. బుధవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన బీసీలకు స్వర్ణయుగంగా మారిందన్నారు. బీసీలపై దాడులు చేయాలంటే వణుకు పుట్టేలా బీసీ రక్షణ చట్టం రూపుదిద్దుకుంటోందని చెప్పారు. 2025-26 సంవత్సరంలో బీసీలకు రూ.47,457 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. గత ప్రభుత్వం బీసీ కార్పొరేషన్లకు నిధులు నిలిపేసిందని, సబ్సిడీ రుణాలు రద్దు చేసి బీసీలకు అన్యాయం చేసిందని విమర్శించారు. నేడు బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం వచ్చిందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు పీ ఎల్‌రావు, కొండూరు పాలిశెట్టి, పీ. ప్రదీప్, ఉప్పు భాస్కర్, కే. విజయమ్మ పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై నేటి నుంచి స్క్రీనింగ్

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత



స్క్రీనింగ్ పోస్టర్లు విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, అధికారులు

నెల్లూరు (వైద్యం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం నుంచి సికిల్ సెల్(రక్తరుగ్మత) వ్యాధిగ్రస్థులను గుర్తించి స్క్రీనింగ్ చేస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత వెల్లడించారు. దీనికి సంబంధించిన పోస్టర్లను బుధవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో ఆవిష్కరించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ జిల్లాలో 1,58,392 మంది గిరిజనులు ఉన్నారని, వారిలో ఎక్కువ మంది సికిల్ సెల్ వ్యాధికి గురవుతున్నారని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి రెండు రోజులు స్క్రీనింగ్ చేస్తామని తెలిపారు. ఇంటి వద్ద, పీహెచ్‌సీల్లో ఏఎన్ఎంలు, ఆశాలు ఈ పరీక్షలు చేస్తారని వివరించారు. సికిల్ సెల్ వ్యాధి వల్ల రక్తహీనత, కీళ్ల నొప్పులు, చేతులు, కాళ్లలో వాపు, స్ట్రోక్ వంటి సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డాక్టర్ రమేష్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విడవలూరు ఎంపీటీసీ ఎన్నికకు సిద్ధంగా ఉండాలి

● ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల జారీ

విడవలూరు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విడవలూరు పంచాయతీ బిట్-1లో ఖాళీగా ఉన్న ఎంపీటీసీ ఎన్నికకు మండల, రెవెన్యూ అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసినట్లు ఎంపీడీవో నగేష్‌కుమారి బుధవారం తెలిపారు. విడవలూరు ఎంపీటీసీగా గెలిచి ఎంపీపీగా ఎన్నికైన వేణుంబాక భవానమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. దీంతో ఈ సెగ్మెంట్‌లో ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈమేరకు ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేశారన్నారు. ఓటర్ల జాబితా సిద్ధంచేసి ఈనెల 30వ తేదీన పంచాయతీ, రెవెన్యూ, మండల కార్యాలయాల్లో ప్రచురించాలని ఎన్నికల కమిషన్, జిల్లాధికారులు ఆదేశాలు జారీ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

జయభారత్ ఆసుపత్రికి రూ.2లక్షల విరాళం



జయభారత్ ఆసుపత్రిలో కంటి శస్త్రచికిత్సలు చేయించుకున్న పేదలు

నెల్లూరు (వైద్యం), జూన్ 18 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని జయభారత్ ఆసుపత్రికి బుధవారం దాత రూ. 2లక్షల విరాళాన్ని అందించారు. బెజవాడ కృష్టారెడ్డి 89వ జన్మదినం సందర్భంగా ఆయన తల్లిదండ్రులు రామచంద్రారెడ్డి, బుజ్జమ్మ జ్ఞాపకార్థం ఆసుపత్రిలో ఉచిత కంటి శస్త్రచికిత్సల కోసం ఈ విరాళాన్ని అందచేశారు. ఈ నిధులతో పేదలకు కంటి శస్త్రచికిత్సలు నిర్వహించాలని ఆసుపత్రి చైర్మన్ పొన్నవోలు సీతారామిరెడ్డిని కోరారు. చైర్మన్ మాట్లాడుతూ దాత ఇచ్చిన విరాళంతో 100 మంది పేదలకు కంటి శస్త్రచికిత్సలు చేస్తామని, బుధవారం 10 మందికి శస్త్రచికిత్సలు చేశామని వెల్లడించారు.

కండలేరు ఈఈగా గజేంద్రరెడ్డి బాధ్యతల స్వీకరణ



రాపూరు, (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం కండలేరు డ్యాం శ్రీ సత్యసాయి, తెలుగు గంగ కండలేరు డివిజన్ నెంబర్- 2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వీ గజేంద్రరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అంతకు ముందు వెంకటగిరి డివిజన్, నాయుడుపేట సబ్ డివిజన్ డీఈగా పనిచేస్తూ పదోన్నతిపై కండలేరు ఈఈగా బాధ్యతలు స్వీకరించారు.

వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందించడమే లక్ష్యం

విద్యుత్ ఎస్ఈ విజయన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు,(జడ్పీ), జూన్ 18 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సంతృప్తికర సేవలు అందించటమే శాఖ ప్రథమ లక్ష్యమని, ఫిర్యాదులపై వినియోగదారులు ఫోన్ చేస్తే అధికారులు ఓపిగ్గా విని ఆ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరు నగర డివిజన్ అధికారులతో ఆయన విద్యుత్ భవన్‌లో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు విద్యుత్ శాఖ అందిస్తున్న సేవలు, అధికారులు, ఉద్యోగుల పనితీరుపై ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ప్రభుత్వం ప్రజాభిప్రాయం సేకరిస్తోందని తెలిపారు. ఈ సర్వేలో ఎవరిపైన అయినా ఆరోపణలు వస్తే తక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. 61.6శాతం మాత్రమే నిరంతర విద్యుత్ సరఫరా జరుగుతోందని, 38.4 శాతం మేర అంతరాయాలు ఉంటున్నాయని చెప్పారు. వీటిని తగ్గించే దిశగా ప్రతీ అధికారి పని చేయాలని, ఎక్కడైనా సమస్య ఏర్పడితే వెంటనే పరిష్కారించాలని సూచించారు. గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు ప్రభుత్వం కల్పించిన 50 శాతం రాయితీ అవకాశం ఈనెల 30తో ముగుస్తుందని ఆయన చెప్పారు. ఈ విషయమై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఈఈ ఎం శ్రీధర్, డిప్యూటీ ఈఈలు ఆశోక్, సునీల్‌కుమార్, ఏఈలు పాల్గొన్నారు.